ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

**బుధవారం, మార్చి 16, 2016,**

**ఇరవై ఆరవ సమావేశం, సంపుటం– II, నంబరు–1,**

**మన్మథ నామ సం. ఫాల్గుణ శు.8**

**WEDNESDAY, THE 16TH DAY OF MARCH, 2016,**

**TWENTY SIXTH SESSION, VOLUME - II , NO.1**

**26TH PHALGUN 1937 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **చైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ చైర్మన్** | : | శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీమతి పమిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు<br>శ్రీ మెట్టు గోవింద రెడ్డి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

**బుధవారం, మార్చి 16, 2016.**

# అధికార నివేదిక

---

<u>విషయ సూచిక</u>

---

(1) ప్రశ్నోత్తరాలు

(2) సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు :

అ) 2012-13, 2013-14 సంవత్సరాలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ, లెక్కలపై ఆడిట్ నివేదిక (1956 కంపెనీల చట్టంలోని సెక్షను 619 (2)) ప్రతుల సమర్పణ.

ఆ) 2009-10 నుండి 2010-11 సంవత్సరాలకు, విజయవాడ -గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ, ఆడిట్ నివేదిక (జాప్యానికి గల కారణాలతో సహా, 1975, ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల (అభివృద్ధి) చట్టంలోని సెక్షన్ 24(4)) ప్రతుల సమర్పణ.

(3) రూల్ -311 క్రింద రాయలసీమలోని పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చ

(4) 2016-17 సంవత్సరానికి వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్) పై సాధారణ చర్చ

----

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**
**WEDNESDAY, THE 16TH DAY OF MARCH, 2016**

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M., THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

MR.CHAIRMAN: Now, Question Hour.

## 1. ప్రశ్నోత్తరాలు :

### సాంఘిక సంక్షేమానికి నిధులు కేటాయింపు

ప్రశ్న నెం.8997 (51)
సర్వశ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మేకా శేషు బాబు, ఎం.ఎల్.సి.లు,

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) సాంఘిక సంక్షేమ శాఖకు 2014-15, 2015-16లలో కేటాయించిన, విడుదల చేసిన నిధుల మొత్తం ఎంత?
ఆ) అందులో ఖర్చు చేసిన మొత్తం ఎంత?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం & సాధికారికత, షెడ్యూల్డు తెగల సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి (శ్రీ రావెల కిషోర్ బాబు):

అ) 2014-15వ సంవత్సరానికి, సాంఘిక సంక్షేమ శాఖకు రూ.3287.29 కోట్లు కేటాయించడం జరిగింది. మొత్తంలో రూ. 2647.64 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడం జరిగింది. సవరించిన అంచనాలలో రూ.2537.09కోట్లు విడుదలైనవి. ఇప్పటివరకు రూ.2244.06 కోట్లు మొత్తాన్ని ఖర్చు చేయడం జరిగింది.
ఆ) 2015-16వ సంవత్సరానికి రూ.2692.61 కోట్ల మొత్తాన్ని కేటాయించడం జరిగింది. మొత్తంలో రూ.2273.75 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇప్పటివరకు రూ.1785.76 కోట్లు మొత్తాన్ని ఖర్చు చేయడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి 2014-15వ సంవత్సరానికి గాను రూ.607.51కోట్లు బడ్జెటు కేటాయించడం, మొత్తం రూ.630.35కోట్లు విడుదల చేయగా, ఇప్పటివరకు రూ.624.59 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి 2015-16వ సంవత్సరానికి గానూ రూ.563.12 కోట్లు కేటాయించగా, మొత్తం రూ.503.45కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇప్పటివరకు రూ.446.65 కోట్లు ఖర్చు చేయడం జరిగింది.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (స్థానిక సంస్థలు-గుంటూరు): అధ్యక్షా, మంత్రిగారు చదువుకుంటూ వెళ్లారు. మేము ఒక ఫిగరైతే కరెక్ట్ చేసుకుంటూ వెళ్లొచ్చు. మొత్తం ఇందులో ఇచ్చిన ఫిగర్స్ అన్నీ కరెక్ట్ కాదు. ఒక చిన్న స్లిప్ టైప్ చేయించి, మా అందరికీ పంచేస్తే సరిపోతుంది.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఈ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కి ప్లాన్ బడ్జెటు నుండి దాదాపు 22శాతం వరకు కేటాయించవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం వారు బడ్జెటు పుస్తకంలో ఇచ్చిన ఫిగర్సు, చెబుతున్న ఫిగర్సు వేరుగా ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికా నిధుల నుండి రూ.32,730 కోట్లు కేటాయించడం జరిగింది. దానిలో 22శాతం అంటే రూ.5525కోట్లు సబ్‌ప్లాన్ నిధులుగా వారు బడ్జెటులో చూపించాలి. కానీ ఖర్చు చేసిన మొత్తం రూ.2062 కోట్లు. ఇంకా రూ.3,463 కోట్లు మిగిలి ఉంది. That is non-lapsable amount. అయితే 2015-16 ఆర్థిక సంవత్సర బడ్జెటులో దానిని ఎక్కడా కూడా చూపించలేదు. అదేవిధంగా 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్లాన్ నిధులు రూ.34,412 కోట్లు. దానిలో రెండువేల నుంచి రెండు వేల ఐదు వందల కోట్లు వరకు మిగిలి ఉంటాయి. అవన్నీ కూడా నాన్ ల్యాప్సబుల్ అమోంట్స్. సబ్‌ప్లాన్ నిధులను విధిగా ఆ సంవత్సరం ఖర్చు పెట్టవలసిన అవసరం ఉంది. ఒకవేళ ఏ పరిస్థితులలోనైనా ఖర్చు పెట్టకపోతే అది తదుపరి సంవత్సరమైనా విధిగా ఖర్చు పెట్టవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం ఖర్చు పెట్టినవి కొంతైనా గానీ, ప్రచారం మాత్రం బ్రహ్మాండంగా చేస్తుంది.

సబ్‌ప్లాన్ నిధులకు ఒక కొత్త చట్టాన్ని ఈ ప్రభుత్వం తీసుకువచ్చింది. దాన్ని తీసుకువచ్చిన మొదటి సంవత్సరమే అమలు చేయడం మరిచారు. రెండవ సంవత్సరం అసలు దానిని పట్టించుకోలేదు. ఈ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వ కళాశాలల భవనాలకు గానూ 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.15.82 కోట్లు ఖర్చు పెట్టారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్లు మరియు రూ.418 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రొవిజనల్‌గా చూపించారు. అలాగే 2014-15 ఆర్థిక సంవత్సరంలో వీడియో కాన్ఫరెన్స్ ఫెసిలిటీస్ ఇన్ మండల్ హెడ్ క్వార్టర్స్‌కు కూడా సుమారు రూ.30,79,00,000 ఖర్చు పెట్టారు. దీని ద్వారా ఎస్సీ నిధులను ప్రభుత్వం ఏవిధంగా మళ్లిస్తుందో మీకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా 2016-17 ఆర్థిక సంవత్సరంలో సర్దార్ గౌతు లచ్చన్న తాటిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టుకి రూ.612కోట్లు, పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకి రూ.2 వేల కోట్లు ప్రొవిజనల్ బడ్జెట్‌లో చూపించారు. అంటే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఖర్చు పెట్టే రీతి ఇదేనా? ఓల్డ్ ఈ.ఎన్.టి. హాస్పిటల్‌లో అదనపు గదుల నిర్మాణం కోసం 2014-15 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.22,18,00,000 ప్రొవిజనల్ బడ్జెట్‌లో చూపించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతుల ప్రగతికి ఖర్చు పెట్టవలసిన నిధులన్నింటినీ కూడా వేరే వాటికి మళ్లిస్తున్నారు. ఇది ఎంతవరకు కరెక్ట్? ఇవన్నీ ప్రభుత్వం ఇచ్చిన బడ్జెటు పుస్తకంలోనే ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి తోటపల్లి రిజర్వాయర్‌కి గానీ, వెలుగొండ ప్రాజెక్టుకు కానీ కేటాయించినట్లు బడ్జెటు పుస్తకంలోనే ఉంది. ఈ నిధులను ప్రొవిజనల్ బడ్జెట్‌లో ఎందుచేత పెట్టారో మంత్రిగారు చెప్పవలసిన అవసరం ఉంది.

ఉ. 10.10

శ్రీ రావెల కిషోర్ బాబు: అధ్యక్షా, గౌరవ సభ్యులు ప్రశ్న అడిగింది ఒకటి, వారు మాట్లాడుతున్నది మరొకటిగా ఉంది.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్: అధ్యక్షా, ఇవన్నీ బడ్జెట్ పుస్తకంలోనే ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన నిధులను వెలుగొండ ప్రాజెక్టు మొదలైన వాటికి ఖర్చు పెట్టారని ఈ పుస్తకంలో ఉన్నాయి. పూర్తిగా షెడ్యూల్డు కులాల అభివృద్ధికి మాత్రమే ఖర్చు పెట్టవలసిన నిధులను ఏ విధంగా డైవర్ట్ చేయడానికి ప్రపోజల్సు పెట్టారు. దానికి సమాధానం చెప్పమనండి. ఈ నిధులను ఎందుకు ప్రక్కదోవ పట్టించారని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాము.

శ్రీ రావెల కిషోర్ బాబు : ప్రస్తుతం సభ్యులు అడిగిన ప్రశ్న వేరు, ఇప్పుడు మాట్లాడుతున్న ప్రశ్నలు వేరు.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ : (మైకు లేకుండా)మండల హెడ్ క్వార్టర్స్‌లో వీడియో కాన్ఫరెన్సు సదుపాయాలకు కూడా ఈ నిధులనే ఖర్చు పెట్టారు. నేను ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన నిధుల విషయే అడుగుతున్నాను. ఇది ప్రస్తుత ప్రశ్నకు సంబంధించిన అంశమే. అంతకు మించి నేను ఏమీ అదనంగా అడగడం లేదు. ఎస్సీ సబ్‌ప్లాన్‌లో కేటాయించిన నిధులను, పూర్తిగా షెడ్యూల్డు కులాల అభివృద్ధికోసం ఖర్చుపెట్టవలసిన నిధులను వెలుగొండ ప్రాజెక్టుకు, సర్దార్ గౌతు లచ్చన్న ప్రాజెక్టులకు మొదలైన వాటికి ఖర్చు పెడుతున్నారు.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గౌరవ సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో ఏ ప్రశ్న అడిగారో, ఆ ప్రశ్నకే కన్‌ఫైన్ అవ్వమనండి. అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కి సంబంధించి తరువాత సమయం తీసుకుని ఎన్ని గంటలైనా డిబేట్ పెడతాము నాకు అభ్యంతరం లేదు. ప్రస్తుతం ప్రశ్నోత్తరాల సమయానికి సంబంధించి సభ్యులను స్టిక్‌ఆన్ అవమనండి. వారు అడిగిన ప్రశ్న సాంఘిక సంక్షేమ శాఖకు 2014-15, 2015-16లో విడుదల చేసిన నిధుల గురించిన ప్రశ్న అడిగారు. అందుకు సంబంధించిన ప్రశ్నకు నేను సమాధానం చెపుతున్నాను. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన డిబేట్ కావాలంటే, తరువాత వారు వేరే రూపంలో వస్తే ఎంత సేపు అయినా చర్చిస్తాను. నేను దానికి సంబంధించిన చర్చకు ఎప్పుడైనా సిద్ధమే. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సంబంధించి మాట్లాడితే బావుంటుందని నా ఉద్దేశం.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ : అధ్యక్షా, ఇది పూర్తిగా షెడ్యూల్డు కులాలకు సంబంధించిన ప్రశ్నే. వారికి కేటాయించిన నిధులతో వేరే అభివృద్ధి పనులను చేస్తున్నారు. అంతేగాకుండా, షెడ్యూల్డు కులాల అభివృద్ధికి ఇంతమేర నిధులను ఖర్చు పెడుతున్నామని అంకెలు మాత్రం పెద్దఎత్తున చూపిస్తున్నారు. మండల ఆఫీసుల్లో వీడియో కాన్ఫరెన్సు గదులు నిర్మించడానికి, షెడ్యూల్డు కులాల ప్రజల అభివృద్ధికి ఖర్చుపెట్టకుండా వీటికి ఖర్చుపెట్టారంటే, ఏమనుకోవాలి సార్? ఆ నిధులన్నీ ప్రక్కదారి పడుతున్నాయి.

శ్రీ రావెల కిషోర్‌బాబు : అధ్యక్షా, ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు వేసిన ప్రశ్న గురించి కాకుండా, వేరే అంశాల గురించి మాట్లాడితే ఎలా? దానికి మీరు ప్రత్యేకమైన సమయం కేటాయించండి. నేను గంటల తరబడి డిబేట్ చేస్తాను. అధ్యక్షా, తమరిని నేను అడిగే ప్రశ్న ఏమిటంటే, ప్రశ్నోత్తరాల సమయంలో కేవలం సభ్యులు అడిగిన ప్రశ్నకు సంబంధించి మాట్లాడతారా? లేక వేరే అంశాలకు సంబంధించి మాట్లాడతారా? అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగే ఇతర ప్రశ్నలకు సమయం కేటాయించినట్లయితే, నేను గంటలతరబడి డిబేట్ చేస్తాను. ఇందుకు సంబంధించి మీరు క్లారిఫికేషన్ ఇస్తే నేను ముందుకు వెళతాను.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ : అధ్యక్షా, మేము అడిగే ప్రశ్నలకు మంత్రిగారి దగ్గర సమాధానం లేదని చెప్పండి. సబ్‌ప్లాన్‌కు సంబంధించి చట్టం కూడా చేశారు. వాటికి కేటాయించిన నిధుల గురించే నేను మాట్లాడుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : (శ్రీ రావెల కిషోర్ బాబుని ఉద్దేశించి) మీరు చెప్పండి సార్.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్న ఏమిటంటే, 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఎంత మేరకు నిధులు వచ్చాయి, ఆ నిధులు ఎంత ఖర్చు పెట్టారు అనేది ప్రశ్న. నేను దానికి సిద్ధపడి ప్రిపేర్ అయి వచ్చాను. ఇందుకు సమాధానాలు చెప్పడానికి నేను రెడీగా ఉన్నాను. అది కాకుండా గౌరవ సభ్యులు జంప్ అయిపోయి, వేరే అంశాల గురించి మాట్లాడుతున్నారు. దీనికి సెపరేట్‌గా టైం ఇవ్వండి. నేను అన్ని విషయాలను చర్చిస్తాను.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ : అధ్యక్షా, నేను షెడ్యూల్డు కులాలకు సంబంధించిన నిధులను డైవర్ట్ చేస్తున్నారు కాబట్టి, వాటి గురించి అడిగాను. అది ప్రస్తుత ప్రశ్నకు సంబంధించినదే. దానికి సమాధానం చెప్పండి.

శ్రీ రావెల కిషోర్ బాబు : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఏదైతే తెలుగుదేశం మేనిఫెస్టోలో పొందుపరచామో, ఆ విధంగా చిత్తశుద్ధితో అమలుచేస్తున్న రాష్ట్రం ఏదైనా భారతదేశంలో ఉందంటే, అది కేవలం మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే. ఇది నేను అన్న మాటలు కావు. Sri Tawab Chand Gehlat స్వయాన కేంద్ర మంత్రివర్యులు రాష్ట్రాల సమావేశంలో సబ్‌ప్లాన్ సమీక్షకు సంబంధించినటువంటి అన్ని రాష్ట్రాల సమావేశాలలో ఆయన చెప్పారు. అంతేగాకుండా, సబ్‌ప్లాన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ విధంగా అమలుచేస్తున్నారో, ఇది ఆదర్శనీయమని, ఇలాంటి విధానాన్ని అన్ని రాష్ట్రాలలో అమలుపరచడానికి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కూడా ఇవ్వమని నన్ను అడగడం జరిగింది. అధ్యక్షా, తమ ద్వారా నేను ఒక విషయం చెప్పదలచుకున్నాను. చట్టం వచ్చిన తరువాత, ఆ చట్టంలో institutional arrangements పెట్టారు. అందులో ఒకటి ఏమిటంటే, S.C., S.T., Development Council అని చెప్పి, మన ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలో ఒక క్రొత్త ఇన్‌స్టిట్యూషన్ వచ్చింది. ఆ తరువాత నోడెల్ ఏజన్సీ అని చెప్పి, సాంఘిక సంక్షేమ మంత్రిగారి ఆధ్వర్యాన ఒక ఇన్‌స్టిట్యూషన్ వచ్చింది. జిల్లాలో District Monitoring Committee అని జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఒక ఇన్‌స్టిట్యూషన్ వచ్చింది. ఈ మూడూ ఇన్‌స్టిట్యూషన్లు చట్టం ద్వారా వచ్చాయి. ఈ మూడు ఇన్‌స్టిట్యూషన్లను మేము బలోపేతం చేసి, దాదాపు 45 డిపార్టుమెంట్లకు ఈ నిధులను అలొకేట్ చేస్తున్నాము. ఈ సంవత్సరం వాటికి కేటాయించిన నిధుల గురించి కూడా తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తాను. దాదాపు రూ.45,000కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించి, దోపిడీ చేసి, కుంభకోణాలు చేసి జేబులు నింపుకున్నటువంటి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అయిన సుభాస్ చంద్రబోస్ గారు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారంటే ఇది ఎంత అపహాస్యం అంటే, ఆ నిధులన్నీ దారి మరల్చారు. మా ప్రభుత్వం ఒక్క రూపాయి సబ్‌ప్లాన్ నిధులన్నా ఖర్చు పెట్టకుండా దారి మరల్చిందని నిరూపిస్తే మేము ఎలాంటి శిక్షకైనా సిద్ధమే అధ్యక్షా. మేము నిరూపిస్తాము. ఔటర్ రింగ్ రోడ్డుకు, జలయజ్ఞానికి మీరు (కాంగ్రెస్ పార్టీ)సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు పెట్టారు.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ :  (మైకు లేదు)  ఏం మాట్లాడుతున్నారు మీరు. మేము అడిగిన ప్రశ్నకు మీ దగ్గర సమాధానం లేదు, అందుకే మాకు చెప్పడం లేదు.

శ్రీమతి పమిడి శమంతకమణి(శాసనసభ నియోజక వర్గం) :  అధ్యక్షా, మీరు ఇచ్చిన టైం ప్రశ్నకు జవాబు చెప్పడం.  ఆయన అడిగిన టైంలో ప్రశ్న ఒకటి.  నిధుల కేటాయింపు గురించి అడిగారు.  ఇది మాకు సంబంధించిన ప్రశ్నే కాబట్టి, మేము చెపుతున్నాము.  ఇంకా చాలామంది మాట్లాడాలి.

(అంతరాయం)

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : సార్, మేము సిగ్నటరీస్, మాకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వండి.

MR. CHAIRMAN : No more discussion. I am going to take-up next question.

**అనంతపురంలోని ఎస్.సి. హాస్టళ్ళు**

ప్రశ్న 8981 (52)
శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం & సాధికారత మరియు గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ?

(అ) అనంతపురం జిల్లాలో ఎస్‌సి హాస్టళ్ళను తగ్గించిన విషయం వాస్తవమేనా?
(ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి?

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం & సాధికారత మరియు గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి (శ్రీ రావెల కిషోర్ బాబు):

(అ) బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు మంచి విద్యను, మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి దశల వారీగా అన్ని సంక్షేమ హాస్టళ్ళను నైవాసిక పాఠశాలలుగా మార్చాలని ప్రభుత్వం ఒక విధాన నిర్ణయాన్ని తీసుకున్నది.  ఆ సందర్భంగా, 1వ దశ క్రింద, అనంతపురము జిల్లాలోని 26 ఎస్‌సి హాస్టళ్ళలోని 228 మంది బోర్డర్లను సమీపంలో ఉన్న 9 నైవాసిక పాఠశాలలకు మార్చడమయింది.
(ఆ) ఎస్‌సి విద్యార్థులకు మంచి విద్యను, మౌలిక సదుపాయాలను సమకూర్చడం ఉద్దేశంగా ఈ యొక్క నిర్ణయం తీసుకోవడం జరిగింది.

శ్రీమతి పమిడి శమంతకమణి :  అధ్యక్షా, అనంతపురం జిల్లాలో ఎస్సీ హాస్టల్స్ 3, కళాశాల హాస్టల్స్ 15 ఉన్నాయి.  మొత్తం హాస్టల్సును చూసినట్లయితే, దాదాపు 7,000 మంది విద్యార్థులు ఉన్నారు.  ఇందుకు సంబంధించి గౌరవ మంత్రిగారు ఆ పిల్లలకు భోజన వసతులన్నీ కల్పించడానికి వారికి స్పెషల్ స్కూల్స్ పెట్టి, ఇక్కడ ఉన్న పిల్లలందరినీ అక్కడకి డైవర్ట్ చేసి, వారికి మంచి జీవన విధానాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడంతో, నేను మంత్రిగారిని అభినందిస్తున్నాను.  కానీ, ప్రస్తుతం

ఉన్న హాస్టల్స్‌లోని వార్డెన్లు వాటి నిర్వహణ, పర్యవేక్షణ సరిగ్గా చేయడం లేదు. ఈ వార్తలన్నీ రోజువారీ పత్రికలలో రావడం, వాటి గురించి రకరకాలుగా వ్రాయడం చాలా బాధాకరంగా ఉంది. పేదవిద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎంతో ఆశతో వారి పిల్లల్ని హాస్టల్స్‌లో జాయిన్ చేస్తున్నారు. ఎందుకంటే, ఆ పిల్లలకు సమయానికి భోజనం, విద్య అందిస్తారనే ఆశతో ఆ తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆ పాఠశాలలో చేరుస్తున్నారు. పర్యవేక్షణ చేసే వార్డెన్ల మీద తగిన చర్యలు తీసుకుని, సక్రమంగా ఆ హాస్టళ్ళ నిర్వహణ కొనసాగించవలసిందిగా తమ ద్వారా నేను గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

(ఈ నేపథ్యంలో శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి గారు మాట్లాడడానికి నిలబడ్డారు.)

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గౌరవ సభ్యురాలు చెప్పే అంశాలను కూడా నేను చెపుతాను.

శ్రీ బి. చంగల్ రాయుడు (శాసనసభ నియోజక వర్గం): (మైకు లేదు) అధ్యక్షా, గౌరవ మంత్రిగారిలో కాలజ్ఞానాన్ని వ్రాసిన వీరబ్రహ్మేంద్రస్వామిగారు ఏమైనా దూరారా సార్? మంత్రిగారు ముందుగానే చెప్పడానికి కాలజ్ఞానాన్ని రచించిన వీరబ్రహ్మేంద్ర స్వామి గారు ఆయనలో ఆవహించినట్లున్నారు.

ఉ.10.20

శ్రీ రావెల కిశోర్‌బాబు: అధ్యక్షా, శమంతకమణి గారు ఎస్సీ హాస్టల్స్ గురించి అడిగారు. మా ఎమ్మెల్సీ గారు ఎస్సీ హాస్టల్స్ గురించి అడగడం అన్నది కామన్‌సెన్స్. ఆవిడ (సభ్యురాలు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి) ఎస్టీ హాస్టల్స్ గురించి అడిగింది.

శ్రీ మహ్మద్ జానీ(శాసనసభ నియోజక వర్గం) : అధ్యక్షా, కామన్ సెన్స్ అంటే ఏమిటి? నేను కూడా మంత్రిగా పనిచేశాను. కానీ, ఇలాంటి సమాధానం ఎప్పుడూ చెప్పలేదు.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, మీరు పర్మిషన్ ఇచ్చారు. వారిని చెప్పనివ్వండి.

శ్రీ రావెల కిశోర్‌బాబుః అధ్యక్షా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన, సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని, భవిష్యత్తులో వాళ్లు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలని ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆ నిర్ణయం ఏమంటే – ప్రభుత్వ హాస్టల్స్ ఏవైతే ఉన్నాయో ఈ హాస్టల్స్ అన్నింటినీ కూడా దశలవారీగా రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడమనేది ఆ చారిత్రాత్మకమైన నిర్ణయం.

ఆ రోజున స్వర్గీయ శ్రీ ఎన్.టి. రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించిన కొత్తలో వారు రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన వాడల్లో పర్యటిస్తున్న రోజుల్లో అక్కడ ఉన్నటువంటి వెనుకబాటుతనాన్ని, పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, వారు అనుభవిస్తున్న కష్టనష్టాలను, బాధలను

చూసి చలించిపోయి కేవలం విద్య ద్వారా తప్ప దళిత, గిరిజనులు బాగుపడటం సాధ్యం కాదని, విద్య ద్వారా మాత్రమే ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వారు అభివృద్ధి చెందుతారని ఆ రోజుల్లోనే రెసిడెన్షియల్ స్కూళ్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. రెసిడెన్షియల్ స్కూళ్ల విధానమనేది ఇవాళ భారతదేశంలో పెద్దఎత్తున అమలు చేస్తున్న రాష్ట్రం మనది. గౌరవ మండలి సభ్యులు అడిగిన దాని మేరకు రెసిడెన్షియల్ స్కూళ్ల విధానంలో భాగంగా హాస్టళ్లన్నింటినీ క్రమేపీ రెసిడెన్షియల్ స్కూళ్లుగా మారుస్తున్నాము. అది కూడా కొంత దశలవారీగా జరుగుతోంది. మొదటి దశలో 50 మంది కంటే తక్కువ మంది పిల్లలున్న హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చాము. మిగతా హాస్టళ్లని రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడానికి మూడు కమిటీలు వేశాము. Committee of Secretaries, Inter Departmental Committee, District Level Committees వేశాము. ఈ కమిటీల ద్వారా హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చే ప్రక్రియను దశలవారీగా పూర్తి చేసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన, ఉత్తమమైన విద్యను అందించడానికి రెసిడెన్షియల్ స్కూళ్ల విధానాన్ని ప్రవేశపెట్టి భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ని ఆదర్శంగా నిలుపుతామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి(శాసనసభ నియోజక వర్గం): అధ్యక్షా, మంత్రి గారిని ఆ ప్రశ్న వారి కార్యాలయంలో అడిగాను. మంత్రి గారు సభలో దానికి సమాధానమిచ్చారు. అయితే, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చాలా వరకు హాస్టళ్లలో బయోమెట్రిక్ విధానం ద్వారా విద్యార్థుల హాజరుని చూడటం వల్ల అక్కడ జరుగుతున్న అవకతవకల్ని కొంతవరకు అరికట్టడం జరుగుతోంది. అయితే, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉండే అమ్మాయిలకు కాస్మొటిక్ ఛార్జీలు కొంచెం పెంచగలిగితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే, ఈ సంవత్సరం ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఎన్నింటిని మీరు రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చబోతున్నారు? వాటికి ఎంత అమౌంట్ ఎలాట్‌మెంట్ చేశారనేది మంత్రి గారిని నేను అడగదల్చుకున్నాను. వాస్తవానికి మా ఏరియాలో ఎస్సీ, ఎస్టీ పాపులేషన్ చాలా ఎక్కువ. పిల్లలు చదువుకోవాలంటే స్కూళ్లలో, కాన్వెంట్లలో మొదటి నుండి అప్లికేషన్ పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. కాబట్టి, మా ఏరియాలో ఎక్కువ సంఖ్యలో స్కూళ్లు, హాస్టళ్లు పెట్టినట్లయితే చాలా బాగుంటుంది. ఎందుకంటే, ఎక్కడా రెసిడెన్షియల్ స్కూళ్లలో సీట్లు దొరకడం లేదు. అది మంత్రి గారి దృష్టికి కూడా తీసుకువెళ్లాము. దయచేసి, దాని మీద దృష్టి పెట్టమని మంత్రి గారిని అభ్యర్థిస్తున్నాను అధ్యక్షా.

డా.బచల పుల్లయ్య (ఉపాధ్యాయ నియోజక వర్గం–కడప, అనంతపురం, కర్నూలు): అధ్యక్షా, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో పనిచేసే గురుకుల పాఠశాలలు కొన్ని ఉన్నాయి. ఈ పాఠశాలల్లో పనిచేసే 8 మంది ప్రిన్సిపాల్స్ ఏపీ వాళ్లు తెలంగాణాలో పనిచేస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత మీ సర్వీసులు మాకొద్దు, మీరు వెళ్లిపోండని తెలంగాణా ప్రభుత్వం రిలీవ్ చేసింది. వాళ్లకు మన ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడైనా ప్లేస్‌మెంట్ ఇచ్చిందా? నాకు తెలిసి మన రాష్ట్రంలో 70, 75 ఖాళీలున్నాయి. ఈ 8 మందిని ఎక్కడో ఒకచోట అకామడేట్ చేయొచ్చు. కాబట్టి మీ ద్వారా నేను మంత్రిగారిని కోరేదేమంటే ఈ 8 మంది ప్రిన్సిపాల్స్‌కు ఎక్కడైనా ప్లేస్‌మెంట్ ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే ఎప్పుడిస్తారో దయచేసి తెలియజేయాల్సిందిగా మీ ద్వారా నేను మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజక వర్గం–ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు): అధ్యక్షా, 26 హాస్టళ్లలో ఉన్న 228 మంది బోర్డర్లను 9 గురుకులాల్లో చేర్చామని మంత్రి గారి

సమాధానంలో ఇచ్చారు. అంటే 26 హాస్టళ్లలో 228 మంది మాత్రమే ఉన్నారా? ఒక్కో హాస్టల్‌లో కనీసం 9 మంది కూడా లేరా? 10 మంది లోపు పిల్లలే ఒక్కో హాస్టల్లో ఉన్నారా? నాకేమీ అర్థం కావడంలేదు. రెండవదేమంటే – 228 మందిని గురుకులాల్లో చేర్చామంటున్నారు కదా. ఇప్పుడు ఆ 9 గురుకుల పాఠశాలల్లో 228 మందిలో ఎంత మంది ఉన్నారు? దీన్ని కూడా మీరు విచారించి చెప్పగలిగితే మంచిది.

మూడవదేమంటే – అన్నింటికన్నా మేము భయపడేది, ఆందోళన చెందేది ఏమంటే మూడు, నాలుగు హాస్టళ్లు ఒకే చోట ఉండి అవన్నీ జిల్లా పరిషత్తు హైస్కూళ్లకు అటాచ్ అయ్యి ఉన్నాయి. ఇప్పుడు ఈ హాస్టల్స్ అన్నింటినీ మీరు అక్కడి నుండి తరలించి ఎక్కడికో పంపిస్తాము అనంటే ఈ హైస్కూళ్లు అన్నీ కూడా నూరు, నూట ఇరవై మందికి లోపల ఉండేట్లుగా పడిపోతాయి. మీరు చూడండి. రాష్ట్రంలో ఉన్నటువంటి పెద్ద పెద్ద హైస్కూళ్లన్నీ హాస్టళ్లకు అటాచ్ అయి ఉన్నాయి. ఒకసారి మీరు మీ శాఖ నుండి వాటిని డిటాచ్ చెయ్యాలని నిర్ణయించుకుంటే స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుకు సంబంధించి అక్కడున్న బిల్డింగ్స్, మిగతా వసతులన్నీ దండగైపోతాయి కదా! కాబట్టి, ఈ రెండింటి మధ్య ఏదన్నా కోపరేషన్ ఉందా అని మేము ప్రశ్నిస్తున్నాం. చాలా నష్టం వస్తుంది. అందువల్ల మీరు నిర్ణయం తీసుకునేటప్పుడు మేము గురుకుల పాఠశాలలను పెట్టి వీళ్లందరికీ అత్యుత్తమమైన విద్యను అందిస్తామంటే మేమేమీ వ్యతిరేకం కాదు. కానీ, ఆ పని చేసేటప్పుడు గ్రౌండ్ లెవల్లో వచ్చే ప్రత్యేకమైన సమస్యలను దృష్టిలో పెట్టుకోకపోతే నా అంచనా ప్రకారంగా నాలుగైదు వేల మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్తు స్కూళ్లలో సర్ప్లస్ అవుతారు, కొన్నివేల రూములు దండగగా మారతాయి, పెద్ద పెద్ద హైస్కూళ్లన్నీ నామమాత్రపు స్కూళ్లుగా మారతాయి. ఈ విషయాన్ని కొంచెం గమనించమని కోరుతున్నాను. దాని కోసం ప్రత్యేకమైన మెకానిజం ఏర్పాటు చేస్తారో, లేక ఒక సర్వే చేసి వివరాలు తెప్పించుకుని అలాంటి స్కూళ్లని కాపాడేందుకు వాటిని మాత్రం మినహాయిస్తారో.. ఏదో ఒకటి చేయండి.

మీరు చెప్పినట్లుగా హాస్టళ్ల నుండి బయటకు పంపించిన పిల్లలందరూ గురుకులాల్లో లేరు. 20 శాతం కూడా లేరు. నూటికి నూరు శాతం ఇది వాస్తవం. అట్లాగే మీరు గురుకులాలు పెడతామంటున్నారు. ఈ హాస్టళ్లన్నీ మూసేస్తే, లేదా పెడితే ఎన్ని గురుకులాలు కొత్తవి పెట్టడానికి మీరు ప్లాన్ చేశారు. ఆ వివరాలేమన్నా ఉన్నాయా? ఇప్పుడున్న గురుకుల పాఠశాలలు ఏవిధంగా రన్ అవుతున్నాయి. వాటి పరిస్థితి ఏమిటనేది కూడా ఒక అంచనా ఉండాలి కదా. అసలు మీ గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఆప్షన్ ఇచ్చి జిల్లా పరిషత్తు స్కూళ్లకు పోతారా అనంటే పిలపిలామని ఒక్కరు కూడా లేకుండా వెళ్లిపోతారు. ఆ రకంగా అక్కడున్న ఉపాధ్యాయుల విషయంలో పరిస్థితులున్నాయి. అదే మీరు నవోదయ విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేరే పాఠశాలకు వెళతారా అని అడగండి. ప్రాణం పోయినా వాళ్లు చెప్పరు. గురుకులాల్లో ఉండే ఉపాధ్యాయులు అలా చెప్పే పరిస్థితి వచ్చిందంటే ఎందుకు వచ్చింది? అందరికీ పదవీ విరమణ వయోపరిమితి 58 నుండి 60 ఏళ్లకు పెంచినా, వీళ్లకి మాత్రం పెంచలేదు. అందరికీ పిఆర్‌సి ఇచ్చినా గురుకులాల వారికి ఇవ్వలేదు. గురుకుల పాఠశాలలను మీరు అత్యుత్తమ పాఠశాలలుగా మార్చాలనుకున్న తరువాత ఆ పాఠశాలల్లో అన్ని రకాల ప్రమాణాలు ఉండాలి కదా? మీరు దీని మీద మనసు పెట్టండి. మీరు మంచి పనులు చేస్తుండొచ్చు. కానీ, దాని ఫలితాలు క్రింది స్థాయిలో నాసిరకంగా ఉన్నట్లయితే తీవ్రమైనటువంటి ప్రతిఘటన కూడా వచ్చే ప్రమాదం ఉంది. హైస్కూళ్లు మొత్తం మూలనపడే ప్రమాదముంది.

శ్రీ మేకా శేషుబాబు(స్థానిక సంస్థలు–పశ్చిమగోదావరి): అధ్యక్షా, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో చాలా దయనీయమైన పరిస్థితులున్నాయి. మేము అప్పుడప్పుడు ఆ హాస్టళ్లని విజిట్ చేసినప్పుడు అక్కడ సరైనటువంటి డ్రింకింగ్ వాటర్ లేక, అక్కడ ఉండటానికి ఫ్యాన్లు లేక, పైన శ్లాబ్ కూడా సరిగ్గాలేక పెచ్చులూడిపోయే పరిస్థితులను మేం గతంలో కూడా చూడటం జరిగింది. అదేవిధంగా చూసినట్లయితే, చాలా హాస్టల్స్ మూతపడుతున్నాయి. స్టూడెంట్స్‌ని హాస్టల్స్‌లో జాయిన్ చెయ్యాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితి తల్లిదండ్రులకు వస్తోంది. హాజరు శాతం కూడా తగ్గిపోతోందంటే దీంట్లో మౌలిక సౌకర్యాలు లేకపోవడం వల్లే ఈ అటెండెన్స్ శాతం కూడా తగ్గిపోతోంది. గతంలో ఇంచుమించు 30,40 సంవత్సరాల క్రితమే ఈ బీసీ హాస్టళ్లు, ఎస్టీ హాస్టళ్లు ఎంతో ప్రతిష్టాత్మకంగా నడిచి, అందులో చదువుకున్న ఎంతోమందికి ఉద్యోగాలు వచ్చిన పరిస్థితికి భిన్నంగా ఉన్న పరిస్థితి నేడు ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడం వల్ల, పౌష్టికాహార లోపం వల్ల అనేక రకాలుగా విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. కాస్మొటిక్ చార్జీలు కూడా పెంచాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. ముఖ్యంగా అక్కడ ఉండాల్సిన వార్డెన్లు గానీ, నైట్‌వాచ్‌మెన్లు గానీ, కుకింగ్ స్టాఫ్ గానీ లేకపోవడం వల్ల అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక హాస్టల్‌కు వేరే హాస్టల్ నుండి కూడా ఇంఛార్జులను పెట్టే విధంగా జరుగుతోంది. ఏ హాస్టల్లో ఉన్న వార్డెన్ ఆ హాస్టల్లోనే ఉండేలా చూస్తే, ఏ రకమైన లోపాలు లేకుండా ఉండేందుకు అవకాశముంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ రోజున చూస్తే రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాల్లోని హాస్టల్స్ మూతపడే పరిస్థితి ఉంది. మంత్రి గారు మాత్రం దాన్ని సమర్థించుకునే విధంగా చేస్తున్నారు తప్ప, అందులోని లోపాల గురించి కూడా ఆయన ఆలోచించాలని ఈ సందర్భంగా మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

ఉ. 10.30

శ్రీ రాము సూర్యారావు : అధ్యక్షా, ఏలూరు హాస్టల్ కాంప్లెక్స్‌లో రెండు నెలల క్రితం ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సౌకర్యాలు లేవని బాలికలు ఆందోళన చేయడం, దానిపై పోలీసులు యాక్షన్ తీసుకోవడం జరిగింది. దయచేసి మీ తరఫున మంత్రిగారికి విజ్ఞప్తి చేసేదేమంటే, వారు అటుగా వచ్చేటప్పుడు ఆ హాస్టల్స్‌ని విజిట్ చేసి ఏఏ సౌకర్యాలు లేవో వాటిని పరిశీలించి, తగిన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించి విద్యార్థులు చక్కగా చదివేలా చూడాలని కోరుతున్నాను.

డా. ఎ. ఎస్ రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం–కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, నాదొక చిన్న సూచన. ఈ మధ్య మంత్రిగారు సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు బ్రహ్మాండంగా నిర్వహించారు. చాలా సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇదే విధానాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తే ఫలితాలు బాగా వస్తాయని నేను అనుకుంటున్నాను. 9వ తరగతి, 10వ తరగతి చదివే పిల్లలకు ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లో గైడెన్స్, కౌన్సిలింగ్ సెల్స్ నిరంతరంగా ఉండాలని అనేక కమీషన్లు చెబుతున్నాయి. ఎందుకంటే ఆ స్కూల్స్‌లో చదివే పిల్లలు ముఖ్యంగా బలహీన వర్గాల పిల్లలు ఉంటారు. వాళ్లల్లో కొంత ఆత్మన్యూనతా భావం ఉండడమనేది సహజం. అందుకని ప్రతి పాఠశాలలో కూడా శాశ్వత ప్రాతిపదికన గైడెన్స్ మరియు కౌన్సిలింగ్ సెల్స్ పెట్టినట్లయితే నిరంతరంగా, మానసికంగా శక్తివంతంగా ఉండడానికి, న్యూనతాభావం లేకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని చాలా కాలం క్రితం

కొఠారి కమీషన్ కూడా రికమండ్ చేసింది. దీనిని గమనించవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం-శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) : అధ్యక్షా, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుగారు వచ్చిన తరువాత ప్రధానంగా పేదవిద్యార్థుల కోసం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నారు. కానీ, అవి ఆ విద్యార్థులకు చేరే మార్గమధ్యంలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నేను మంత్రిగారిని కోరేదేమంటే, ప్రభుత్వం ఇచ్చినటువంటి నిధుల అమలుపై ప్రత్యేక స్క్వాడ్స్ వేసి పిల్లల తాలూకు బాగోగులను పర్యవేక్షిస్తే బాగుంటుంది. అదే విధంగా హాస్టల్స్ తాలూకు మౌలిక వసతులకు సంబంధించిన పనులు చేసేందుకు జోన్‌కు ఒకటైనా స్పెషల్ స్క్వాడ్‌ను పెట్టి సర్‌ప్రైజ్ విజిట్ చేసినట్లయితే తప్పనిసరిగా ఈ సిస్టమ్ బాగుపడుతుంది. అప్పుడే మీరనుకున్న చంద్రన్న ఫలాలు వాళ్లకు చేరతాయని ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు: గౌరవ సభ్యులు మంచి సూచనలు, సలహాలు తెలియచేశారు. వారందరికీ ధన్యవాదాలు. అనంతపురం జిల్లాలో అందరినీ మార్చలేదు అధ్యక్షా. 5,6,7వ తరగతుల పిల్లలను మాత్రమే హాస్టల్స్‌లోకి మార్చడం జరిగింది. హాస్టల్స్‌ని రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఇది చాలా కాంప్లెక్స్ ఇష్యూ. సభ్యులు శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం గారు కూడా చెప్పారు. ఒక హాస్టల్‌ను రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చాలంటే అందులో అనేక రకాల కారణాలు వస్తున్నాయి. ఆ హాస్టల్‌లోని పిల్లలు మున్సిపల్, జడ్‌పి, మండల, ప్రభుత్వ పాఠశాలలకు వెళుతుంటారు. ఎప్పుడైతే ఈ హాస్టల్స్‌ను రెసిడెన్షియల్‌గా మార్చామో, అప్పుడు ఆయా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. పైగా, ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా పనిలేకుండా పోతుంది. ఇది కాంప్లెక్స్ ఇష్యూ. ఇందులో విద్యాశాఖ, జడ్‌పి హైస్కూల్, ఎస్సీ, ఎస్టీ, మున్సిపల్ కార్పొరేషన్ శాఖలు భాగంగా మారతాయి. ఈ శాఖలన్నీ కలిపి స్పష్టమైన విధివిధానాలను తీసుకువస్తే తప్ప ఈ హాస్టల్స్‌ని రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చడం సాధ్యం కాదు. అందుకోసం Secretaries Committee ని వేశాము. ఆ కమిటీ సమావేశమై వారి ప్రతిపాదనలను రిపోర్టు రూపంలో ఇస్తున్నారు.

అంతేకాకుండా, ఒక Inter Departmental Committeeని కూడా వేశాము. Commissioner of School Education, Director of Social Welfare, Director of B.C. Welfare, Director of Tribal Welfare, Representative of Minority Welfare Department dealing with Education వారితో ఒక ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీని వేయడం జరిగింది. జిల్లా స్థాయిలో కూడా హాస్టల్స్‌ను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలంటే క్షేత్ర స్థాయిలో ఇబ్బందులేమి వస్తాయి, గ్రాస్ రూట్ లెవల్‌లో ఏ ఇబ్బందులు వస్తాయనేది గమనించాలి. ఏ విధానాలను రూపొందించినప్పటికీ అమలు చేసేది జిల్లా యంత్రాంగం కాబట్టి జిల్లా స్థాయిలో కూడా ఒక కమిటీని వేశాము అధ్యక్షా. ఆ కమిటీలో కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ (2) ఛైర్‌పర్సన్, ప్రాజెక్టు ఆఫీసర్, ఐటిడిఏ ఒక ఛైర్‌పర్సన్, డిఈఓ ఒక మెంబర్‌గా ఉంటారు. District officers of Backward classes welfare, Tribal Welfare, Minority Welfare, Additional Director Disabled welfare వీళ్లందరూ మెంబర్లుగా ఉంటారు. ఏ.పి. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ కూడా మెంబర్‌గా ఉంటారు. Executive Engineer APEWID Corporation మెంబర్‌గా ఉంటారు. Executive Engineer Tribal Welfare ఒక మెంబర్,

Joint Director/Deputy Director, Social Welfare మరొక మెంబర్. ఇదొక మహాయజ్ఞం లాంటిది. ఈ మహాయజ్ఞానికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారు శ్రీకారం చుట్టారు. ఇది విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధుల సహకారం, ఆయా శాఖాధికారుల సహకారం, విద్యార్థులు, వారియొక్క తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం.

గౌరవ సభ్యులు హాస్టల్స్ మూసేస్తున్నామని అంటున్నారు తప్ప కొత్త రెసిడెన్షియల్ స్కూల్స్ మొదలుపెడుతున్నారని ఒక్క మాట కూడా చెప్పడం లేదు. ఇది చాలా దురదృష్టకరం. ఎన్నో రెసిడెన్షియల్ స్కూల్స్‌ని ఓపెన్ చేస్తున్నాము, 78 కొత్త రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేశాము. గతంలో వాటిల్లో 648 మంది ఉండగా, ఇప్పుడు ఆ స్ట్రెంగ్త్‌ని 960కి పెంచడమైనది. అంటే, దగ్గరదగ్గర 1000కి పెంచడమైనది. రెసిడెన్షియల్ స్కూలు విధానాన్ని పెద్ద ఎత్తున చేయడానికి ఒక పెద్ద యజ్ఞం జరుగుతున్నది. దానిని సభ్యులందరూ గమనించి, సహకరించి ఆ యజ్ఞంలో భాగస్వాములైతే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వడానికి, మెరుగైన, నాణ్యమైన, నూతనమైన విద్యనందించడానికి అవకాశం ఉంటుంది. శ్రీ బచల పుల్లయ్య గారు చెప్పినదానికి మేము 8 మంది ప్రిన్సిపాల్స్‌కు ఆల్‌రెడీ కౌన్సిలింగ్ డేట్ కూడా ఇచ్చాము. ఈ నెల 27, 28వ తేదీలలో కౌన్సిలింగ్ పూర్తి అయిన తరువాత వారికి పోస్టింగ్స్ ఇవ్వడమవుతుంది. ఈ విధంగా మా ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడమే కాకుండా అమలు చేయడానికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాము. ఏలూరు బాలికల హాస్టల్ సమస్యని వెంటనే పరిష్కరించడం జరిగింది.

విద్యార్థులకు గైడెన్స్, కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ఒక కొత్త స్కీమ్ తీసుకువస్తున్నాము. దానిపేరు Facilitators Scheme. ప్రతి హాస్టల్‌లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫెసిలిటేటర్లు ఉంటారు. వీరి యొక్క బాధ్యతలేమిటంటే – పిల్లలెవరైనా ఆత్మన్యూనతా భావంతో వెనుకబడి ఉన్నప్పుడు వాళ్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం, విద్యార్థులు చదువులో వెనకబడి ఉంటే వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం, కెరీర్ గైడెన్స్ ఇవ్వడం, విద్యార్థుల టాలెంట్స్ ఏమిటో గమనించి ప్రోత్సహించడం వంటివి చేస్తూంటారు. అంటే కొంతమంది పిల్లలకు మ్యూజిక్, స్పోర్ట్స్, డాన్సింగ్, రీడింగ్, రైటింగ్ టాలెంట్స్ ఉంటాయి. అటువంటి టాలెంట్స్‌ని గుర్తించి వారిని ప్రోత్సహించి ఓవరాల్ డెవలప్‌మెంట్ కొరకు ఫెసిలిటేటర్స్ స్కీమును తీసుకువస్తున్నాము. ఆ స్కీము ద్వారా కెరీర్ గైడెన్స్ కూడా ఇస్తాము. మిత్రులు కొంతమంది స్పెషల్ స్క్వాడ్స్ గురించి చెప్పారు. కానీ, స్పెషల్ స్క్వాడ్స్ ఏమీ అక్కర్లేదు. ఇప్పుడంతా ఆన్‌లైన్ చేస్తున్నాము. కంట్రోల్ రూం పెట్టి ఆన్‌లైన్ సిస్టమ్ పెడుతున్నాము. ఇక్కడ కూర్చుని ఒక బటన్ నొక్కితే ఫలానా హాస్టల్‌లో, ఫలానా రెసిడెన్షియల్ స్కూల్‌లో ఈ క్షణంలో ఏం జరుగుతోందో తెలుస్తుంది. ఉదయం పూట పిల్లలు ఏం చదువుతున్నారు, మధ్యాహ్నం పిల్లలు ఏ భోజనం చేస్తున్నారు, టీచర్లు ఏం చెబుతున్నారనేది సిసి కెమెరాలు పెట్టి ఆన్‌లైన్ విధానం ద్వారా మానిటరింగ్ చేయడం జరుగుతుంది. బయోమెట్రిక్ సిస్టమ్‌ని మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టాము. అటెండెన్స్ విషయమై 20 శాతం బోగస్ అటెండెన్స్‌ను పట్టుకున్నాము. దానిద్వారా సుమారు రూ.20 కోట్లు ఆదా చేయడం జరుగుతోంది.

మ.10.40

మొత్తం వ్యవస్థనంతా కూడా ఎప్పటికప్పుడు on the spot సమీక్ష చేయడానికి ఆన్‌లైన్ సిస్టమ్‌ను ప్రవేశపెడుతున్నాము. హాస్టళ్లలో త్రాగునీరు, మరుగుదొడ్లు మరియు ఇతర వసతులన్నీ కూడా

మెరుగుపరచడానికి ఒక కొత్త సిస్టమ్‌ను తీసుకువస్తున్నాము. Centralized System మరియు Toll free system ను తీసుకువస్తున్నాము. ఇది ఢిల్లీలో పార్లమెంటు సభ్యుల క్వార్టర్లలో అమలులో ఉంది. మనం ఫోన్ చేసినవెంటనే electrician గానీ, plumber గానీ వెంటనే వచ్చి మరమ్మత్తులు చేసి, మన సంతకం కూడా వారు తీసుకుంటారు. అటువంటి centralized systemను మనం ప్రవేశపెట్టబోతున్నాము.

సభ్యులంతా కూడా కాస్మొటిక్స్ గురించి చెప్పారు. మరొక శుభవార్త ఏమిటంటే, కాస్మొటిక్స్ ఒక్కటే కాదు, నేడు పెరుగుతున్నటువంటి ధరలను, inflation రేటును, price indexను దృష్టిలో పెట్టుకుని మొన్న బడ్జెట్ మీటింగులో గౌరవ ఆర్థికశాఖా మంత్రిగారు ఈ సంవత్సరం బడ్జెట్‌లో 10 నుంచి 15 శాతం వరకూ స్కాలర్‌షిప్పులు, మెస్ ఛార్జీలను పెంచడానికి సూత్రప్రాయంగా అంగీకరించారు. అది బడ్జెట్‌లో కూడా వస్తుంది. కాస్మొటిక్స్ మాత్రమే కాకుండా diet charges కూడా పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధంచేశాము. త్వరలోనే మేము ఆ నిర్ణయాన్ని కూడా ప్రకటిస్తాము.

**ఆర్.డి.యస్. కుడికాలువ పనులు**

ప్రశ్న నెం. 8786 (53)
శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) తుంగభద్ర నది ఆర్.డి.ఎస్. కుడి కాలువ వద్ద చేపట్టిన పనులపై ఏదైనా సర్వేను నిర్వహించడమయిందా;
ఆ) అయితే, ఆ వివరాలు తెలపండి?

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి (స్థానిక సంస్థలు-కర్నూలు): అధ్యక్షా, ముందుగా మంత్రిగారికి మా జిల్లా రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలియజేయాలి. ఎందుకంటే, ఈ సంవత్సరం వర్షాలు సరిగా లేకున్నా బ్రహ్మాండంగా మా జిల్లాలో పంటలను కాపాడినటువంటి వ్యక్తిగా ఆయనను అభినందించవలసిన అవసరముంది. ఆయన చాలా బ్రహ్మాండంగా చేయడం జరిగింది. అందువల్ల తమరిద్వారా ఆయనకు మా జిల్లా రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే, నేను గత సెషన్‌లో అడిగాను. దాని తరువాత రూ.3.09 కోట్లు సర్వేకోసం మంజూరుచేయడం జరిగింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం మాకు 4 టి.ఎమ్.సి.ల నీరు కుడికాలువకు కేటాయించడం జరిగింది. డి.పి.ఆర్.ను త్వరితగతిన తయారుచేయించి వీలైనంత త్వరలో ఈ పనులకు టెండర్లను పిలవవలసిందిగా తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన దానిలో కర్నూలు జిల్లాకి సంబంధించి రాజోలుబండ వద్ద తుంగభద్ర కుడికాలువ ప్రాజెక్టును అధ్యయనం చేసి సర్వే మరియు ప్రాజెక్టు రిపోర్టు తయారుచేయడానికి జి.ఓ. నెం. 72, తేది. 23.01.2016 న రూ.3.09

కోట్లకు పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగింది. సదరు ప్రాజెక్టుకు ప్రాజెక్టు రిపోర్టు మరియు సర్వే పనులన్నీ కూడా పూర్తిచేసి వెంటనే టెండర్లను పిలిచి రాబోయే మూడు నెలల్లోపు ఆ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం జరుగుతుంది. దీనివల్ల కోస్గి మండలం గానీ, మంత్రాలయం గానీ, ఎమ్మిగనూరు గానీ, సి.బెళగల్, గూడూరు గుండా వచ్చే కర్నూలు బ్రాంచి కెనాల్ ద్వారా నీరు సుమారు 162 కిలోమీటర్లు వెళుతుంది. తప్పకుండా గౌరవసభ్యులు చెప్పిన ఈ కార్యక్రమాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి వెనుకబడ్డ ప్రాంతమైన పశ్చిమ కర్నూలులో త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

## అనావృష్టి మండలాలను ప్రకటించేందుకు సూచికలు

ప్రశ్న నెం. 9154 (54)

సర్వశ్రీ డా. ఎం. గేయానంద్, విటపు బాల సుబ్రహ్మణ్యం, ఎం.వి.ఎస్. శర్మ, ఎం.ఎల్.సి.లు,

గౌరవనీయులైన ఉప-ముఖ్యమంత్రి (హోం & విపత్తు నిర్వహణ) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) జిల్లాలోని కరవు మండలాలను గుర్తించడానికి అనుసరిస్తున్న ప్రమాణాలు ఏమిటి ?

ఆ) ఈ ప్రమాణాల కారణంగా రాయలసీమ జిల్లాలకు అన్యాయం జరుగుతున్న విషయం వాస్తవమేనా?

ఇ) అయితే, కరవు మండలాలను గుర్తించడానికి వీలుగా ఈ ప్రమాణాలను మార్చటానికి తీసుకున్న చర్యలేమిటి

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి మరియు హోం & విపత్తు నిర్వహణ శాఖ (శ్రీ ఎన్.చినరాజప్ప):

అ) కరవు ప్రభావిత మండలాలను ప్రకటించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ధిష్టంగా పొందుపర్చిన కార్యవిధానాన్ని అనుసరించడమవుతున్నది.

### కరవు ప్రభావిత మండలాలను ప్రకటించేందుకు ప్రమాణాలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమ సంపుటి ప్రకారంగా)

(i) వార్షిక సాధారణ వర్షపాతం 999.9 మిల్లిమీటర్ల కంటే ఎక్కువ ఉన్న మండలాలలో 25 శాతం మరియు ఆ పైబడి మరియు వార్షిక సాధారణ వర్షపాతం 750 మిల్లిమీటర్లల నుండి 999.9 మిల్లీమీటర్లు ఉన్న మండలాలలో 20 శాతం మరియు ఆపైబడి మరియు వార్షిక సాధారణ వర్షపాతం 750 మిల్లీమీటర్ల తక్కువ ఉన్న మండలాలలో వర్షపాత లోటు 15 శాతం మరియు పైబడి వర్షపాతంలో లోటు నమోదు కావడం.

**(ii)** ముఖ్యమైన పంటలన్నింటి క్రింద పంటలు వేసిన విస్తీర్ణాలలో 50 శాతం మరియు ఆ పైబడి కుదింపు / తగ్గింపు.

**(iii)** గత 5 సంవత్సరాలలోని సగటు దిగుబడులతో పోల్చినపుడు పంట దిగుబడులలో 33 శాతం ఆపైబడి సాధారణ తగ్గుదల.

(iv) అనావృష్టి కాలాలు (ఆర్థిక గణాంకాల డైరెక్టరు సమకూర్చిన) మరియు పంట దిగుబడులపై వాటి ప్రభావం.

**కరవు ప్రభావిత మండలాలను ప్రకటించేందుకు ప్రమాణాలు**

(2009 కేంద్ర ప్రభుత్వ నియమ సంపుటి ప్రకారంగా)

ఎ) కీలక సూచీ 1 ః వర్షపాతం లోటు

బి) కీలక సూచీ 2 ః విత్తిన విస్తీర్ణం (వ్యవసాయ శాఖ డైరెక్టరు సమకూర్చిన)

సి) కీలక సూచీ 3 ః నార్మలైజుడు డిఫరెన్సు వెజిటేషన్ ఇండెక్స్ - ఎన్‌డివిఐ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్లికేషన్ సెంటర్,ప్రణాళిక శాఖ సమకూర్చిన)

డి) కీలక సూచీ4ః మాయిశ్చర్ ఎడిక్వసి ఇండెక్స్ - ఎంఎఇ (ఎఎన్‌జిఆర్ఎయు సమకూర్చిన)

కరవు ప్రాంతంగా ప్రకటించేందుకు కనీసం మూడు సూచికలు లేదా సూచిక విలువలను పరిగణనలోకి తీసుకోవడమవుతుంది.

(i) వర్షపాతంలో లోటు అనే మొదటి ప్రమాణం తప్పనిసరిగా ఉంటుంది.

(ii), (iii) మరియు (iv) ప్రమాణాలలో ఏవేని రెండు ప్రమాణాలను నెరవేర్చాలి. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రమాణాలలో వర్తింపుకాని మండలాలను, అవి కేంద్ర ప్రభుత్వం (బి, సి & డి) యొక్క ఏవేని రెండు ప్రమాణాలను నెరవేర్చి నట్లయితే పరిశీలించడమవుతున్నది.

ఆ) లేదండీ.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

డా.ఎం.గేయానంద్(పట్టభద్రుల నియోజకవర్గం–కడప, అనంతపురం, కర్నూలు): అధ్యక్షా, వాస్తవానికి ఈ కరవు సూచికల వల్ల అన్యాయం జరుగుతోంది. వాటిని మార్చాలనే చర్చ కర్నూలు జిల్లాపరిషత్‌లో మరియు అనంతపురంలో కూడా వచ్చింది. ఉదాహరణకు, వేరుశనగ పంట వేసినపుడు జూన్, జూలై నెలల్లో వర్షాలు పడాలి. కానీ, అనంతపురంలో అక్టోబర్ నెలలో వర్షాలు పడుతున్నాయి. అక్టోబర్ నెలలో పడుతున్న వర్షాలు సాధారణ వర్షపాతం మాదిరిగానే అనిపిస్తోంది. అంటే, erratic rain రాయలసీమలో వస్తోంది. సాధారణ వర్షపాతం ఉంటుంది కానీ, పంట అయితే రాదు. కాబట్టి ఈ సూచికలను మరలా మరొకసారి అధ్యయనం చేయడానికి ఒక కమిటీని నియమిస్తే బాగుంటుంది. దీనిపై మంత్రిగారు ఆలోచించవలసిందిగా తమరిద్వారా వారిని కోరుతున్నాను. ప్రతి నెల వర్షపాతం ఎంత పడుతుందనేది గుర్తించి ఆ నెలలో పడే వర్షంలో deficit ఉంటే దానిని rainfall deficit గానే గుర్తించాలి. మొత్తం మీద అన్ని నెలల్లో పడిన rainfall ను తీసుకుంటే, ఒక్కొక్కసారి నార్మల్‌గా వస్తుంది. చాలాచోట్ల మా మండలాలను కరవు మండలాలుగా ప్రకటించడం లేదనే మాట వినిపిస్తోంది. వాస్తవానికి అక్కడ కరవు ఉంటుంది. ఈ సూచికలు fulfill కావు. కాబట్టి ప్రతి నెల వచ్చే వర్షపాతంలో 15 శాతం deficit రాయలసీమ ప్రాంతంలో ఉంటే, దానిని deficit rainfall గా గుర్తించాలి కానీ, normal rainfall గా గుర్తించడానికి లేదు. మొత్తం rainfall ను టోటల్‌గా తీసుకుంటున్నారు. ఆవిధంగా కాక ప్రతి నెల వచ్చే వర్షపాతాన్ని లెక్కలోకి తీసుకోవాలని, దానిపై ఒక కమిటీని నియమించి మరొకసారి స్టడీ చేయాలని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎస్. చినరాజప్ప: అధ్యక్షా, కరవును గుర్తించడంలో తేది. 25.10.2015 నాడు జి.ఓ. ప్రకారం 7 జిల్లాల్లో 196 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాము. తేది. 21.11.2015 నాడు జి.ఓ.నెం. 12 ద్వారా 10 జిల్లాల్లో 163 మండలాలను, అంటే కరవు మండలాలను ఎప్పటికప్పుడు పెంచాలని చెప్పి మొత్తం 353 మండలాలను కరవు మండలాలుగా గుర్తించడం జరిగింది. సభ్యులు చెప్పినట్లు ఇది వర్తించడంలో కొన్ని ఇబ్బందులున్నాయి. ఈ అంశంలో కేంద్రంతో కూడా మాట్లాడి ఒక కమిటీని నియమించి రికమెండ్ చేయవలసిన అవసరముంది. పెద్దలతో మాట్లాడడం జరిగింది. ఈ అంశాన్ని రికమెండ్ చేయమని వారు చెప్పడం జరిగింది. తప్పకుండా ఈ అంశాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వపరంగా రికమెండ్ చేయడం జరుగుతుంది.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: అధ్యక్షా, ప్రకాశం జిల్లాలో ఎన్ని మండలాలను కరవు ప్రాంత మండలాలుగా ప్రకటించారో చెప్పాలి. ఈ సంవత్సరం రాయలసీమతో పోల్చినా, కోస్తాతో పోల్చినా కూడా తీవ్రమైనటువంటి కరవుతో విలవిలలాడుతున్న జిల్లా ప్రకాశం జిల్లా. ఈమధ్య ఒంగోలులో వారం రోజులకు ఒకసారి కూడా నీళ్లు రావడం లేదు. అది ప్రకాశం జిల్లా పరిస్థితి. ఎన్ని మండలాలను కరవు మండలాలుగా గుర్తించారు? వాటితోపాటు మరికొన్ని మండలాలను గుర్తించే ఆలోచన ఉన్నదా?

శ్రీ ఎస్.చినరాజప్ప: అధ్యక్షా, కరవు మండలాలను ప్రకాశం జిల్లాలో రెండు విడతలుగా గుర్తించడం జరిగింది. ప్రకాశం జిల్లాలో రెండు విడతలు కలిసి 56 మండలాలను కరవు మండలాలుగా గుర్తించడం జరిగింది.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజక వర్గం-ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు): అధ్యక్షా, రాయలసీమకు న్యాయం జరగడం లేదనేది వాస్తవం. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ఆ జిల్లాపరిషత్తు తీర్మానం చేయడం సంవత్సరం క్రితమే 56 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. 46 మండలాలు తీవ్ర ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అదేవిధంగా, నెల్లూరు జిల్లా చూడడానికి బాగానే కనిపిస్తుంది గానీ, ఆత్మకూరు, ఉదయగిరి లాంటి 23 మండలాలను కరవు మండలాలుగా ఆ జిల్లాలో కూడా ప్రకటించారు. కాబట్టి వెనుకబడిన ప్రాంతాల్లో కరవు మండలాలుగా మీరు ప్రకటిస్తున్నారు కానీ, వాటికి ఎటువంటి న్యాయం జరగడం లేదు. ఫ్లోరైడ్ సమస్యను పరిష్కారం చేయడం లేదు. త్రాగునీటి సమస్య ఇప్పటికి కూడా ముంచుకొస్తూ ఉంది. గతంలోనే ఈ ప్రశ్నకు సమాధానం వచ్చింది. అయితే, వాటికి తగిన పరిష్కార మార్గాల గురించి, వెనుకబడిన ప్రాంతాలకు చెందిన కరవు ప్రాంతాలను ఏవిధంగా ఆదుకుంటున్నారో మంత్రిగారు చెప్పాలని తమరిద్వారా నేను కోరుతున్నాను.

శ్రీ ఎస్.చినరాజప్ప: అధ్యక్షా, కరవు పరిస్థితులు ఎక్కడైతే ఉన్నాయో అవన్నీ కరవు మండలాలుగా వర్తిస్తాయి. వెనుకబడిన జిల్లాలకు సంబంధించి ప్రకాశం జిల్లా లేదు కనుక దానిని మనం రికమెండ్ చేయవలసిన అవసరముంది. ఎందుకంటే, కరవు మండలాలు ఆ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి కనుక వెనుకబడిన జిల్లాగా ప్రకాశం జిల్లాను రికమెండ్ చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ. 10.50

శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి: అధ్యక్షా, మా కర్నూలు జిల్లాలో రైతుల పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలన్నింటిలో వర్షాలు చాలా తక్కువగా కురిసిన జిల్లా మా కర్నూలు జిల్లా. గతంలో 34 మండలాలను కరవు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. తరువాత ఒక ఆరు మండలాలను వాటికి అదనంగా చేర్చి 40 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. అయితే జిల్లా యంత్రాంగం అధ్యయనం చేసి కరవు నిబంధనల ప్రకారం ఈ క్రింది 5 మండలాలను కూడా కరవు మండలాలుగా ప్రకటించడానికి తేది.5-11-2015న ప్రతిపాదనలు పంపడం జరిగింది. అవి 1.ఆదోని 2.గూనగండ్ల 3.హోలగుంద 4.చాగలమర్రి 5.మహానంది. అదేవిధంగా జిల్లాలోని మిగతా 8 మండలాలలో కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున వాటిని కూడా కరవు మండలాలుగా ప్రకటించడానికి జిల్లా యంత్రాంగం తేది.16-12-2015న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. అయితే, ఈ 13 మండలాలను ఎప్పటిలోగా కరవు మండలాలుగా ప్రకటిస్తారో తెలియజేయవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుకుంటున్నాను.

శ్రీ ఎన్. చినరాజప్ప: అధ్యక్షా, రెండు విడతలుగా కర్నూలు జిల్లాలోని 54 మండలాలలో 40 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. ఇంకా పెండింగ్ ఉంటే వాటిని పరిశీలించి నార్మ్స్ ప్రకారం వాటిని కూడా ప్రకటించడం జరుగుతుంది.

## న్యూక్లియర్ రియాక్టర్లు

ప్రశ్న నెం. 8973 (56)
డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ?

అ) రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కోసం న్యూక్లియర్ రియాక్టర్లను నెలకొల్పేందుకు ఏవేని ప్రతిపాదనలు ఉన్నాయా ?

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి ?

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారి తరఫున కార్మిక & ఉపాధి కల్పన, కర్మాగారాలు, యువజనులు & క్రీడలు, నైపుణ్యాల అభివృద్ధి మరియు వ్యవస్థాపకత శాఖ మంత్రి (శ్రీ కె. అచ్చన్నాయుడు):

అ) అవునండీ, రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కోసం న్యూక్లియర్ రియాక్టర్లను నెలకొల్పేందుకు ఒక ప్రతిపాదన ఉంది.

ఆ) కేంద్ర ప్రభుత్వం నుండి అందిన ఆమోదం ప్రకారం శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం, కొవ్వాడ వద్ద న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఒక న్యూక్లియర్ పవర్ పార్కును ఏర్పాటు చేయనున్నది. ఈ ప్లాంటును జిఇ(హిటాచి), యుఎస్ఎ సాంకేతిక తోడ్పాటుతో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది. ఒక్కొక్క యూనిట్ 1594 ఎండబ్ల్యు సామర్థ్యంతో న్యూక్లియర్ పవర్ పార్క్ 6 యూనిట్లను కలిగివుంది. అంతేగాక, డిఎఇ /

ఎన్‌పిసిఐఎల్, న్యూక్లియర్ పవర్ రియాక్టర్లను ఏర్పాటు చేయడానికి మరొక అనువైన కోస్తా స్థలాన్ని గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. న్యూక్లియర్ పవర్ పార్క్‌ల స్థల ఎంపిక ప్రమాణం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థలాన్ని గుర్తించనుంది.

డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి : అధ్యక్షా, ప్రస్తుత పరిస్థితుల్లో మనం సహజవనరులను వృథా చేస్తున్నాము. కాలుష్యాన్ని పెంచుతున్నాము. మనం సహజవనరులు కాపాడుకోవడానికి నాన్‌కన్వెన్షల్ ఎనర్జీకి వెళ్లకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. సోలార్ విద్యుత్ వినియోగం కోసం చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఈ సోలార్ విద్యుత్ విషయంలో ప్రారంభదశలో ఉన్నది. అనంతపురం మరికొన్ని ప్రాంతాలలో సోలార్ పార్కులు పెడతామని చెబుతున్నారు. ఏకంగా దాని నుంచి 600 మెగా వాట్ల విద్యుత్ వస్తుందని అన్నారు. దీనితో పాటు బొగ్గుతో విద్యుత్ ఉత్పాదన చేయాలనుకుంటే, బొగ్గు ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. మనం ఇతర రాష్ట్రాలనుండి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉంది. మన ప్రక్క రాష్ట్రమైనటువంటి తమిళనాడులో గతంలో 2యూనిట్లు పెట్టారు. ఇప్పుడు మరల మరొక రెండు యూనిట్లు కూడంకుళంలో తయారు చేస్తున్నారు. ఒక్కొక్క యూనిట్‌కు 1000 మెగా వాట్లు అయితే, దానికి ఖర్చు రూ.20 వేల కోట్లు. మన మంత్రిగారు ఉత్తరాంధ్ర జిల్లావాసే. ఇది అక్కడకు రాగానే 6 యూనిట్లు అన్నారు. 6x15 అంటే 9వేల మెగావాట్ల విద్యుత్ అక్కడకు వస్తే, లక్షా ఎనభై వేల కోట్ల రూపాయలు కేంద్రప్రభుత్వం ఇస్తుంది. అంత ఇన్వెస్ట్‌మెంట్ వచ్చినప్పుడు ఆ ప్రాంతమంతా అభివృద్ధి చెందడానికి, రాష్ట్రమంతటా గ్రీన్ టెక్నాలజీగా చేయడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు లేటెస్ట్ టెక్నాలజీ ప్రకారం ఇబ్బందులు అంత పెద్దగా లేవు. న్యూక్లియర్ ఎనర్జీవల్ల చాలా ఇబ్బందులు తగ్గిపోయాయి. దీనికి సంబంధించి ఫీజిబులిటీ రిపోర్ట్ ఏమైనా తయారైందా, మన ప్రభుత్వం ఈ విషయంలో ముందుకు వెళుతున్నదా చెప్పవలసిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె. అచ్చన్నాయుడు: అధ్యక్షా, గౌరవసభ్యులు, పెద్దలు శ్రీ ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు చెప్పినట్లు న్యూక్లియర్ ఎనర్జీని మనం ప్రమోట్ చేయవలసిన అవసరం ఉంది. అయితే, గతంలో జరిగిన సంఘటనల వలన ప్రజలలో ఒక అభద్రతా భావం ఉండేది, అయితే ఈ మధ్యకాలంలో మన ప్రక్క రాష్ట్రం తమిళనాడులో రెండు యూనిట్లు ఏర్పాటైన తరువాత కొంత వరకు ప్రజలు అభద్రతా భావం నుంచి దూరమై ప్రభుత్వానికి సహకరిస్తున్నారు. దానివల్ల నష్టం లేదనే ఉద్దేశ్యంతో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2800 మెగావాట్లు థర్మల్ విద్యుత్‌ను తయారు చేస్తున్నాము. హైడల్ ప్రాజెక్టులతో ఒక 2వేల మెగావాట్లు, గ్యాస్ ద్వారా 2700 మెగావాట్లు, సోలార్ ద్వారా 3,500 మెగావాట్లు, విండ్ ద్వారా 4వేల మెగావాట్లు విద్యుత్ తయారు చేయాలని అనుకుంటున్నాము. వీటన్నింటికంటే న్యూక్లియర్ ఎనర్జీని ప్రమోట్ చేయవలసిన అవసరం ఉందనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వ న్యూక్లియర్ ఎనర్జీ కార్పోరేషన్ వారు శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. అందులో వారికి 2,074 ఎకరాల స్థలం అవసరమంటే ఇప్పటికే 1,475 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని, 599 ఎకరాల ప్రైవేట్ ల్యాండ్‌ని జిల్లా రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. రామచంద్రాపురం, టెక్కలి, కోటపాలెం మరియు హ్యాంలెట్స్ అయిన జీరుకొవ్వాడ, గూడెం అనే 5 గ్రామాలలో ఈ స్థలాన్ని గుర్తించారు. ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం వారితో సంప్రదింపులు చేస్తోంది. ఈ ప్రాజెక్టు వస్తే, ఈ 5 గ్రామాలను రీలొకేట్ చెయ్యాలి. దాని వల్ల సుమారు 1983 గృహాలు మనం తీసేయాలి. సుమారు 7960 మంది ప్రజలకు రిహాబిలిటేషన్ కల్పించవలసిన అవసరం

ఉంది. ఈమధ్యకాలంలో కేంద్రంతో, న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్‌తో సంప్రదింపులు చేయడం వల్ల వారు ముందుగా ల్యాండ్ అక్విజిషన్ కోసం రూ.500కోట్లు డిపాజిట్ చేస్తామని, ఈ విషయంలో ముందుకు వెళ్లాలని రాష్ట్రప్రభుత్వంతో అన్నారు. ఈ విషయమై జిల్లాయంత్రాంగం వారితో సంప్రదింపులు జరుపుతోంది. ఎందుకంటే, ఒకసారి అభద్రతా భావం వచ్చింది కనుక దానిని పోగొట్టి, ప్రజలను మనవైపు మళ్లించాలనే ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు ఒక కమిటీని వేశారు. స్థానిక ఎం.ఎల్.ఏలు, గతంలో సభలో సభ్యురాలైనటువంటి శ్రీమతి ప్రతిభా భారతి గారు ఆ ప్రాంతాలలో ఉన్న గ్రామస్థులు, రైతులతో మాట్లాడి వీలైనంత తొందరగా ఈ ల్యాండ్ అక్విజిషన్‌ను పూర్తి చేసి న్యూక్లియర్ ప్లాంట్‌ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని సభ్యులకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఈ మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో మరొక స్థలం కూడా గుర్తించమని కేంద్రప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఆ విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అయితే కొవ్వాడ విషయంలో మాత్రం ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, వారు సంతోషించే విధంగా చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మీ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

## గ్యాస్ పైపులైన్ల నిర్వాహణ

ప్రశ్న నెం. 8988(57)
శ్రీ కలిదిండి రవికిరణ్ వర్మ, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ?

అ) తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఓఎన్‌జిసి గ్యాస్ పైపులైన్లు తరుచుగా లీక్ అవుతున్నాయా?

ఆ) అయితే పైపులైన్ల సక్రమ నిర్వహణ కోసం తీసుకున్న చర్యలేమిటి ?

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారి తరఫున కార్మిక & ఉపాధి కల్పన, కర్మాగారాలు, యువజనులు & క్రీడలు, నైపుణ్యాల అభివృద్ధి మరియు వ్యవస్థాపకత శాఖ మంత్రి (కె. అచ్చన్నాయుడు):

అ) లేదండీ, 2014, జూన్‌లో చోటుచేసుకొన్న ఒక పెద్ద సంఘటన మినహా మరే సంఘటనలు జరగలేదు.

ఆ) గ్యాస్ పైపులైన్లను చట్ట ప్రకారం గెయిల్ ఇండియా లిమిటెడు, రిలయన్సు ఇండస్ట్రీసు (ఆర్‌జిటిఇఎల్) మరియు ఓఎన్‌జిసిఎల్ నిర్వహిస్తున్నాయి. గ్యాసు పైపులైన్ల నిర్వహణ కోసం సాధారణంగా ఈ క్రింది చర్యలు, విధానాలను ఈ సంస్థలు పాటిస్తున్నాయి.

- ఇన్‌కమింగ్ గ్యాస్ నాణ్యత నిర్ధారణ, పర్యవేక్షణ (ఉత్పత్తిదారు సదుపాయాల దిగువ భాగం).
- తుప్పు పట్టకండా పైపులైన్లకు క్యాథడిక్ రక్షణను వర్తింపచేయడమయింది. సిపి వ్యవస్థ పటిష్టతను పరిశీలించి, పర్యవేక్షించడానికి పిఎస్‌పి పర్యవేక్షణను త్రైమాసికంగా నిర్వహించడమయింది.

- క్లీనింగు, పిగ్గింగు (వార్షిక ప్రాతిపదికపై) మందాన్ని కొలవడానికి ఇంటలిజెంట్ పిగ్గింగ్ ఇన్‌లైన్ ఇన్‌స్పెక్షన్ (5 సంవత్సరాలు).
- ప్రతి 6 నెలల ప్రాతిపదికన ఉపరితలం పైన గల పైప్‌లైన్ల కోసం అల్ట్రా సోనిక్ థిక్‌నెస్.
- సిపిఎల్ మరియు డిసివిజి సర్వే (ప్రతి 5 సంవత్సరాలు).
- దుర్బల ప్రాంతం, హైయర్ క్లాస్ లొకేషన్ ప్రాంతాలలో తరచుగా క్లిష్ట పరిస్థితులను బట్టి లైన్‌వాక్.
- ఏరియల్ సర్వే (నెలవారీ)
- ఎల్‌ఇఎల్ సర్వే (అర్ధ సంవత్సరం)
- పైప్‌లైన్ వాల్వ్‌ల రెగ్యులరు నిర్వహణ.

ఉ.11.00

శ్రీ కలిదిండి రవికిరణ్ వర్మ (పట్టభద్రుల నియోజకవర్గం-తూర్పు, పశ్చిమగోదావరి): అధ్యక్షా, ఈ ప్రశ్నను రెండు, మూడు సార్లు వేస్తే ఇప్పుడు చర్చకు వచ్చింది. సార్, ఈ పైప్‌లైన్ ఏజన్సీ ఏదైతే ఉందో, దానిని థర్డ్‌పార్టీ ఏజన్సీకి ఇవ్వడం వలన ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఆ ప్రమాదాలు జరిగినప్పుడు హుటాహుటిన ఢిల్లీలో ముఖ్యమంత్రిగారు, అందరు మంత్రులు వచ్చి యాక్షన్ తీసుకున్నారు. కానీ, అటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఈ సభాముఖంగా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ఈ పైప్‌లైన్ థర్డ్‌పార్టీ ఏజన్సీకి ఇవ్వకుండా డైరెక్టుగానే గెయిల్, రిలయన్స్ మొదలైన సంస్థల వారు వాటికి సంబంధించి మానిటరింగ్ చేయడం ద్వారా ఈ ప్రమాదాలు జరగకుండా చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అవసరమైతే ఈ పైప్‌లైన్‌కు సంబంధించిన ఆఫీసును అమలాపురంలో పెడితే చాలా బావుంటుంది. ఎందుకంటే, ప్రజలకు ఎక్కడైనా చిన్న చిన్న కంప్లైంట్లు ఉంటే, వాటిని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నా వారు రాజమండ్రిలోనో, ఢిల్లీలోనో ఉంటున్నారు కానీ ఎక్కడా రెస్పాండ్ కావడంలేదు. ఏదన్నా సంఘటన జరిగినప్పుడు మాత్రం అందరూ వస్తారు తప్ప, ఈ చిన్న చిన్నవి రప్చర్ అవుతున్నప్పుడు మాత్రం ఎవరూ రెస్పాండ్ అవడంలేదు. చిన్న చిన్న సంఘటనలకు సంబంధించి ఒక మెయింటెనెన్స్ ఆఫీసును అమలాపురంలో పెట్టినట్లయితే, నగరం గ్రామానికి సంబంధించిన సంఘటన జరగక ముందు 4, 5 రోజుల ముందే నగరా గ్రామస్తులు గ్యాస్‌లీక్ వాసనలు వస్తున్నాయని చెప్పడం జరిగింది కానీ, ఎవరూ పెద్దగా సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల ఇంత పెద్ద ప్రమాదం జరిగింది. వీటికి సంబంధించి మన రాష్ట్రప్రభుత్వానికి ఎటువంటి కంట్రోలు కూడా లేదు. దీనికి ప్రభుత్వ కంట్రోల్ ఉండే విధంగా ఆర్‌డిఓగాని, సబ్ కలెక్టర్ మొదలైన వారి ఆధీనంలో ఈ ఆఫీసు ఉంటే, తప్పకుండా డ్యామేజ్ ఎక్కువ కాకుండా చూడడానికి అవకాశం ఉంటుంది. కోనసీమ ప్రాంతంలో చాలా ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. కానీ, ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఉండాలా వద్దా అనే మీమాంసలో ప్రజలు ఎక్కువగా భయపడుతున్నారు కావున వీటికి సంబంధించి కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిందిగా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ (స్థానికసంస్థలు-కృష్ణా) : అధ్యక్షా,

మిస్టర్ ఛైర్మన్: చెంగల్ రాయుడు గారు మాట్లాడండి.

శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్: సార్, మొదట నేను ఇక్కడ పిలిచాను, కొంచెం ఇటు వైపు కూడా చూడండి. ఎప్పుడూ అటువైపే చూస్తే ఎలా?

శ్రీ బి. చంగల్‌రాయుడు: సార్, రాజేంద్రప్రసాద్ గారికి ఆ స్థానం అచ్చిరాలేదు ఇటు వచ్చేయమని చెప్పండి. అధ్యక్షా, మా మిత్రులు శ్రీ రవికిరణ్ వర్మగారు ఈ ప్రశ్న ఇప్పటికి 4, 5 సార్లు లిస్టులోకి వచ్చిందని అన్నారు. వస్తే ఇప్పుడు మాట్లాడామని అన్నారు. ఇప్పటివరకు ఆ ప్రశ్నలు రాలేదంటే, ఎక్కడికి వెళ్ళాయి. అసలు వాటికి రిప్లై అన్నా వచ్చిందా, లేదా? ఇంతవరకూ ఆ ప్రశ్న రాలేదని అన్నారు. ఒకసారి వాయిదా పడితే, రెండవసారి ఆ ప్రశ్నను అనుమతించరు. This is a technical issue. 4, 5 సార్లు ప్రశ్నలు వేశారు.

MR. CHAIRMAN : Don't enter into the argument with the Chair. If you want any clarification I will ask the Legislature Secretariat and answer you. What is this?

SRI B. CHANGAL RAYUDU: You can direct the Legislature Secretariat and give clarification to me Sir.

MR. CHAIRMAN: Mr. Changal Rayudu, you can come to my Chamber and I will ask the Officials as to why it was happened and clarify to you. I will also enquire whether it is true or correct.

శ్రీ బి. చంగల్‌రాయుడు : సార్, ఆయనది కరెక్టా కాదా అని మీరు అడగాలి. నన్నడిగేది ఏమిటి? నాలుగు సార్లు ప్రశ్న వచ్చిందంటే, అది ఏమయిందనేది మీరు చెప్పాలి. House should clarify the matter Sir.

శ్రీమతి పమిడి శమంతకమణి : (మైకు లేదు) ఆయన తరఫున మీరు వకాల్తా తీసుకున్నారా?

MR. CHAIRMAN : This is a supplementary question and it need not be answered.

శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్: అధ్యక్షా, సభ్యులు శ్రీ రవికిరణ్ వర్మ గారు చాలా మంచి ప్రశ్న వేశారు. మన రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ఓఎన్‌జిసి, గెయిల్, రిలయన్స్ మొదలైన వాటి ద్వారా ఆయిల్, గ్యాసు నిక్షేపాలను వెలికితీస్తున్నారు. ఇటీవల కే.జి. బేసిన్‌లోని చాలా పెద్ద ఎత్తున ఆయిల్ నిక్షేపాలు ఉన్నాయని గుర్తించారు. ఆయా కంపెనీలు ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ ఆపరేషన్లు మూలంగా ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా బేసిన్‌లోనైనా రహదారులు మొదలైనవి దెబ్బతింటున్నాయి. ఆ ప్రాంతాలన్నీ ప్రమాదభరితంగా ఉంటున్నాయి. రిలయన్స్, గెయిల్, ఓఎన్‌జిసి కంపెనీలు గ్యాసు, ఆయిల్‌కు సంబంధించి వాటిని వెలికితీసే దానిలో లోకల్ బాడీలకు, అక్కడి ప్రభుత్వానికి కొంత శాతం అని పర్మనెంటుగా కేటాయిస్తే బావుంటుంది. అలాగే, వాటికి ఒక ప్రత్యేక సంస్థను కూడా ఏర్పాటు చేస్తే, స్థానికంగా ఉన్న ప్రాంతాలను కూడా అభివృద్ధి చేసుకోవడానికి మరింత ఎక్కువ అవకాశం ఉంటుంది. కాబట్టి, ఈ అవకాశం ఉందో లేదో గౌరవ మంత్రిగారు పరిశీలించాలని, అవసరమైతే ఇందుకు సంబంధించిన ఒక చట్టాన్ని కూడా తీసుకువచ్చి అమలుచేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె. అచ్చన్నాయుడు : అధ్యక్షా, ఈ రోజుకి మనకు గ్యాసు ఉత్పత్తి చేసే సంస్థలు దాదాపు నాలుగు వరకు ఉన్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఓఎన్‌జిసి, గెయిల్, రిలయన్స్, కెయిఐ–ఆర్.ఎస్.ఓ.ఎస్ సంస్థల ద్వారా ఈ గ్యాస్ నిక్షేపాలను వెలికి తీస్తున్నారు. మన రాష్ట్రంలో సుమారు 840 కి.మీ.ల గ్యాస్ పైప్‌లైన్లు ఉన్నాయి. వీటిల్లో గెయిల్ దాదాపు 680 కి.మీ. మెయింటైన్ చేస్తోంది. ఓఎన్‌జిసి దాదాపు 220 కి.మీ. మెయింటైన్ చేస్తోంది. 2014వ సంవత్సరంలో ఒక సంఘటన జరిగింది, అది అందరికీ తెలిసిన విషయమే. ఆ సంఘటన జరిగిన కొన్ని నిముషాల లోపే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానికంగా ఉన్న విపత్తు నిర్వహణ శాఖామంత్రి, అందరూ అలెర్ట్ అయిన తరువాత ప్రమాద తీవ్రతను తగ్గించగలిగారు. ఇంతవరకూ దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా గ్యాసు బాధితులకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారాలను అందజేయడం జరిగింది. అంతేగాకుండా, ఆ దుర్ఘటనలో గాయపడ్డ వారికి ఒక్కొక్కరికి దాదాపు రూ.5లక్షల చొప్పున పరిహారాలను కూడా అందజేయడం జరిగింది. అయితే, ఇటువంటి సంఘటనలు మళ్ళీ మన దగ్గర పునరావృతం కాకుండా ఉండాలంటే, అందుకు సంబంధించి ఏవిధమైన చర్యలు తీసుకుంటే బావుంటుందనే దానికి సంబంధించి తాము వాటిని కొంత ఐడెంటిఫై చేయడం జరిగింది. అందులో దాదాపు 600 కి.మీ. గ్యాస్ పైప్‌లైన్లు ఎప్పుడో వేసినవి. వీటివల్ల ఆ పైప్‌లైన్లు అన్నీ తుప్పుపట్టిపోయి ఉన్నాయి.

ఈ రోజు గ్యాసులో కూడా రెండు రకాలు ఉన్నాయి. ఒక గ్యాసులో నీరు ఉంటోంది, రెండవ దానిలో కార్బన్ డై ఆక్సైడు ఉంటుంది. ఆ పైప్‌లైన్లలో కార్బన్ డై ఆక్సైడుతో పాటు నీరు ఉండడం వల్ల ఆ పైప్‌లైన్లు తుప్పుపట్టిపోయి, ఎక్కడికక్కడ లీకై ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే, దీనిని మార్చడానికి ఏదైతే పాత పైప్‌లైన్లు ఉన్నాయో, వాటిని స్టీల్ పైప్‌లైన్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాము. అందుకు మూడు ఫేజులలో చర్యలు తీసుకుంటున్నాము. మొదటి ఫేజ్‌లో 100 కి.మీ.లు, రెండవ ఫేజ్‌లో 150 కి.మీ.లు, మూడవ ఫేజ్‌లో 15 కి.మీ.ల ద్వారా పైప్‌లైన్లు మార్చేందుకు ప్రయత్నం చేసి, ఆ పైప్‌లైన్లను మారుస్తున్నాము. అయితే, పైప్‌లైన్లు మార్చినా, అందులో నీరు ఉంటే, మనం ఎంత మార్చినా కూడా ఉపయోగం ఉండదు. ఎక్కువగా పాడైపోతున్నాయి. అందుకే, ఈ మధ్య కాలంలో ఈ కార్బన్ డై ఆక్సైడ్ నుంచి నీటిని వేరు చేయడానికి 'జియువి' అనే ఒక క్రొత్త ఇన్‌స్ట్రుమెంట్ వచ్చింది. ఇప్పటివరకు మనం ఒక ఐదు ఇన్‌స్ట్రుమెంట్లను ఏర్పాటు చేసుకుని, వాటి ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ నుంచి నీటిని వేరు చేస్తున్నాము. మరొక ఐదు ఇన్‌స్ట్రుమెంట్లు అవసరం ఉన్నాయి. వాటిని కూడా త్వరగా ఏర్పాటు చేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. అయితే, ఇప్పటికే ఆఫీసులను కూడా ఎక్కడైతే పెట్టామో, సబ్ ఆఫీసుల గురించి కూడా గౌరవ సభ్యులు అడిగారు. రాజోలులో ఒక కార్యాలయం ఉంది. అమలాపురంలో కూడా ఒక కార్యాలయాన్ని పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తమ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను. ఈరోజు ఇంకా ముందుకు వెళ్ళి ప్రతి రోజు హెలికాప్టర్ల ద్వారా పైప్‌లైన్లను పర్యవేక్షిస్తూ, ఎక్కడైతే లీకేజీలు ఉన్నాయో, వాటిని గమనించి వాటిని మరమ్మత్తులు చేసే చర్యలను తక్షణమే తీసుకుంటున్నారు. దీనితోపాటుగా ప్రజలను కూడా చైతన్యపరచి, వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందించడానికి ఎఫ్.ఎం. రేడియో ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారాన్ని తెలియజేసి, వారి ప్రాంతాలలో ఇటువంటి సమస్యలు ఉంటే, వెంటనే తెలియజేస్తే, తాము తక్షణమే తగిన విధంగా చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకుంటుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అంతేగాకుండా, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా, పునరావృతం కాకుండా అన్ని రకాలుగా కూడా ప్రయత్నాలు చేస్తున్నాము.

ఉ.11.10

అదేవిధంగా గౌరవ సభ్యులు శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ గారు అడిగారు. అది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంది. అయితే, ఈ మధ్యకాలంలో ప్రధానమంత్రి గారు కానీ, కేంద్రంలో ఉన్నటువంటి ఎన్డీఏ ప్రభుత్వం గానీ ఒక మంచి నిర్ణయాన్ని ప్రకటించింది. కానీ, ఇంకా అమలు చేయడం లేదు. ఏదైనా ఒక రాష్ట్రంలో ఇటువంటి నిక్షేపాలు అంటే గ్యాస్ గానీ, పెట్రోలియం ఉత్పత్తులు గానీ లభ్యమైతే, అందులో సగం ఆదాయాన్ని రాయల్టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికే ఇవ్వాలని ఒక ఆలోచనైతే కేంద్ర ప్రభుత్వం చేస్తోంది. తప్పనిసరిగా మన ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి చెప్పి అది అమలుచేసుకుంటే మన దగ్గర ఉన్నటువంటి ఆస్థిని మనం కొంత అనుభవించడానికి, ఉపయోగించుకోవడానికి అవకాశముంటుంది. అందువల్ల కొంత ప్రయత్నం తప్పనిసరిగా చేద్దాము. ఆ రాయల్టీ వచ్చేటప్పుడు లోకల్ బాడీస్‌కి కూడా కొంత పర్సంటేజీ పెట్టుకుంటే రోడ్ మెయింటెనెన్స్‌కు గానీ, అక్కడి అవసరాలకు గానీ కొంత ఉపయోగపడుతుంది. తప్పనిసరిగా ఏ ప్రాంతంలో అయితే, ఈ సహజ వాయువు నిక్షేపాలు వెలికితీస్తున్నామో ఆ ప్రాంత అభివృద్ధికి అవి ఉపయోగపడాలి. ఆ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు ఉపయోగపడాలి. ఆ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యకు ఉపయోగపడాలి. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం ఆ రకంగా ముందుకు వెళుతోంది. తప్పనిసరిగా సభ్యులు చెప్పిన విషయాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళతామని సభ్యులందరికీ తెలియజేస్తున్నాను.

MR.CHAIRMAN: It's already 11.10 a.m. Now, we will close the Question Hour.

శ్రీ మహ్మద్ జాని: ఛైర్మన్ సార్.. ఇంక రెండు క్వశ్చన్స్ మాత్రమే ఉన్నాయి. అవి కూడా తీసుకోండి.

## చేనేత రుణాల మాఫీ

ప్రశ్న నెం.8842 (58)
సర్వశ్రీ మహ్మద్ జాని, పీరుకట్ల విశ్వప్రసాద రావు, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) జస్టిస్ కోటయ్య కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారంగా చేనేతకారుల రుణాలను మాఫీ చేయడానికి ఏవేని మార్గదర్శకాలను రూపొందించడమయిందా;

ఆ) అయితే, మాఫీ చేసిన రుణాల జిల్లా వారీ వివరాలేమిటి?

గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

అ) అవునండీ. 01.01.2016 తేదీగల పరిశ్రమలు & వాణిజ్య (కార్యక్రమం. II ) శాఖ, జి.ఓ.ఎం.ఎస్.నెం.1 ద్వారా రాష్ట్రంలో "చేనేత మరియు మరమగ్గం రంగానికి రుణాల మాఫీ కోసం పథకాన్ని " అమలు చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది.

ఆ) ఇ. సెంట్రిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటిఇ & సి శాఖ ద్వారా ఆధార్ సంఖ్యతో సరినిరూపణ మరియు చెల్లుబాటు కోసం ఆంధ్రప్రదశ్ రాష్ట్ర రెసిడెంట్ డేటా హబ్ (ఎపిఎస్ఆర్‌డిహెచ్) తో మొత్తం డేటాను ఏకీకృతం చేయడమవుతున్నది. ఏకీకృతం పూర్తయిన వెంటనే, జిల్లా వారీగా సమాచారం లభ్యమవుతుంది.

శ్రీ మహ్మద్ జాని: అధ్యక్షా, క్వశ్చన్‌లో ఏముందంటే మాఫీ చేసిన రుణాలకు సంబంధించిన జిల్లా వారీ వివరాలేమిటని ఉంది. అయితే, పూర్తిగా రుణమాఫీ చేయలేదు. మంత్రి గారు డేటా ఇస్తాము. జిల్లా వారీ వివరాలు తరువాత చెబుతాము అంటున్నారు. అయితే, మొత్తం మీద రుణ మాఫీ ఎంతమంది చేనేత కార్మికులకు చేయాల్సి ఉంది, ఇప్పటివరకు ప్రభుత్వం ఎంతమందికి ఇచ్చింది, ఇంకా ఎంతమందికి బకాయి ఉందనే వివరాలు చెప్పమని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర: అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, రైతు రుణాల మాఫీతోబాటు, చేనేత రుణాలను మాఫీ చేయాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిర్ణయం తీసుకున్నారు. ఎందుకంటే బ్యాంకుల ద్వారా చేనేత వర్గాల వారు పడుతున్న ఇబ్బందులను గమనించి కోటయ్య కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కోటయ్య కమిటీ ఇచ్చినటువంటి రిపోర్టు ఆధారంగా తేది.31.03.2014 వరకు ఉన్న వ్యక్తిగత రుణాలన్నింటినీ కూడా మాఫీ చేయడానికి, అలాగే చేనేత, స్వయం సహాయక సంఘాలకు, మరమగ్గాలకు సంబంధించి 5 హెచ్‌పిలోపు ఉన్నటువంటి 50 శాతం రాయితీ పొందుతున్నటువంటి మరమగ్గాలకు రుణమాఫీ చేయడానికి నిర్ణయించడం జరిగింది. వ్యక్తిగత చేనేత కారుడికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున, చేనేత స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంతమంది ఉన్నాసరే రూ.5 లక్షలు ఇవ్వాలని, కనీసం ఒక్కో సభ్యుడికి రూ.1 లక్ష ఇచ్చేలా నిర్ణయించడం జరిగింది.

అలాగే, రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకుల నుండి మాకు వచ్చిన సమాచారం ప్రకారం 25,066 మంది వివరాలు మాకు రావడం జరిగింది. దాదాపు రూ.110 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు బ్యాంకుల నుండి ఇన్ఫర్మేషన్ రావడం జరుగుతోంది. ఇవన్నీ కూడా ఆధార్‌కార్డుతో అనుసంధానం చేస్తున్నాము. కొంతమంది బ్యాంకు అక్కౌంటు నెంబర్లు ఇవ్వడంలో ఆలస్యం చేయడం మూలంగా కొంత ఆలస్యమౌతోంది. డబ్బులైతే రెడీగా ఉన్నాయి. ఎప్పుడైతే వాళ్లకి సంబంధించిన పూర్తి సమాచారం వస్తుందో, అప్పుడు వాళ్లకి డబ్బులు వెంటనే రిలీజ్ చేయడమవుతుంది.

డా.ఎం.గేయానంద్: సార్, చేనేతకారులకు సబ్సిడీ గురించి చెప్పండి. 8 నెలలుగా సబ్సిడీ ఇవ్వలేదు. మంత్రి గారు ధర్మవరం వచ్చినప్పుడు ఇస్తామని చెప్పారు. ఆ సబ్సిడీ అమౌంట్ ఎప్పుడిస్తారో చెప్పమనండి సార్.

శ్రీ కొల్లు రవీంద్ర: అధ్యక్షా, పట్టు విషయం సెరికల్చర్ క్రిందకు వస్తుంది. మేము ఆల్‌రెడీ ప్రపోజల్ పంపించాము. అగ్రికల్చర్ డిపార్టుమెంటు పరిధిలోకి వస్తుంది. నేను ఖచ్చితంగా వాళ్ల దగ్గర నుండి వివరాలు తెప్పించుకుంటాను.

# కౌండిన్య త్రాగునీటి రిజర్వాయరు

ప్రశ్న నెం.8820 (60)
శ్రీ ఆర్.రెడ్డప రెడ్డి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పురపాలక పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) చిత్తూరు జిల్లాలోని పలమనేరు మునిసిపాలిటీకి త్రాగునీటిని సమకూర్చే కౌండిన్య నీటి రిజర్వాయరులోకి కొన్ని పరిశ్రమలు విడుదల చేసే కాలుష్య ముప్పు కారకాల గురించి ప్రభుత్వానికి తెలుసా;

ఆ) అయితే, ఆ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు (డా. పి.నారాయణ) :

అ) అవునండీ. 2015, నవంబరులో భారీ వర్షాల కాలంలో పలమనేరులోని మెస్సర్స్ గోవర్ధన మిల్క్ డెయిరీ నుండి ఉత్పత్తి అయిన వ్యర్థ పదార్థాలను అనధికారికంగా వరద నీటితోపాటుగా నది తీరప్రాంతంలోకి వదిలివేయడమయింది. భారీ వర్షాల కారణంగా ఒకసారి మాత్రమే మూడు రోజులపాటు ఇది జరిగింది. ఇతర విధంగా పరిశ్రమకి ఒక సెడిమెంటేషన్ ట్యాంకు ఉంది. వ్యర్థాలను వారి స్వంత క్షేత్రాలలోకి వదిలివేయడం జరుగుతుంది.

ఆ) రిజర్వాయరులోకి వ్యర్థాలను వదలకుండా, వ్యర్థ పదార్థాల శుద్ధి ప్లాంటును నిర్మించుకోవలసిందిగా వారిని ఆదేశిస్తూ మెసర్స్ గోవర్ధన మిల్క్ డెయిరీకి చిత్తూరు జిల్లా కలెక్టరు నోటీసులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా కలెక్టరు ఆదేశాల ప్రకారం, శాశ్వత వ్యర్థ పదార్థ శుద్ధి ప్లాంటు నిర్మాణాన్ని పరిశ్రమ ఇప్పటికే ప్రారంభించింది.
వాస్తవానికి, కౌండిన్య రిజర్వాయరు నుండి క్రమబద్ధ నీటి నమూనాలను సేకరించి, జిల్లా ప్రజారోగ్య ప్రయోగశాల, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ప్రయోగశాల సిఫారసులు మరియు సిపిహెచ్ఇఇఓ మార్గదర్శకాల ప్రకారం నీటి శుద్ధి ప్లాంటులో నీటిని తగువిధంగా శుద్ధి చేసి, క్రిమిరహితంగా ప్రజలకు సరఫరా చేయడమవుతున్నది.

శ్రీ ఆర్. రెడ్డపరెడ్డి(నామినేటెడ్): అధ్యక్షా, మిల్క్ డెయిరీ రెండు, మూడేళ్ల నుండి ప్రొడక్షన్‌లో ఉంది. ఇప్పుడు పొల్యూషన్ వచ్చి ప్రజల నుండి బాగా రియాక్షన్ వచ్చిన తరువాత ఆ డెయిరీకి నోటీసులు జారీ చేశారు. ఇటిపి కట్టినా కూడా మళ్లీ ఎఫ్లుయెంట్స్ వాటర్‌లోకి వదిలే ప్రమాదముంది. కాబట్టి, సీరియస్ యాక్షన్ ఆ డెయిరీ మీద తీసుకోవాలి. ఒక ఇండస్ట్రీ పెడుతున్నప్పుడు మొదట ఇటిపి కట్టి వాళ్లు ప్రొడక్షన్ చేయాలి. ప్రొడక్షన్‌లోకి వచ్చిన తరువాత ఇప్పుడు ఇటిపి కడుతున్నారు. ఎందుకంటే, కౌన్సిలర్లు, పబ్లిక్, పత్రికలు అన్నీ కూడా వాళ్ల యాక్టివిటీని హైలైట్ చేశారు. ఈ ప్రశ్న వేసింది కూడా ఎందుకంటే అక్కడ కౌండిన్య నీటి రిజర్వాయరు రూ.52 కోట్లతో కట్టారు. కానీ, ఆ డెయిరీ వాళ్లు ఏమీ భయం లేకుండా మురికి నీళ్లన్నీ కూడా త్రాగే నీటిలోకి వదిలేశారు. అందువల్ల, నేను ఈ ప్రశ్న వేశాను.

డా. పి.నారాయణ: అధ్యక్షా, వాళ్లు సెడిమెంట్ ట్యాంక్ కట్టి దాన్లోకి వచ్చే వాటర్‌ని వాళ్ల మామిడితోటకి ఉపయోగించుకుంటున్నారు. నవంబరులో వచ్చిన ఫ్లడ్‌కి వాస్తవంగా గోవర్ధన డెయిరీ నుండి వచ్చిన వ్యర్థపదార్థాలన్నీ కౌండిన్య రివర్‌కు రావడం జరిగింది. అది పొల్యూట్ అయ్యింది. తేదీ.21.11.2015 నాడు కమీషనర్ గారు ఇన్స్పెక్ట్ చేసి వాటర్ టెస్ట్ చేస్తే 25.11.15న త్రాగడానికి అది అన్‌ఫిట్ అని తేలింది. వెంటనే కలెక్టర్ గారికి తేది.221.12.2015 న ఇన్‌ఫార్మ్ చేయడం, నోటీసులివ్వడం జరిగింది. తేది.03.01.2016 న ఇఎన్‌సి గారు ఇన్స్పెక్ట్ చేసిన తరువాత, ఏపీపీసీబి మెంబర్ సెక్రటరీకి, ఏపీపీసీబి కర్నూలు ఎస్.ఇ. గారికి ఇన్‌ఫార్మ్ చేశారు. తరువాత తేదీ.02.02.2016న కలెక్టర్ గారు నోటీసులిచ్చారు. తేది.03.02.2016న మళ్లీ వాటర్ టెస్ట్ చేస్తే, అది ఫిట్ అని వచ్చింది. అయితే, తేది.22.02.2016న మళ్లీ ఇన్స్పెక్షన్ చేస్తే, అక్కడ ఇటిపి కన్‌స్ట్రక్షన్ జరుగుతోంది, మరొక ఆర్నెల్లలో అది పూర్తవుతుందని తెలిసింది. అయితే, ఏపీపీసీబి వాళ్లు చెప్పినట్లుగా రూ.16 లక్షలు డిపాజిట్ చేయమని కలెక్టర్ గారు వాళ్లకి నోటీసులిచ్చారు. ఫ్లడ్ వచ్చినందువల్ల జరిగిన ఇష్యూ కాబట్టి, వీళ్లు ఇటిపి (ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) కంప్లీట్ చేస్తే ఫ్యూచర్‌లో ఇటువంటివి జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాము.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి: అధ్యక్షా, ఈ ప్రశ్న నేను కూడా వేశాను గానీ అడ్మిట్ కాలేదు. నవంబరు నెలలో జరిగిన జిల్లా పరిషత్తు సమావేశంలో ఈ అంశంపై ఒక సీరియస్ చర్చ జరిగింది. కౌండిన్య నీటి రిజర్వాయరులోకి ఈ మొత్తం పొల్యూటెడ్ వాటర్ వచ్చినందువల్ల బోర్‌వెల్స్‌లో కూడా ఈ కంటెంట్స్ వచ్చి అత్యధికంగా కలరా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు ఆ ప్రాంత ప్రజలు గురయ్యారు. ఈ విషయంలో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన చర్యల విషయంలో దాదాపు అక్టోబర్ నుండి ఇప్పటివరకు కూడా చర్యలు తీసుకోకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇది చాలా సీరియస్ ఇష్యూ. అక్కడి హాస్పిటళ్లలో కూడా రోగుల వివరాలు రికార్డు అయ్యాయి. అతిసార వ్యాధితో గానీ, మలేరియా, టైఫాయిడ్‌తో గానీ ఆ పలమనేరు హాస్పిటల్ పరిధిలో మరణాలు కూడా సంభవించాయి. ఇంక ఏ మాత్రం ఆలస్యం చేయడం మంచిది కాదు. లేదంటే, ఆ ప్రైవేటు ఫ్యాక్టరీకి ఏమన్నా అండగా ఉంటున్నారా అనేది కూడా అర్థం కావడం లేదు.

డా. పి.నారాయణ: అధ్యక్షా, వాస్తవానికి పలమనేరులో 56 బోర్లున్నాయి. ఆ బోర్ల ద్వారా వాటర్ తీసుకోవడం జరుగుతోంది. ఫ్లడ్ వచ్చే రోజున కూడా వాస్తవానికి బోర్లద్వారానే నీళ్లు తీసుకుంటున్నాము. ఎందుకంటే ఆ కౌండిన్య నది రిజర్వాయరు డెడ్ స్టోరేజీలో ఉంది కాబట్టి ఆ రోజున ఆ సమస్య కూడా లేదు. అయితే, ఫ్లడ్ వల్ల వచ్చింది కాబట్టి ఆరు నెలల్లో వాళ్లు ఇటిపిని పూర్తి చేస్తామన్నారు. తప్పకుండా ఆరు నెలల్లో ఇటిపి పూర్తయ్యేటట్లుగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

MR.CHAIRMAN: Now, the House is adjourned Tea Break for 15 Minutes.

(Then, the House adjourned at 11-18 a.m.)

* * *

ఉ.11.40

(తేనీటి విరామానంతరం సభ ఉదయం గం.11.46 ని.లకు తిరిగి ప్రారంభమయింది.)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్షస్థానం వహించారు)

మిస్టర్ ఛైర్మన్ : ఆదిరెడ్డి అప్పారావు గారూ, స్పెషల్ మెన్షన్. సభలో లేరు.

Item No.II - All the papers are deemed to have been laid on the Table of this House:

**2.PAPERS LAID ON THE TABLE:**

1. Copies of the Audit Reports on the Accounts of the Andhra Pradesh State Financial Corporation, for the Years 2012-2013 and 2013-2014, as required under Section 619(2) of the Companies Act, 1956.

2. A copy of the Audit Report of the Vijayawada-Guntur-Tenali-Mangalagiri Urban Development Authority, for the years 2009-10 to 2010-11, as required under Section 24(4) of the Andhra Pradesh Urban Areas (Development) Act, 1975, along with reasons for delay.

Now we will take-up matter under Rule 311 regarding "Pending Irrigation Projects in Rayalaseema Area".

శ్రీ బి. చంగల్ రాయుడు (మైక్ లేదు ): రూలు–311 క్రింద మేము ఓవరాల్ రాయలసీమ డెవలప్‌మెంట్ కింద అడిగాము. వైయస్ఆర్‌సిపి సభ్యులు ఏం అడిగారో నాకు తెలియదు. మొత్తానికి అవి పక్కకు పెట్టేసి రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులపైన చర్చకు తీసుకున్నారు. What about pending projects?

మిస్టర్ ఛైర్మన్ : మిగతా డిపార్ట్‌మెంట్స్ అన్నీ కలిపితే అది షార్ట్ డిస్కషన్ అవుతుంది. అందువల్లనే we have taken important work.

## 3. రూల్ 311 క్రింద రాయలసీమలోని పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ పై చర్చ :

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు(శాసనసభ నియోజకవర్గం) : సార్, నిన్న రాయలసీమ సమగ్రాభివృద్ధికి సంబంధించిన వాటిపైన షార్ట్ డిస్కషన్ పెట్టమని అడిగితే రూలు–311 క్రింద నోటీసు ఇమ్మన్నారు. అందువల్ల రూలు–311 కింద నోటీసు ఇచ్చాము. కానీ, ఇప్పుడు అజెండాలో కేవలం రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు పైనే గౌరవ మంత్రిగారు స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది. ఏమైనప్పటికీ వ్యవసాయ రంగం, సాగునీరు అనేది కూడా అత్యంత కీలకమైన సబ్జెక్ట్. దీనిని రూలు–311 క్రింద ఆమోదిస్తూ, నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

రాయలసీమ నీటి ప్రాజెక్టులకు సంబంధించిన విషయంలో పోలవరం ప్రాజెక్టు ద్వారా మాత్రమే మిగులు జలాలు కాకుండా శ్రీశైలం నుండి నికర జలాలు ఇవ్వడానికి అవకాశం ఉన్నది.

మిగులు జలాల వ్యవహారం కాకుండా, కృష్ణానది నికర జలాల్లో రాయలసీమకు ఏ విధంగా వాటా ఇస్తారు అనేదానిపై స్పష్టంగా చెప్పవలసిన అవసరం ఉంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.32000 కోట్లు అవసరమని చెప్పి రివైజ్డ్ ఎస్టిమేట్స్ వేసిన తరువాత ఇప్పుడు రూ.3,500 కోట్లు కేంద్ర ఒక వంద కోట్లు కలిపినా రూ.4,000కోట్లు కూడా లేదు. మొత్తం అంతా కలిపి లెక్కవేసుకుంటే ఇంకా 7 సంవత్సరాలదాకా కేటాయింపులు చేయాల్సిన అవసరం వస్తుంది. కానీ, ప్రభుత్వమేమో 2018 నాటికి పూర్తవుతుందని, మొదటి దశ అని ఏదేదో అంటున్నారు ఇవన్నీ చూస్తుంటే కృష్ణా జలాల వాటాకు సంబంధించిన అంశాలు మాకు ప్రశ్నార్థకంగా అవుతున్నాయి.

ఉ.11.50

రాయలసీమ ప్రాంతంలో నాలుగు జిల్లాల్లో ఉన్నటువంటి ప్రజలందరూ కూడా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిసి ఆడుతున్నటువంటి దాగుడుమూతలుగా పరిగణిస్తున్నారు. ఎందుకంటే, కేటాయింపులు ఆ మేరకు లేవు. కేంద్రప్రభుత్వం కూడా స్వతంత్రంగా టేకప్‌చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజితోసహా అంతా మేమే చూసుకుంటామని చట్టంలో నిర్దుష్టంగా పేర్కొన్న తర్వాత పోలవరం ప్రాజెక్టుకు సంబంధించినటువంటి అంశంలో రాష్ట్రప్రభుత్వం పోలవరం అథారిటీని ఏర్పాటుచేస్తే, వారికి సంబంధం లేదనేటటువంటి పరిస్థితులలో Detailed Project Reports రావడం లేదని, అవి రాకపోతే నిధులు ఇవ్వమని కేంద్రం, కేంద్రానికి, రాష్ట్రానికి, పోలవరం అథారిటీకి మధ్యలో పోలవరం ప్రాజెక్టు అనేది by all means, 2018 వ సంవత్సరంలోగా పూర్తవడానికి గానీ, లేదా మొదటి దశ పనులు పూర్తవడానికి గానీ, లేదా శ్రీశైలం నీటిలో మరియు కృష్ణాజిల్లాలోని నికరజలాలు రాయలసీమ జిల్లాలకు వచ్చేటటువంటి పరిస్థితి లేదనేది స్పష్టంగా అర్థమవుతున్నది. దీనిని క్లారిఫై చేయవలసినటువంటి అవసరమున్నది.

అనంతపురం జిల్లాను ప్రతి నాలుగు సంవత్సరాలలో మూడు సంవత్సరాలు కరవు జిల్లాగా ప్రకటించడం జరుగుతోంది. కడప జిల్లాను కూడా ప్రతి నాలుగు సంవత్సరాలలో మూడు సంవత్సరాలు అదేవిధంగా కరవు జిల్లాగా ప్రకటించడం జరుగుతోంది. కడప జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న కొంత మంది పేర్లను కూడా నేను సేకరించాను. 1. శ్రీ లోమడ శేషయ్యగారి మోహన్‌రెడ్డి ఎర్రబొమ్మలపల్లె, చక్రాయపేట తేది. 02.01.2015 నాడు మరణించారు. 2. శ్రీ వరికూటి రామలింగారెడ్డి, మర్రిపల్లె, వి.ఎన్.పల్లె మండలం, తేది. 29.01.2015 నాడు ఆత్మహత్య చేసుకున్నారు. 3. శ్రీ వెలమారి హరినాథనాయుడు, వెలమవారిపల్లె, వేంపల్లె, తేది. 24.03.2015 నాడు ఆత్మహత్య చేసుకున్నారు. 4. శ్రీ కొండా రామచంద్రారెడ్డి, ఆర్.తుమ్మలపల్లె, పులివెందుల మండలం తేది. 20.04.2015 నాడు ఆత్మహత్య చేసుకున్నారు. 5. శ్రీ పుర్రి పురుషోత్తం రెడ్డి, సంతకొమ్మూరు, తండూరు మండలం, తేది. 04.07.2015 నాడు ఆత్మహత్య చేసుకున్నారు. 6. శ్రీ మిరియపు రామిరెడ్డి, చియ్యపాడు గ్రామం, చాపాడు మండలం, తేది. 02.09.2015 నాడు ఆత్మహత్య చేసుకున్నారు. 7. శ్రీ పి.రాజశేఖర్, కొమ్మనూతల, పులివెందుల తేది. 09.10.2015 నాడు మరణించారు. 8. శ్రీ బి.వెంకట సుబ్బారెడ్డి, లింగారెడ్డి పల్లె, సి.కె.దిన్నె మండలం, 05.11.2015 నాడు మరణించారు. ఈ ఎనిమిది మందిలో ఏ ఒక్కరికీ కూడా గత సంవత్సరం 11వ నెల వరకూ ఒక్క పైసా కూడా అందలేదు.

2002-03 వ సంవత్సరం నుంచి 2015-16 వరకూ వర్షపాతానికి సంబంధించిన గణాంకాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. మేము కూడా గ్రామగ్రామానికి పర్యటించి అక్కడున్న

అధికారులతో సంప్రదించి వాటికి సంబంధించిన గణాంకాలను తీసుకోవడం జరిగింది. కరవు మండలాలు వరుసగా ఈ 15 సంవత్సరాలలో ఒక్క కడప జిల్లాలోనే చూసుకున్నట్లయితే, 2002-03 వ సంవత్సరంలో 51 కరవు మండలాలు ఉంటే, 2015-16 వ సంవత్సరంలో కూడా కడప జిల్లాలో 51 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. ఈరకంగా కరవు తీవ్రత అనేదానికి ప్రధానమైనటువంటి గాలేరు-నగరి గానీ, హంద్రీనీవా గానీ లేదా తెలుగుగంగ ప్రాజెక్టులను వచ్చే సంవత్సరంలోగా పూర్తిచేస్తామని బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టారు. సంతోషం, కానీ, దానికి తగినటువంటి నిధులు కేటాయించలేదు. కనీసం రూ. 10 వేల కోట్ల నిధులు కేటాయిస్తేగానీ ఈ ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం లేదు. ఈ ప్రాజెక్టులు పూర్తికావడమనేది, పోలవరం ప్రాజెక్టు పూర్తికావడమనేది, కృష్ణాజిల్లాలోని నికరజలాల్లో వాటా ఇవ్వడమనేది ఎక్కడికక్కడ అనుమానాలు రేకెత్తిసూ ఉన్నాయి. ఒకసారి పోలవరం ప్రాజెక్టు ప్రారంభమైంది అనేది, గోదావరిలో నీరు ప్రారంభమైంది అనేది వచ్చిన తర్వాత కృష్ణాజలాల్లో ఉండే వాటా, పైన ఉన్న రాష్ట్రానికి 35 టి.ఎమ్.సి.లు ఇవ్వవలసినటువంటి అవసరముంటుంది. మనం తీసుకునేది 80 టి.ఎమ్.సి.లు, వీటన్నింటికి ఇచ్చేసిన తర్వాత విశాఖపట్నానికి, ప్రకాశం జిల్లా నుంచి రాయలసీమ జిల్లాలకు పోతిరెడ్డిపాడు నుంచి తీసుకుని కనీసం ఒక్క కడప జిల్లాకే 89 టి.ఎమ్.సి.ల నీరు అవసరమవుతుంది. భూమి వివరాలన్నీ నేను చెప్పగలుగుతాను. ఆయకట్టు మొత్తం 2,13,882 ఎకరాల భూమి మధ్యతరహా ప్రాజెక్టుల క్రిందకు వస్తుంది. అలాగే, పూర్తిచేయవలసిన పెద్ద ప్రాజెక్టులు తెలుగుగంగ, గాలేరు-నగరి మొదటి దశ, గండికోట ఎత్తిపోతల, చిత్రావతి కుడికాలువ, గాలేరు-నగరి రెండవ దశ, మైలవరం ఆధునీకరణ, హంద్రీనీవా, కర్నూలు - కడప కాలువ మొదలైనవి ఉన్నాయి. ఈ కర్నూలు - కడప కాలువ బ్రిటీషువారి పిరియడ్ నుంచి ఉన్నది. అక్కడ ఇంకా అదే పరిస్థితి కొనసాగుతూ ఉన్నది. కడప జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులలో పించా ప్రాజెక్టు, దిగువ సాగిలేరు, ఎగువ సాగిలేరు, బుగ్గవంక, అన్నమయ్య మొదలైన ప్రాజెక్టులు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ ద్వారా స్థిరీకరణ మొత్తం కలిపితే, 6,40,513 ఎకరాలు అయితే మధ్యతరహా ప్రాజెక్టుల క్రింద 2,13,882 ఎకరాల సాగు భూమి ఉన్నది. 884 అడుగుల నీటిమట్టాన్ని పోతిరెడ్డిపాడులో, శ్రీశైలంలో ఏవిధంగా దానిని మీరు స్టెబిలైజ్ చేస్తారు? తెలంగాణలో విద్యుదుత్పత్తి గురించి వారి వాటర్‌ను వారు వాడేసుకుంటున్నారు. పైనుంచి కర్నాటక రాష్ట్రం వారు అక్రమంగా, సక్రమంగా, అనేక పద్ధతుల్లో వారు ఆ నీటిని అక్కడకు తీసుకురావడానికి అనేక అభ్యంతరాలు వ్యక్తపరుస్తున్నటువంటి పరిస్థితి ఉన్నది. కాబట్టి శ్రీశైలం రిజర్వాయరులో నీటిమట్టాన్ని ఏవిధంగా కాపాడతారు? ఏవిధంగా ఇవ్వగలుగుతారు? తద్వారా పోతిరెడ్డిపాడుకు ఏవిధంగా వస్తాయి? హంద్రీనీవా గానీ, గాలేరు-నగరి గానీ, మిగిలినటువంటి ప్రాజెక్టుల మీద గానీ కావాల్సిన మేరకు నిధుల కేటాయింపు జరపనందువల్ల ఈరకమైన తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోంది.

అధ్యక్షా, నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పదలచుకున్నాను. ఇదేదో ప్రభుత్వాన్ని ఎత్తిచూపే ఉద్దేశ్యం కాదు. అత్యంత ప్రమాదకరమైనటువంటి ఆలోచనలోకి ఈ నిర్లక్ష్యం అనేది, లేదా పట్టించుకోకపోవడమనేది లేకపోతే మేము పట్టించుకుంటున్నామని మీరు మాటిమాటికి చెప్పినాగానీ ప్రజలు కన్‌విన్స్‌కాని సందర్భంలో ఇదొక తీవ్రమైనటువంటి ప్రత్యేకవాద ఉద్యమానికి దారితీస్తున్నటువంటి పరిస్థితులు ఉన్నప్పటికీ, దానిని మేము నమ్మడం లేదు అధ్యక్షా. ఈ ప్రత్యేకవాదం వల్ల రాయలసీమకు ఏదో మేలు జరుగుతుందని కానీ, ప్రత్యేకవాదం అభివృద్ధి చెందాలని గానీ మేము, మాపార్టీ కోరుకోవడం లేదు. దానికి వ్యతిరేకంగా నిలబడాలంటే, దానికి ఊతం కల్పించకుండా ఉండాలంటే, రాయలసీమ మీద, కరవుసీమ మీద ప్రత్యేకమైన దృష్టిని పెట్టి,

కేటాయింపులు ఇచ్చి పోలవరం నీరిచ్చి, కృష్ణాజలాల యొక్క నికరజలాల్లో వాటా ఇచ్చినట్లుగా రుజువు చేయవలసినటువంటి బాధ్యత మనకు ఉన్నదని చెప్పి ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

రాయలసీమలో ఉన్న పరిశ్రమల్లో ఎక్కువభాగం నేడు మూతపడ్డాయి. ప్రయివేటు రంగంలో ఉన్నటువంటివి, ప్రభుత్వ రంగంలో ఉన్న పెద్ద పెద్ద పరిశ్రమలన్నీ కూడా మూతపడ్డాయి. వాటిని తిరిగి తెరిపించేటటువంటి కార్యక్రమాలు జరగడం లేదు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంటును నెలకొల్పుతామని చెప్పారు. వారు అక్కడ వయబిలిటీ లేదని రిపోర్టు ఇచ్చారని తెలుస్తోంది. వయబిలిటీ రిపోర్టు ఇవ్వడం, ఇవ్వకపోవడం దానిలోని అంశాలు, వాటిని రాష్ట్రప్రభుత్వం వైపునుంచి గానీ, మంత్రుల వైపునుంచి గానీ, ఏవిధమైనటువంటి పరిశ్రమ పెట్టిస్తామనేటటువంటి హామీని ఇవ్వడంలేదు. కాబట్టి, నేను మనవిచేయదలచుకున్నది ఏమిటంటే, రాయలసీమ ప్రజలయొక్క ఆకాంక్షను, ఆందోళనను, భవిష్యత్తులో ఊహించుకుంటేనే ఇబ్బందిగా ఉండేటటువంటి పరిణామాలను నివారించడానికి యుద్ధప్రాతిపదిక మీద రాయలసీమ అభివృద్ధి గురించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దృష్టిని కేంద్రీకరించాలని నేను తమరిద్వారా మనవిచేస్తున్నాను.

డా. ఎం.గేయానంద్: అధ్యక్షా, నిన్న రాయలసీమలోని 4 జిల్లాల్లో ఉన్న వేలాదిమంది ప్రజలు హైదరాబాదుకు వచ్చి వారి కడుపుమంట ఏమిటి, వారి బాధ ఏమిటనేది వారు వెల్లడించారు. నిజానికి, నేను అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలేకాక, ఈమధ్య చిత్తూరు జిల్లాలో కూడా పర్యటిస్తున్నాను. నేను ఆ జిల్లాలో పర్యటిస్తున్నప్పుడు మీకు వైద్యం అందిస్తాము, మంచి విద్యకోసం ఏర్పాట్లు చేస్తాము, ఉపాధి కల్పిస్తామని మనం వారికి ఎన్ని చెప్పినా కూడా చిట్టచివరకు ప్రజలు అడిగేది ఏమిటంటే, నీళ్ల విషయం ఏమిటని వారు మనల్ని అడుగుతారు.

మ.12.00

గత సంవత్సరం చిత్తూరులోని 2,500 గ్రామాలకు వాటర్ ట్యాంకర్‌లతో నీళ్లు సరఫరా చేసే పరిస్థితిని చూశాము. రాయలసీమలోని జిల్లాలన్నింటి పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రాయలసీమలోని నీటి పారుదల ప్రాజెక్టులు కాకుండా ఇంకో ప్రయారిటీ ఉండకూడదు. ఎందుకంటే, ఇంకో ప్రయారిటీ పెట్టుకుంటే మాకు అన్యాయం జరుగుతుంది. త్రాగునీరు లేకపోతే ఎవ్వరూ ఏ పని చేయలేరు. నీళ్లు లేకపోతే హక్కులు, చదువులు అనేవి ఉండవు. బతకడం కూడా చాలా కష్టంగా ఉంటుంది. కాబట్టి మన ప్రభుత్వం ఫస్ట్ ప్రయారిటీ రాయలసీమ ప్రాంతానికి ఇచ్చి ప్రాజెక్టులు పూర్తి చేస్తుందా, లేదా అనేది చెప్పాలి.

రాయలసీమకు హంద్రీ-నీవా, గాలేరు-నగరి కీలకం. హంద్రీనీవాను మీరు ఎప్పుడు పూర్తి చేస్తారు. నిజానికి గత రెండు సంవత్సరాల నుంచి ఈ సంవత్సరం పూర్తిచేస్తాం, ఈ సంవత్సరం పూర్తిచేస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగింది. మొన్నకూడా ఇదే మాట అన్నారు. కానీ, వాస్తవంగా ఎప్పుడు హంద్రీనీవా రెండు దశలు పూర్తయ్యి అక్కడ ఉండే పొలాలకు నీళ్లు అందుతాయనేది అసలు ప్రశ్న. దీనికి జవాబు చెప్పవలసిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. దానికి సంబంధించినంత వరకు ప్రభుత్వం ఫుల్‌ఫిల్ చేయకపోతే, is the government prepared for the penalty అని కూడా నేను అడుగుతున్నాను. అంటే ఒకవేళ ఈ జూలైలోనో, వచ్చే సంవత్సరంలోనే పూర్తి చేస్తామని అంటే దానిని ఫుల్‌ఫిల్ చేయకపోతే అక్కడ ఉన్న ప్రజలకు మీరు కాంపెన్సేషన్ చెల్లిస్తారా? అని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. హంద్రీనీవా పూర్తి అవ్వాలంటే

సుమారు రూ. 4 వేల కోట్లు ఖర్చు అవుతుంది. అయితే, ఇంత వరకు ఈ రెండేళ్లలో వీటికి అయిన ఖర్చు ఐదారు వందల కోట్లు కూడా లేదు. ఇంకా రాబోయే రెండు మూడేళ్లలో పూర్తి చేయాలంటే మీరు బడ్జెటులో ఎంత ఖర్చు పెడతారు. అంటే సుమారు రూ.1000 కోట్లు ప్రతి సంవత్సరం హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేయడానికి మీరు ఖర్చు పెడతారా? పట్టిసీమను ఆరునెలలలో పూర్తి చేస్తామని సుమారు రూ.1500 కోట్లు ఖర్చుపెట్టి ముందుకు తీసుకుపోతున్నారు. అదే రీతిలో, పట్టుదలతో హంద్రీనీవాను కూడా పూర్తి చేస్తారా అని నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ప్రభుత్వం తప్పనిసరిగా ఈ సంవత్సరమే హంద్రీనీవాను పూర్తి చేయాలి. అలా చేయని పక్షంలో ప్రజలకు కాంపెన్సేషన్ ఏ పద్ధతిలో ఇస్తారనేది చెప్పాలి. అదేవిధంగా గాలేరు నగరి పరిస్థితి కూడా ఉంది. ఈ రెండు ప్రాజెక్టులు రాయలసీమకు చాలా ముఖ్యమైనవి. ఈ రెండింటికి స్పష్టమైన హామీ, కార్యాచరణ ప్రణాళిక అవసరం. హంద్రీనీవా ప్రస్తుతం 40 టి.ఎం.సి.లతో ఉంది. దానిని 50 టి.ఎం.సి.లకు విస్తరించవలసిన అవసరం ఉంది. ఏరకంగా దానిని విస్తరిస్తారు? ఇంతకు ముందే సర్వే చేయడానికి 2007-08 వ సంవత్సరంలో ప్రభుత్వం ఒక ఆదేశం ఇచ్చింది. అది ఏమైంది, సంబంధిత వివరాలు తెలుపవలసిందిగా కోరుతున్నాను.

అలాగే శ్రీశైలం నీటి మట్టాన్ని చూస్తే మాకు భయంగా ఉంది. శ్రీశైలం నీటి మట్టం ప్రస్తుతం ఏవిధంగా ఉండాలో, అది రాబోయే సంవత్సరాలలో కూడా అదేవిధంగా ఉంటుందా, లేదా అనే భయాందోళన రాయలసీమ ప్రజలలో ఉంది. శ్రీశైలంను జలవిద్యుత్ ప్రాజెక్టుగా కాకుండా, నీటి పారుదల ప్రాజెక్టుగా చేయమని నేను మొన్న వెళ్లినప్పుడు ప్రజలు అడుగుతున్నారు. మిగిలిన అంశాలు అంటే హామీలు, ప్రజల ఆకాంక్షలకు సంబంధించి మీ నోటీసుకి పంపించాను.

అలాగే తెలుగుగంగ విషయం కూడా ప్రభుత్వం వివరించవలసి ఉంది. అలాగే గండికోట, చిత్రావతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ పూర్తవ్వాలంటే ఎంత మేర నిధులు కావాలి, ఎంత ఇస్తారు, తెలుగుగంగను ఎప్పటిలోగా పూర్తి చేస్తారు, పి.ఏ.బి.ఆర్. స్టేజ్-2 పరిస్థితి ఏమిటి, సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్, కేసీ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్, పులికనుమ, హెచ్.ఎల్.సి, ఎల్.ఎల్.సి ఆధునికీకరణ పద్ధతుల విషయం ఏమిటి, బీటీ ప్రాజెక్టుకి నాలుగైదు టి.ఎం.సిల నీళ్ల ట్రిబ్యునల్స్ ఇచ్చాయి. వీటన్నింటి పరిస్థితి ఏమిటి? పోలవరం ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీళ్లిస్తామని ప్రభుత్వం చెబుతుంది. కానీ రాయలసీమ ప్రజలు దీనిని నమ్మడం లేదు. ఇది రాయలసీమ కోసం కాక, రాజధాని కోసం, కృష్ణా, గుంటూరు జిల్లాల కోసం చేస్తున్నారని ప్రజలు నమ్ముతున్నారు. ఈ పోలవరం ప్రాజెక్టుకి సంబంధించిన స్పష్టమైన డాక్యుమెంట్‌ని ఇవ్వగలరా అని నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

ఇప్పుడు అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉన్నట్లే, రాయలసీమ సమగ్ర అభివృద్ధికి కూడా ఒక మాస్టర్ ప్లాన్ కావాలని సుమారు 1966వ సంవత్సరంలో శాసనసభలో చర్చ జరిగింది. ప్రభుత్వం కూడా చేస్తామని చెప్పింది. కానీ ఇంతవరకు దాని ఊసే లేదు. ఇప్పటికైనా రాయలసీమ మాస్టర్ ప్లాన్ కోసం ప్రభుత్వం ఏం చేస్తుందనేది చెప్పవలసిందిగా నేను కోరుతున్నాను. రాయలసీమలో కరవు ఉండడం వల్ల అనంతపురంలో దాదాపు 5 లక్షల మంది వలసలు వెళ్లారు. ఇప్పటికీ జనవరి, ఫిబ్రవరి నెలల్లో దాదాపు 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థులు మధ్యాహ్నం తిండిలేక స్కూళ్లు, కాలేజీలు మానేస్తున్నారు. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో రాయలసీమలోని కరవును మానవీయ దృక్పథంతో తీసుకోవాలి. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం పట్టించుకోకుండా, నీళ్లు ఇవ్వకుండా ఉంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. హంద్రీనీవాకు నికర జలాలు ఇచ్చి, దానిని జాతీయ ప్రాజెక్టుగా మార్చేందుకు వర్కౌట్ చేయండి. అంతేకాక ఇతరత్రా

రాజకీయపరమైన, పరిపాలనాపరమైన, ప్రజలకు విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగించే చర్యలను తీసుకోవడం ద్వారా రాయలసీమ ప్రజల డిమాండ్లను పట్టించుకోవాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

SRI B.CHANGAL RAYUDU: Water is nothing but Gold in liquid form. నీరు బంగారమని సర్ ఆర్థర్ కాటన్ చెప్పారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు "కనకపు వర్షం ప్రవహించిన కృష్ణ, అదే వర్షం" అని అన్నారు. ఆ నదుల యొక్క నీటిని అక్కడి జిల్లాలు ఉపయోగించుకున్నాయి. అందువల్లే అక్కడ కనకపు వర్షం కురుస్తోంది. అక్కడ నీళ్లు బంగారం రూపంలో కనబడుతున్నాయి. రాయలసీమ జిల్లాల గురించి మిత్రులు చెప్పారు. ఈ రాయలసీమ జిల్లాలు ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని, జిల్లాకు ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రులను కూడా ఇచ్చాయి. అయినా రాయలసీమ ప్రజానీకానికి మాత్రం నీళ్లు లేవు. స్వర్గీయ శ్రీ ఎన్.టి. రామారావు గారు ఈ విషయంపై ఒక సర్వే నిర్వహించారు. తరువాత 2004 నుంచి 2010వ సంవత్సరం వరకు వచ్చిన మా పార్టీ ప్రభుత్వాలు నిధుల కేటాయింపులు బాగానే చేశాయి. కానీ, కాంట్రాక్టర్ల పనితీరువల్ల అవి సక్రమంగా జరుగలేదు. హంద్రీనీవా విషయానికి వస్తే కర్నూలు నుంచి అనంతపురం వరకు దాదాపు 80 శాతం పని పూర్తయింది. చిన్నచిన్న పనుల కారణంగా నీళ్లు ఇవ్వలేదని, అవి పూర్తి చేయగలిగితే నీళ్లు వస్తాయని, స్వయాన మంత్రిగారు రెండు మూడు సార్లు తిరిగి స్టేట్‌మెంట్ ఇచ్చారు. వారు అక్కడే ఉండి మరీ పనులు చేయించారు. I have to appreciate him.

మ. 12.10

కానీ, అధ్యక్షా, తిరగడం వేరు, నీరు ఇవ్వడం వేరు. నిధులు లేకుండా ఏం తిరిగినా ఏం ప్రయోజనం సార్? నిధులు చాలా తక్కువ ఇచ్చి బాగా తిరిగారు సార్. బాగా తిరిగిన దానికన్నా you have diagnosed the disease. దానికి తగినట్లుగా ఇంజక్షన్ ఇచ్చే ప్రయత్నం జరగలేదు. ఎందుకంటే, మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని చెపుతున్నారు. కానీ, గత సంవత్సరం బి.ఈ. కన్నా, ఆర్.ఈ. ఎక్కువ వచ్చింది. ఇవన్నీ మొన్న ఇచ్చిన బడ్జెట్ పుస్తకంలోనే ఉన్నాయి. కానీ, రాయలసీమ జిల్లాలకు నిధులు రాలేదు సార్. నేను ఈ మధ్యన మంత్రాలయం వెళ్ళాను. అక్కడ ఎమ్మిగనూరు నుంచి దాదాపు 1,50,000 ఎకరాలలో వేరుశనగ పంట అంతా ఎండిపోయి ఉంది. ఈసారి కడప, కర్నూల్లో కొంత భాగం, 80 శాతం వరకు చిత్తూరు ప్రాంతాలలో వర్షాలు పడ్డాయి. అప్పుడు ప్రజలు కరవును మరచిపోయారు. ఈ రోజున హైదరాబాదులో పూలు, పండ్లు అమ్ముకునే వారిలో దాదాపు 80 శాతం మంది అనంతపురం వాసులే. బెంగుళూరులో అరటిపళ్ళు అమ్ముకునే వారు అంతా దాదాపు అనంతపురం ప్రజలే ఉన్నారు. మద్రాసులో కూడా ఈ అరటిపళ్ళ వ్యాపారం చేసుకునే వారే ఎక్కువగా ఉన్నారు. వారంతా ఊళ్ళు వదిలిపెట్టి వచ్చేశారు. అధ్యక్షా, కావాలంటే, నేను మంత్రిగారిని ఆయా ప్రాంతాలకు తీసుకువెళ్ళి చూపిస్తాను. వాళ్ళు భార్యా, బిడ్డలను, కుటుంబాలను వదిలేసి ఈ ప్రాంతాలకు వచ్చి వ్యాపారం చేసుకుని బ్రతుకుతున్నారు. దీనికంతా నీరు లేకపోవడమే కారణం. ఆ ప్రజలు కష్టాలకు, నష్టాలకు అడ్జస్ట్ అయిపోయారు. కానీ, వారి పిల్లలు అడ్జస్ట్ అవుతారా? శ్రీ తరిమెల నాగిరెడ్డి గారు ఉపయోగించిన పదాలను నేను ఈ సభలో ఉపయోగించకూడదు కానీ, ఆయన చట్ట సభల నుంచి వెళ్ళిపోయేటప్పుడు చెప్పినటువంటి ఘనమైన మాటలు సార్. 'మేము జీర్ణించుకుంటాము, మా బిడ్డలు కూడా జీర్ణించుకుంటారు. వారి బిడ్డలు కూడా జీర్ణించుకుంటారంటే పొరపాటు అవుతుందని అన్నారు.' ఎదుగుతున్నటువంటి సమాజంలో మంచి భవిష్యత్తు కావాలని ఎదురు చూస్తున్న ఈ దశలో పూర్తిగా అణచివేసే పరిస్థితిలో ఉన్నారు. నీరు ఇవ్వకపోతే అణచివేసే

పరిస్థితేగా ఉండేది! నీరు ఇస్తే వారిని బాగుపరచినట్లే. ఆ ప్రాంతాలకు నీరు ఇచ్చేదానికి మీరు చేసినటువంటి ప్రయత్నాలు ఘనంగా ఉన్నాయి కానీ, నిధులేమో అధ్వాన్నంగా ఉన్నాయి.

సార్, నేను మొన్న మాటల సందర్భంలో సోమశిల గురించి మాట్లాడితే, మా నీళ్ళు మీరు తీసుకువెళతారా అన్నారు. మా నీళ్ళు మీకు అవసరం లేదు సార్. వారికి నష్టపరిహారం ఇవ్వమని చెపితే, మంత్రిగారి రియాక్షన్ బాగానే ఉంది. మొదటగా మా ప్రాంతం నుంచే మాట్లాడతాను సార్. అన్నమయ్య ప్రాజెక్టును దాదాపు 15 సంవత్సరాల క్రితం తీసుకున్నారు. దానికి కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. మరి కొన్ని కోట్లు అయితే ఆ ప్రాజెక్టు పూర్తిఅయిపోతుంది. కానీ, ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో నీటిని ఆపేశారు. దానిమీద ఎటువంటి సంఘటనలు జరగలేదు. అది కూడా రాయచోటి ప్రక్క నుంచే ఉంది. 15 సంవత్సరముల తరువాత మొన్న వచ్చిన తుఫానుకు ఆ ప్రాంతంలో ఉన్న కుంటలు పూర్తిగా నిండినవి. అక్కడ నుంచి అన్నమయ్యకు వచ్చి, అన్నమయ్య నుంచి సోమశిల ప్రాజెక్టుకు వెళుతున్నాయి. మాకు కోడూరు, రాజంపేట నియోజక వర్గాలకు త్రాగునీరు ఇస్తారేమో తెలియదు కానీ, సాగునీరుకు సంబంధించి మాత్రం సోమశిల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ని తీసుకువచ్చి, అన్నమయ్య ప్రాజెక్టులో అవి కూడా ఒకటిన్నర, రెండు టిఎంసిల వరకు నీటిని నింపగలిగితే, మా అందరికి సాగునీరు, త్రాగునీరు వస్తుంది. దానిని చిన్న నిధులతోనైనా ఆల్‌రెడీ ప్లాన్‌చేసి డిజైన్‌చేసి పెట్టి ఉన్నారు. దానిని ఎక్కడా బయట పెట్టలేదు.

ఇంక గాలేరు-నగరి, హంద్రీనీవాకు సంబంధించి చూసినట్లయితే, హంద్రీనీవాను నెం.1 ప్రయారిటీగా తీసుకువచ్చి, అనంతపురం జిల్లా అంతా ఇవ్వవచ్చు. దీనికి సంబంధించి మాకన్నా మా కేశవ్ గారికి అవగాహన ఎక్కువగా ఉంది. ఈ విషయంలో ఆయన ఎక్కువ మాట్లాడాలి. దాదాపు 80 శాతం వరకు ఆ ప్రాంతంలో పాదయాత్ర చేశారు. ఆయనతోపాటు, ఆనాటి రెవెన్యూ, ఇరిగేషన్ మంత్రులతో నేను కూడా ఆనాటి పాదయాత్రలో పాల్గొన్నాను. అక్కడ చిన్న చిన్న పనులు చేసేదానికి కూడా దాదాపు 20 నెలల సమయం పడుతుందా సార్? ఇంకా 20 నెలలు కూడా పూర్తి కాలేదు. మన డెప్యూటీ ఛైర్మన్ గారు గండికోట ప్రాంతానికి నీటిని వదలినప్పుడే నేను గడ్డం గీసుకుంటానని ప్రమాణం చేశాడు. ఆయన ఋషి కాదు, మహర్షిలా అయిపోయాడు. ఆయనకోసమైనా ఆ గండికి నీరు వదిలే ప్రయత్నమైనా చేయండి సార్. గతంలో ఒక టన్నెల్ త్రవ్వడానికి ఆ రోజుల్లో అంచనా రూ.40కోట్లు వేస్తే, ఈనాడు అది రూ.160కోట్లకు చేరింది. పాత కాంట్రాక్టర్ల ద్వారా టన్నెల్ పనులు చేయిస్తామని అంటున్నారు. వారితో చేయిస్తే, పాత రేట్లతోనే చేయించండి. కాంట్రాక్టర్ల యొక్క వైఫల్యంతో జరగవలసిన పనులు జరగకుండా పోతే, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరే విధంగా ఈ ప్రభుత్వం పనిచేస్తున్నదనే అనుమానం ఈ రాయలసీమ ప్రాంత ప్రజలలో కలుగుతున్నది సార్. చివరగా డబ్బులు పోయేది పేద ప్రజానీకానికే. మీరు ఒక టైం బౌండ్‌గా ఈ రాయలసీమ ప్రాజెక్టులకు ఏమైనా చేయండి. ప్రకాశం జిల్లాలో 7 ప్రాజెక్టులు ఉన్నాయి. దాదాపుగా రూ.2,000కోట్లు ఖర్చు పెడితే, ప్రకాశం జిల్లా అంతా సశ్యశ్యామలం అయిపోతుంది. అలాగే, రూ.7,000కోట్లు ఖర్చు పెడితే, హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తి అవుతాయి. గాలేరు-నగరి మొదటి ఫేజ్ పూర్తి కావడానికి దాదాపు రూ.1,200 కోట్లు విడుదల చేస్తే కడప ప్రాంతం వరకు నీళ్ళు వస్తాయి. హంద్రీనీవా ద్వారా రాయచోటి, మదనపల్లి, కుప్పం ప్రాంతాల నుంచి మరొక ప్రక్క కాలువ పనులను త్రవ్వుకుంటూ వస్తున్నారు. మనకు ఉన్న నీటి వనరులు పోతిరెడ్డిపాడు నుంచే వస్తుంది. ఆ పోతిరెడ్డి పాడు నుంచి సెవరల్ డైవర్షన్స్ ఉన్నాయి. అవి అనంతపురం కావచ్చు, కర్నూలు, కడప, నెల్లూరు ప్రాంతాలకు కావచ్చు. పోతిరెడ్డిపాడులో

ప్యారలల్ లైన్లను తక్షణమే చేయడానికి ఎక్కడా, ఎటువంటి నిఘా లేకుండా పోయింది. మొన్న వచ్చిన వర్షాలకు అవన్నీ తెగిపోయాయి. వాటిని మంత్రిగారు కూడా పరిశీలించారు.

తమ ద్వారా గౌరవ మంత్రిగారికి విన్నవించేది ఏమిటంటే, వారికి నిపుణులందరితోను, మరియు అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయమని చెప్పండి. మాకు కొన్ని సందేహాలు కూడా ఉన్నాయి. ఆ సమావేశం ద్వారా మా సందేహం తీర్చుకుంటాము. దాదాపు 854 అడుగుల నీటి నిల్వలు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీళ్ళు వస్తాయి. తెలంగాణ ప్రభుత్వం వారు మహారాష్ట్ర ప్రభుత్వం వారితో ఒక ఒప్పందం కుదుర్చుకుని, వారి పనులు వారు జరుపుకుంటున్నారు. మనకు తెలంగాణ ప్రభుత్వంతో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. దాదాపు 808 అడుగులకే నీటిని వదిలేయడానికి నీరు ఇచ్చేవిధంగా జీవో తెచ్చుకుని నీటిని తెచ్చుకున్నారు. ఈ నీళ్ళు ఇంక ఎక్కడికి రాకుండా వారికే వెళ్ళిపోతాయి. కాబట్టి, మీరు పొరుగు రాష్ట్రాలతో మాట్లాడాలి. కృష్ణా జలాలను పరిరక్షించుకునేందుకు పొరుగు రాష్ట్రాలతో ప్రభుత్వం మాట్లాడడం ఎంతైనా అవసరం ఉంది. వాటికి అనుగుణంగా చట్టాలు ఉన్నా కూడా ఎగువన నీటిని బిగించేస్తే, ఆ నీరు ఇంక క్రిందకు ఎలా వస్తాయి సార్?

అధ్యక్షా, ఈ సందర్భంగా తమకు ఒక విషయాన్ని గుర్తు చేస్తున్నాను. మనకు కృష్ణా పుష్కరాలు వస్తున్నాయి. గతంలో ప్రభుత్వం కృష్ణా పుష్కరాలు జరుపుకుంటామని, ఒక టిఎంసి నీటిని విడుదల చేయమని కర్ణాటక ముఖ్యమంత్రి ధరమ్‌సింగ్ గారిని అడిగితే, ఒక టిఎంసి కాదు కదా, ఒక ఎంఎల్ నీటిని కూడా విడుదల చేయమని ఆయన చెప్పారు. ఆ తరువాత రెండు రోజుల తరువాత వర్షాలు పడి, మనకు నీరు పుష్కలంగా వచ్చింది కాబట్టి, మనం అప్పుడు కృష్ణా పుష్కరాలను జరుపుకున్నాము. మనం కృష్ణా పుష్కరాలు జరుపుకోవాలన్నా మనకు నీరు కావాలంటే, ఆల్మట్టి నుంచి నీరు రావాలి. ప్రస్తుతం మనం కృష్ణా పుష్కరాలు జరుపుకోవాలన్నా కృష్ణలో నీరు లేదు, ఇసుక కూడా అయిపోవచ్చింది. మనకు నీరు రావాలంటే, ఎగువ ప్రాంతం వారి దయాదాక్షిణ్యాలే కావాలి. కాబట్టి, ఈ పరిస్థితిలో మనకు పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంతో మాట్లాడుకోకపోతే, మనకు చాలా గడ్డు పరిస్థితులు ఉంటాయి. ఇంతకు మించి వేరే మార్గం లేదు. కేంద్ర ప్రభుత్వం దాదాపు ఇటు నాలుగు జిల్లాలకు అటు మూడు జిల్లాలకు దాదాపు రూ.300కోట్లు ఇచ్చింది. మన ప్రభుత్వం వారు చెట్టు-నీరు కార్యక్రమం క్రింద పెట్టామని అంటున్నారు. బ్యాక్ వాటర్ కోసం కేంద్రంతో మాట్లాడితే కొంత ప్రయోజనం ఉంటుంది. అవసరమైతే కేంద్రంతో మాట్లాడడానికి మమ్మల్ని కూడా ఉపయోగించుకోమని తమ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాము. సార్, నిన్న ఇక్కడ నుంచి సమావేశం అయిపోయిన తరువాత నేను ఢిల్లీకి సంప్రదింపులకోసమని వెళ్ళి వచ్చాను. అక్కడ నేను స్పెసిఫిక్‌గా మెన్షన్ చేసింది ఏమిటంటే – మాకు బ్యాక్‌వర్డ్ రీజియన్‌కు రూ.50 కోట్ల చొప్పున కాకుండా, ఆ ప్రాంతాలకు పూర్తిగా నీరు ఇచ్చేందుకు కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చెప్పవలసిందిగా వారిని కోరాను. మిత్రపక్షమైన భారతీయ జనతాపార్టీ కూడా నిధులు ఇవ్వడానికి అనుకూలంగా ఉంది. మన దగ్గర నిధులు లేవు, అక్కడ నుంచి నిధులు తెచ్చుకోవడానికి ప్రభుత్వానికి ఇబ్బంది ఏమిటి సార్? మనం ఆ వనరులను కూడా ఉపయోగించుకుందాం. రాయలసీమ ప్రాంతానికి నీటిని అందించాలంటే, మన దగ్గర నీరు లేదు, డబ్బులు లేవు. మన భారతదేశంలో లోయెస్ట్ రెయిన్ ఫాల్ అనంతపురంలో ఉంది. మన దగ్గర కూడా సమయానికి వర్షాలు పడవు. ఋతుపవనాలు కూడా పూర్తిగా ఫెయిల్ అయిపోయాయి. ఆ ప్రాంతాలకు కేవలం తుఫానుల వల్ల నీళ్ల

రావలసినవే సార్. కర్నూలు నుంచి నంద్యాల వరకు ఈ నీరు వస్తుంది కానీ, ఆ తరువాత నీరు టచ్ అవదు.

చివరగా తమ ద్వారా ఒక విషయం చెపుతాను సార్. పరమ భక్తుడైన రామదాసు గారు ర్యాడికల్ అయ్యారు. రాయలసీమ వాసులు ర్యాడికల్‌గా కాకుండా చూడవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉందని తమ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను సార్.

శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజక వర్గం) : అధ్యక్షా, కాంగ్రెస్ వారు చాలా కాలం ఆంధ్ర ప్రాంతాన్ని పరిపాలించారు. మా మిత్రులు రామదాసు గారి లాంటి వారు రాడికల్ అయిపోతారంటే ఎలా? ఆ కాలంలో ఎక్కువమంది ముఖ్యమంత్రులు ఉన్నారు. ఈరోజున రాయలసీమ గురించి రాజకీయాలు కాకుండా, వాస్తవమైన అంశాల గురించి మనం ప్రస్తావించడానికి ప్రయత్నించాలి. మొన్నటివరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. మొన్నే కదా తెలుగుదేశం ప్రభుత్వం వచ్చింది? ఈ జిల్లాలలో అనేకమైన సహాయాలు చేయడానికి కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రధానంగా రాష్ట్రప్రభుత్వం యొక్క వైఖరి decentralization of development అనే దానికి సంబంధించి చూసినట్లయితే, అందులో ఒకటి ఎకనామికల్ జోన్‌గా ఉన్నటువంటి విశాఖపట్టణం, రెండు-క్యాపిటల్‌గా ఉన్న ప్రాంతం అభివృద్ధి, మూడవది రాయలసీమ ప్రాంతం. ఈ మూడు అంశాలను సమానమైన దృష్టితో ప్రభుత్వం చూస్తుంది. మా ప్రభుత్వ విధానం ఇది అనేటటువంటి ఆలోచనను రాయలసీమ ప్రజలలో తప్పకుండా కలిగించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

మ.12.20

అది వాస్తవమా, అవాస్తవమా అనేది చూస్తే రాయలసీమ పెద్దలు, సీనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇక్కడ ఉన్నారు. ప్రభుత్వం చాలా సీరియస్‌గా డీసెంట్రలైజేషన్ ఆఫ్ డెవలప్‌మెంట్ క్రింద విశాఖపట్నం గురించి ఎలాగైతే ఆలోచిస్తున్నదో, అదేరీతిగా రాయలసీమ విషయంలోనూ ఆలోచించాల్సిన అవసరముందని అనుకుంటున్నాను. రాయలసీమలో సెయిల్ తదితర ఇండస్ట్రీస్ పెట్టడం ద్వారా ఇవాళ ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఇండస్ట్రీస్ పెట్టడానికి మంచి అవకాశమున్న ప్రాంతం రాయలసీమ మాత్రమే. అక్కడే ఎక్కువగా భూములున్నాయి. ఈ మధ్య ఎయిమ్స్ హాస్పిటల్ పెట్టారు. ఎయిమ్స్ హాస్పిటల్ పెట్టి భూమినేమో రాయలసీమ జిల్లాల్లో ఇచ్చారు. దాంతో వాళ్లకి సహజంగానే వ్యతిరేకత ఉంటుంది. ఆ దృష్ట్యా ఇండస్ట్రీస్ అనేవి రాయలసీమలోనే పెడతామనే ఆలోచన ప్రభుత్వం చేస్తే అక్కడి వారికి కొంత ఉపశమనం కలగడానికి అవకాశం ఉంటుంది.

ఆ రకంగా ఇప్పుడు సెయిల్ ఉంది. గతంలో ఒక పారిశ్రామికవేత్తకు ఇచ్చిన భూములన్నీ కూడా రద్దు చేసి అక్కడున్న మైన్స్‌ని విశాఖపట్నానికి గాని అలొకేట్ చేసినట్లయితే తప్పకుండా అక్కడ సెయిల్ ఇండస్ట్రీ రావడానికి అవకాశం ఉంటుంది. ఆ రకంగా ఇండస్ట్రీస్ పరంగా ఉపయోగకరమైన ఖనిజాలున్న ప్రాంతం రాయలసీమ. సాగునీరు, త్రాగునీరు లేక అక్కడున్నటువంటి ఇతర సహజ వనరుల ఆధారితమైన పరిశ్రమలు పెట్టే విషయంలో మాకు దృష్టి ఉంది, ఈ ఐదారు ఇండస్ట్రీలను అక్కడ పెడతాం, ఇన్వెస్ట్‌మెంట్ జోన్స్ వచ్చినప్పుడు ఏవిధమైన

ఇన్వెస్ట్‌మెంట్ ఆ ప్రాంతంలో వచ్చిందనే విషయాలను ప్రభుత్వం అక్కడి ప్రజలకు కొంత తేటతెల్లం చేయవలసిన అవసరముంది.

అలాగే, మనం గమనిస్తే నిన్న వ్యవసాయ శాఖా మంత్రి గారు అనేకమైన ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని అన్నారు. దీన్ని కన్‌స్ట్రక్టివ్ సజెషన్‌గా మనం ఆలోచించినట్లయితే సుమారు రూ.3000 కోట్లు నీటి గుంటలు, రెయిన్‌గన్లకు ఖర్చుపెడుతున్నాము. ఎన్‌ఆర్‌ఇజిఎస్ క్రింద వచ్చే నిధుల్ని మనకు అనుగుణంగా వినియోగించుకోండి. ఇప్పటివరకు చెట్టు-నీరు వంటి కార్యక్రమాలకు, సిమెంటు రోడ్లను వేయడానికి మనం ఆ నిధులను వినియోగిస్తున్నాము. అయితే, ఆ రూ.3000 కోట్లు ఈ కుంటలకి ఖర్చు పెడుతుంటే ఎవరు, ఏమిటనేది క్రింది స్థాయి వరకు ఎగ్జామిన్ చేస్తే ఈ డబ్బంతా నిజంగా అలా ఖర్చవుతుందా? ఇలాంటి ధనాన్ని ఎందుకు మనం రాయలసీమ గురించి వినియోగించకూడదు? ఎందుకు ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయకూడదు? ఇవి కూడా నీటి కోసమే, అవి కూడా నీటి కోసమే. కాబట్టి, ఈ రూ.3,000 కోట్లలో ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు పెట్టేలా ఎందుకు మనం ఆలోచన చేయకూడదని మనవి చేస్తున్నాను. ఎక్కువగా అనంతపురం జిల్లాల నుండి రైతులు వలసలు వెళ్లే పరిస్థితిని మనం గమనిస్తున్నాము. గతంలో చిత్తూరు జిల్లాలో ఒక సర్వే జరిగింది. రైతుల ఆత్మహత్యలు చిత్తూరు జిల్లాలో లేవు. కారణమేమంటే ఆ ప్రాంతమంతా కూడా ఇంట్లో ఆవులు పెంచుతారు. ఆ విధంగా అనంతపురం జిల్లాకు ఏమన్నా ఆల్టర్నేటివ్ ఉందా? బయటకు వెళ్లకుండా ఏదన్నా పరిష్కారం ఉందా అన్నది పెద్దలు సలహా ఇచ్చినట్లయితే, ఆల్టర్నేటివ్ ఏదైనా క్రియేట్ అవ్వడానికి అవకాశం ఉంటుందని అనుకుంటున్నాను.

అధ్యక్షా, మేము ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు ఎక్కువగా సిద్ధేశ్వరం ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నారు. అసలు ఈ సిద్ధేశ్వరం అంటే ఏమిటి? గ్రావిటీ ద్వారా నీరు వచ్చేది సిద్ధేశ్వరం ప్రాజెక్టు. ఈ మధ్యకాలంలో భారతీయ జనతా పార్టీ కూడా పాదయాత్ర చేసిన సందర్భంలో ప్రభుత్వం గానీ అనుమతిస్తే, మేమే డబ్బులు వేసుకుని సిద్ధేశ్వరం ప్రాజెక్టుని కట్టుకుంటామని రైతులు అన్నారు. ఇందులో రియాలిటీ ఉందా, లేదా? దీన్ని ప్రభుత్వం వెంటనే ఎగ్జామిన్ చేయవలసిన అవసరముంది. అలాగే, నికర జలాలు ఇవ్వాలి. అది ఏవిధంగా సాధ్యమౌతుందన్నది ప్రభుత్వం ఆలోచించాలని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్: డి.సి.గోవింద రెడ్డి గారూ...

శ్రీ పయ్యావుల కేశవ్ (స్థానిక సంస్థలు-అనంతపూర్): అధ్యక్షా..

మిస్టర్ ఛైర్మన్: రూల్-311 క్రింద సబ్జెక్టు మెన్షన్ చేశారు. మినిస్టర్ గారు స్టేట్‌మెంట్ ఇవ్వాలి. I will call the names who have given their names under Rule-311.

శ్రీమతి పమిడి శమంతకమణి: కేశవ్ గారికి మాట్లాడేందుకు అవకాశమివ్వండి సార్. ఆయన రాయలసీమ వాసి. (మైకు లేదు)

శ్రీ పి.కేశవ్: అధ్యక్షా, మీకు ధన్యవాదాలు చెబుతూ నా ప్రసంగాన్ని మొదలుపెడదామని అనుకున్నాను. ఇన్ని రోజుల తరువాత ఈ సబ్జెక్టుని చర్చకు తీసుకున్నారు. కావాలంటే మంత్రి గారు వెయిట్ చేస్తారు. (మైకు లేదు)

శ్రీ దేవసాని చినగోవింద రెడ్డి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, నాకీ అవకాశమిచ్చినందుకు మీకు తొలుత ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఇప్పుడు ఈ రాయలసీమ సమగ్రాభివృద్ధి విషయంలో అన్ని రంగాల్లో ఎలాంటి అభివృద్ధి ఉందనే విషయానికి వస్తే..

MR.CHAIRMAN: Pending Projects.. that too Irrigation.

SRI.DEVASANI CHINA GOVINDA REDDY: Yes Sir. ముఖ్యంగా పెండింగ్ ప్రాజెక్టుల గురించి ఈ రోజున మీరు చర్చకు అనుమతించారు. ఒకసారి మనం సోషియో ఎకనామిక్ సర్వే 2015-2016 చూస్తే రాయలసీమలో ఆర్థికంగా, వ్యవసాయికంగా, పారిశ్రామికంగా, సేవల రంగంలోనూ జిల్లాల వారీగా చాలా స్టాటిస్టిక్స్ ఇచ్చారు. ఈ అన్ని జిల్లాలూ చాలా వెనుకబడిన పరిస్థితి ఉంది. శ్రీకాకుళం, విజయనగరం తరువాత ఈ నాలుగు రాయలసీమ జిల్లాలు చాలా వెనుకబడినటువంటి పరిస్థితి ఉంది. పరిశ్రమల రంగంలో కడప జిల్లా మరింత అధ్వాన్నమైన పరిస్థితిలో ఉంది. దివంగతనేత డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారి హయాంలో విశాఖపట్నం తరువాత చాలా వరకు ఆనాడు అభివృద్ధికి నోచుకున్నటువంటి కడప జిల్లా ఈనాడు ప్రతి రంగంలో కూడా చాలా వెనుకబడి ఉంది. సోషియో ఎకనామిక్ సర్వేలో ఈ ఫిగర్స్ అన్నీ కూడా చాలా ప్రస్ఫుటంగా తెలియజేస్తున్నారు. ఒక్కసారి ఇండస్ట్రియల్ రంగంలో కేవలం 43 మేజర్ యూనిట్లు మాత్రమే కడప జిల్లాలో ఉన్నట్లుగా, అనంతపురం, కర్నూలు జిల్లాలు చాలా వెనుకబడినటువంటి పరిస్థితిని చూస్తున్నాము.

అలాగే, వ్యవసాయ రంగానికి వస్తే కొద్దోగొప్పో చిత్తూరు జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి పథంలో ఉంది కాబట్టి కొంచెమైనా ఆ జిల్లా అభివృద్ధి సాధించింది. కానీ, మిగతా మూడు జిల్లాలు చాలా వెనుకబడినట్లుగా ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి అత్యంత కీలకమైనటువంటి నీటి పారుదల రంగం పరిస్థితి ఎలా ఉందంటే రాయలసీమకు త్రాగునీరు, సాగునీరు కావాలంటే పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ అతి ముఖ్యమైనది. అక్కడి నుండే తెలుగు గంగకు, జిఎన్ఎస్ఎస్‌కు, హెచ్ఎన్ఎస్ఎస్‌కు అధిక భాగం కృష్ణా నీరు రావాల్సిన అవసరముంది. ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాంతాభివృద్ధికి, అక్కడుండే ఇరిగేషన్ ప్రాజెక్టులకు, పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తామని ప్రభుత్వం కొన్ని లెక్కలు చెబుతోంది.

అధ్యక్షా, రాయలసీమలో ముఖ్యంగా ఇరిగేషన్ మంత్రి గారు కూడా whether there is any change in his attitude or stand అనేది కూడా నేను మీ ద్వారా వారి దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాను. గతంలో డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం 44,000 క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి తీసుకుపోవాలి, ఆ విధంగా తీసుకుపోతేనే 24 గంటల్లో 4 టిఎంసీల నీళ్ల చొప్పున 60 రోజుల పాటు నీళ్లు గనుక ఉంటే దాంట్లో కనీసం 200 టిఎంసిల నీటిని మనం రాయలసీమకు తీసుకుపోగలిగితే అక్కడున్నటువంటి ప్రజలకు సాగునీటి, త్రాగునీటి ఇబ్బందులు ఉండవని భావించారు. అయితే, ఈనాటి ఇరిగేషన్ మంత్రి గారే ఆనాటి ఆ ప్రాజెక్టును అడ్డుకున్నటువంటి చరిత్ర కూడా ఉంది. ఆ పరిస్థితి నుండి ఇప్పుడు వారేమైనా స్టాండ్ మార్చుకున్నారా? రాయలసీమకు నిధులు ఇవ్వడంలో గాని, ప్రాజెక్టుని పూర్తి

చేయడంలో గానీ ఈ ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రి గారు ఎంత వరకు చిత్తశుద్ధితో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారనేది వారు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మ.12.30

ముఖ్యంగా తెలుగు గంగ ప్రాజెక్టు విషయమై 2006వ సంవత్సరంలో ఆనాటి కాంగ్రెస్ అధినేత్రి శ్రీమతి సోనియా గాంధీ గారు ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారు ప్రారంభం చేసిన తరువాత బ్రహ్మసాగర్‌కు కూడా 13 టిఎమ్‌సిల నీటిని తీసుకువచ్చారు. అప్పటినుండి దాదాపు 5,6 సంవత్సరాల పాటు నీళ్లు వచ్చాయి. ముఖ్యంగా బద్వేలు నియోజకవర్గంలో 1,25,000 ఎకరాలకు నీళ్లిచ్చారు. తెలుగు గంగకు రెండవ ప్రాజెక్టు బ్రహ్మసాగర్ ప్రాజెక్టు. ఎందుకంటే, వెలుగోడు తరువాత తెలుగుగంగ ప్రాజెక్టు వస్తుంది. వెలుగోడుకు కొద్దోగొప్పో నీళ్లు వస్తున్నాయి కానీ, బ్రహ్మసాగర్ ప్రాజెక్టుకు గత రెండు సంవత్సరాల నుండి ఇప్పటివరకూ ఒక్క చుక్క కూడా నీళ్లు రాలేదు. సాగు నీటికి, త్రాగు నీటికి బద్వేలు నియోజకవర్గంలో గానీ, కడప జిల్లాలో గానీ దీనాతిదీనమైన పరిస్థితులు ఉన్నాయి. ఈనాడు అదృష్టం కొద్దీ, నార్త్ ఈస్ట్ మాన్‌సూన్స్ వల్ల చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు పడ్డాయి కాబట్టి ఈ కాస్తైనా త్రాగునీళ్లు ఉన్నాయి. లేకపోతే ఈ పాటికే అత్యంత దయనీయంగా రాయలసీమ పరిస్థితి ఉండేది. బ్రహ్మసాగర్‌కు నీరు వచ్చేందుకు అక్కడ కొన్ని కొండ చరియలు విరిగిపోయి నీళ్లు వచ్చేందుకు ఆస్కారం లేకపోతే కోటి రూపాయల నిధులిచ్చి ఆ కాలువను మరమ్మత్తు చేయమని చెప్పి సంవత్సరంన్నర అయింది కానీ, ఇప్పటికీ ఆ కాలువ మరమ్మత్తులకు నోచుకోలేదు. వచ్చే సంవత్సరమైనా ఆ కాలువకు మరమ్మత్తులు చేసి బ్రహ్మసాగర్‌కు నీళ్లిచ్చే పరిస్థితి ఏమైనా ఉందా అని మంత్రిగారిని అడుగుతున్నాను. మంత్రిగారు ఒకసారి కడప జిల్లాకు వచ్చినప్పుడు వారు ఆ కాలువ రిపేర్ చేయడానికి అధికారులను సన్నద్ధం చేశారు కానీ, ప్రభుత్వ యంత్రాంగం అందులో చిత్తశుద్ధి చూపిన దాఖలాలు లేవు.

అధ్యక్షా, గతంలో పట్టిసీమ ప్రాజెక్టు కట్టేటప్పుడు అనేక సందర్భాలలో రాయలసీమకు నీళ్లొద్దా, ఎందుకు సహకరించరు అని ప్రశ్నించిన ప్రభుత్వం గత సంవత్సరం ఎన్ని నీళ్లిచ్చారని నేను అడుగుతున్నాను. పోయిన సంవత్సరం 2015లో ఒక్క చుక్క నీళ్లివ్వలేదు. 2014లో వచ్చినటువంటి నీళ్లను అటు తెలంగాణా ప్రభుత్వం, ఇటు ఆంధ్ర ప్రభుత్వం ఆ నీళ్లను ఎంత తొందరగా పంపింగ్ చేసి సాగర్‌లో పడేసి కిందకు తీసుకుపోయారో, శ్రీశైలంలో ఎన్ని రోజులు నిల్వ ఉంచారో 2014 రికార్డులు ఒకసారి చూస్తే అర్థమవుతుంది. 60 రోజుల్లో శ్రీశైలం రిజర్వాయర్‌లో ఉన్న నీళ్లను కిందకి వదిలేసిన పరిస్థితి మనకు తెలుస్తుంది. ఇప్పటికైనా రాయలసీమకు నీళ్లు ఇవ్వాలంటే శ్రీశైలం రిజర్వాయర్ లెవల్‌ను ఏ విధంగా పెంచుతారు, రాయలసీమ విషయంలో ఎంత చిత్తశుద్ధితో ఉంటారనేది అతి ముఖ్యమైన విషయం. తెలంగాణా కూడా అదే నీటిని పంచుకుంటుంది. మరి తెలంగాణా ప్రభుత్వం పెద్ద ఎత్తున రూ.26,000 కోట్లు ప్రాజెక్టుల కోసం ఈ రోజున నిధులు ఖర్చు పెడుతున్న విషయం మనకు తెలుసు. కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం నీటి ప్రాజెక్టులకు తక్కువ ప్రాధాన్యతనిస్తున్నది. ఇచ్చినటువంటి రెండు, మూడు ప్రాజెక్టులైనా ఖచ్చితంగా కడతారా అని నేను మంత్రిగారిని తమ ద్వారా అడుగుతున్నాను అధ్యక్షా.

ఈ ప్రభుత్వం 2016వ సంవత్సరం నాటికి గాలేరు నగరి, హంద్రీనీవా నీటి వాడకం గురించి చెబుతున్నది. అయితే, ఏ ప్రాజెక్టులో ఎంత అవినీతి జరిగిందో నేను మాట్లాడడం లేదు కానీ, ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు కనీసం నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమ ప్రజలు చాలా సంతోషపడతారు సార్. గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ ప్రాజెక్టులకు ఏ విధంగా నీళ్లు తీసుకువస్తారు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులరేటరీని ఏ విధంగా మెయింటైన్ చేస్తారు, ఎన్ని టిఎమ్‌సిల నీటిని రాయలసీమకు ఇవ్వగలుగుతారు, వారి దాహార్తికి, సాగునీటికి ఏ విధంగా నీటిని ఇవ్వగలుగుతారని నేను తమద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. చాలా విషయాలు చెబుతున్నాము గానీ, ప్రజలు నమ్మడం లేదు. పోలవరం ప్రాజెక్టుని 2018వ సంవత్సరం నాటికి పూర్తి చేస్తామని అంటున్నారు. కానీ, ఇక్కడున్న చాలామంది సభ్యులకే నమ్మకం లేదు. శ్రీశైలం నుండి మిగులు జలాలను రాయలసీమకు ఇవ్వగలుగుతామా, ఇది ఒక పెద్ద అగ్ని పరీక్ష. జలయజ్ఞంలో ఏ విధంగా రాజశేఖర రెడ్డిగారు 86 ప్రాజెక్టులను తీసుకుని ఆంధ్రరాష్ట్రాన్ని ఏ విధంగా నీటిపారుదల రంగంలో అభివృద్ధి చేశారో, మీరు అదే చిత్తశుద్ధితో ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తే మీకు కూడా ఎంతైనా మంచి పేరు వస్తుంది. ప్రయత్నం గనక చేయకపోతే రాయలసీమ ప్రజలు అనేక పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. కాబట్టి, రాయలసీమ ప్రజలను కూడా సమదృష్టితో చూసి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని తెలియచేసుకుంటున్నాను.

పారిశ్రామిక రంగంలో రాయలసీమ ముఖ్యంగా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ముఖ్యంగా చిత్తూరు జిల్లా, శ్రీసిటీ వంటి ప్రాంతాలు మద్రాసుకు దగ్గరగా ఉండి కొంత అభివృద్ధి చెందాయి తప్ప ఈ మూడు జిల్లాలు వెనకబడి ఉన్నాయి. SAIL , స్టీల్‌ప్లాంట్‌కు ప్రపోజల్ పెట్టారు. ఎందుకంటే ఐరన్ ఓర్ చాలా దగ్గరగా ఉంది. కర్ణాటక రాష్ట్రంలో బళ్లారి జిల్లాలో కావలసినంత ఐరన్ ఓర్ ఉంది. అక్కడ ప్లాంట్ డెవలప్ చేయడానికి మంచి అవకాశం ఉంది కాబట్టి దాని విషయంలో కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో చేయగలిగితే చాలా మంచిది. పెద్దలు శ్రీ వీరాజు గారు చెప్పినట్లుగా రాయలసీమకు కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఇండస్ట్రీలకు కావలసినంత స్థలం ఉంది. కాబట్టి, ఆ ప్రాంతం పరిశ్రమలకు చాలా సుగమమైన ప్రాంతం కాబట్టి పారిశ్రామిక రంగంలో కానీ, లైవ్‌స్టాక్ రంగంలో కానీ, మిగతా రంగాలలో దేనికైతే ఆ ప్రాంతం అనుకూలంగా ఉందో గమనించి ఆ విధంగా అభివృద్ధి చేయగలిగితే ఎంతైనా మేలు చేసినవారవుతారని మనవిచేస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఛైర్మన్ గారికి ధన్యవాదాలు తెలియచేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ పయ్యావుల కేశవ్ : ఈ డిబేట్‌ను సభలోకి తీసుకువచ్చినందుకు, నాకు అవకాశం ఇచ్చినందుకు ముందుగా ఛైర్మన్ గారికి ధన్యవాదాలు. రాయలసీమ ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న చంద్రబాబునాయుడు గారికి, ఇరిగేషన్ శాఖామాత్యులకు ధన్యవాదాలు. శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు గారు ఇరిగేషన్ మంత్రి అయిన రోజున అందరిలాగానే నాకు కూడా అనుమానం వచ్చింది. పొద్దున లేస్తూనే ఈయన కృష్ణా, గుంటూరు జిల్లాల గురించి మాట్లాడతారు. నాగార్జున సాగర్, వాళ్ల ఆయకట్టు గురించి మాట్లాడతారు, అసలు రాయలసీమ ప్రాజెక్టులను ఈయన ఏం చేయబోతున్నారు, చంద్రబాబునాయుడు గారేమో ఈయన చేతిలో ఇరిగేషన్‌ను పెట్టారు అన్న అనుమానం నాకు ప్రగాఢంగా ఉండేది. మా రాయలసీమ ప్రాజెక్టులను ఈయన చేతిలో పెట్టారు, మంత్రిగారేమో వారి ప్రాంతం తప్ప మా ప్రాంతం గురించి కన్నెత్తి

చూడరు అని అనుకున్నాము. కానీ, ఈ రోజున మా ఇరిగేషన్ పనులకు సంబంధించినంతవరకూ ఆయన పిలిస్తే పలుకుతారు, call చేస్తే కదిలివస్తారు. గత పది సంవత్సరాలల్లో ఏ ఇరిగేషన్ మంత్రి మా రాయలసీమ వైపు రాలేదు. ఇంతకుముందు శ్రీ బి. చంగల్‌రాయుడు గారు చెప్పినట్లు బాటిల్ నెక్స్ ఉన్నాయి, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి ఎంత చిన్న పనులంటే, ఈ సంవత్సరంన్నర కాలంలో 50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించారు. గతంలో ఉన్న వాళ్లు చాలా పెద్ద పెద్ద పనులు కంప్లీట్ చేసి వెళ్లిపోయారు. చిన్న పనులు మిగిలితే వాటిని కూడా మొదటి దశలో ఈ మట్టిని తీసేశారు. రెండవ దశలో మరో 40 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసివేశారు. నీరు అంటే ఈనాడు ఒక నమ్మకం వచ్చింది. గత సంవత్సరం కష్టకాలంలో ఈ ప్రభుత్వం మాకు 15 టిఎంసిలు ఇచ్చింది. ఈ సంవత్సరం రాష్ట్రం మొత్తం మీద నీళ్లివ్వకపోయినా అనంతపురం జిల్లాకు 8 టిఎంసిల నీళ్లు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారిది. ఈనాడు మాకు వచ్చిన నీళ్లకన్నా నమ్మకం ఎక్కువగా ఉన్నది. యస్, ఈ ప్రభుత్వం మాకు చేస్తుంది అనే నమ్మకం ప్రజలలో వచ్చింది. అది చాలు. నెలా, రెండు నెలలు, లేదా ఒక సీజన్ లేటయినా ఈ ప్రభుత్వం మీద నమ్మకం వచ్చేలా ప్రవర్తించారు మా మంత్రిగారు. అందుకు నేను అభినందిస్తున్నాను. ఇందాక మా మిత్రులు మాట్లాడుతూ, నీరే బంగారం, కనకవర్షం కురుస్తుంది అన్నారు. పాత ప్రభుత్వ ఆలోచనా విధానాన్నే ఆయన కొనసాగిస్తున్నారు. అందుకు నేను తప్పు పట్టడం లేదు. నీరు అంటే బంగారమే కనిపిస్తున్నది. కానీ, ఈ ప్రభుత్వానికి water is life. జలమే జీవం, జీవనం అని ఈ ప్రభుత్వం నమ్ముతోంది. జలమే కనకం, కనకవర్షం అని గత ప్రభుత్వం నమ్మింది. దానినే ఆయన మళ్లీ స్పష్టం చేశారు. He has reassured. గత ప్రభుత్వ ఫిలాసఫీని ఆయన రీ అస్యూర్ చేశారు.

మ.12.40

డెఫినెట్‌గా ఆనాడు ఆ ప్రభుత్వం మీద వారికున్నటువంటి ఆవేదన కావచ్చు. ఆ పాలకుల మీద ఆవేదనను ఈ విధంగా re-confirm చేసి వాస్తవాలను చెప్పినందుకు ఈసభలో వారిని నేను అభినందిస్తున్నాను.

అధ్యక్షా, ఇరిగేషన్‌కు సంబంధించి నిజంగా ఈ ప్రభుత్వం అద్భుతాలు చేసిందని నేను చెప్పాలి. కొత్త ప్రభుత్వం, కష్టాల్లో ఉన్నటువంటి ప్రభుత్వం రూ. 4,700 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే, రూ. 7,800 కోట్లు నేడు ప్రభుత్వం ఖర్చుచేసింది. దానికి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి దగ్గర నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే జూనియర్ ఇంజనీర్ వరకూ కూడా ఈ సభ అభినందించాలి. ఎందుకంటే, ఆ డెడికేషన్ మరియు మోటివేషన్ అనేది 18 నెలల తర్వాత డిపార్టుమెంటుకు వచ్చింది. గతంలో ఎవరో ఒక కాంట్రాక్టరు ఇ.పి.సి. విధానం పెట్టాడు, ఆయన పనిచేస్తాడు, సర్వేను మరొక కన్సల్టెంట్ చూస్తాడు, మేము చూస్తూ ఉంటాము, సంతకాలు పెడతామనే attitude నుంచి సంబంధిత ప్రతి అధికారి మాత్రమే కాదు, కాలువల వద్దకు ముఖ్యమంత్రి గారు వెళ్లారు, మంత్రి గారు వెళ్లారు, ప్రతి ఇంజనీర్ ఇన్ చీఫ్, డి.ఈ.లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కాలువల వద్ద ఉంటున్నారు కాబట్టి నేటికి ఈ ప్రభుత్వం వల్ల ఒక కదలిక వచ్చింది. బేసిక్‌గా ప్రభుత్వ యంత్రాంగంలో కూడా ఒక కమిట్‌మెంట్ వచ్చింది. నిన్ననే రాత్రి 2 గంటల వరకూ కూడా ఇరిగేషన్ శాఖాధికారులు కూర్చుని మనకోసం ఒక నోట్‌ను సిద్ధంచేయడం జరిగింది. అంటే, ప్రభుత్వ ఆలోచన విధానాన్ని ఇరిగేషన్ శాఖ reflect చేస్తోంది.

అధ్యక్షా, రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇది ఎవరి పాపం? గత 60 సంవత్సరాల పాపాన్ని 6 నెలల బిడ్డ ఏవిధంగా తీర్చగలుగుతుంది? అయినా సరే, నేటి ప్రభుత్వం ఒక నమ్మకాన్నిచ్చిందని నేను చెబుతున్నాను. నీళ్లు ఇచ్చింది అనే కంటే కూడా నీళ్లు కూడా ఇచ్చింది. ఎందుకంటే, నీళ్లతోపాటు అంతకు మించిన నమ్మకాన్ని ఈ ప్రభుత్వం ఇచ్చిందని నేను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను.

సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు మాట్లాడుతూ, "decentralized development" గురించి ఏదైనా ఆలోచించగలరా అని ఒక చక్కని మాటను చెప్పారు. నిజంగా అది ఒక చక్కని ఆలోచన. సభ్యులు శ్రీ గేయానంద్ గారు మాట్లాడుతూ, రాయలసీమకు ఏదైనా మాస్టర్‌ప్లాన్ చేయగలరా అని అడిగారు. నిజంగా అన్ని వర్గాల నుంచి రాయలసీమకు వస్తోన్నటువంటి సపోర్ట్ ఇట్లాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. ఈ ప్రభుత్వానికి రాయలసీమ ప్రాంతం పట్ల ఉన్నటువంటి ఆలోచనకు మీరంతా కూడా మీ పార్టీలను ఒప్పించాలి. నేడు ఒక్క పోలవరం ప్రాజెక్టు మాత్రమే Central Project కాదు. నేడు జైసల్మేర్ తర్వాత అనంతపురం జిల్లా భారతదేశంలోనే desertification అవుతున్నటువంటి రెండవ జిల్లా. భారతదేశంలో ఉన్న అతి పెద్ద జిల్లాల్లో 9వ పెద్ద జిల్లా అనంతపురం జిల్లా. కాబట్టి, ఆ ప్రాంతంలో చాలా సమస్యలున్నాయి. ఇందిరా కెనాల్‌ను ఏవిధంగా అయితే, ఎడారిలో తీసుకువెళ్లాలో హెచ్.ఎన్.ఎస్.ఎస్. ను widen చేస్తే, కర్నూలు జిల్లాకు ఇంకా ఎక్కువ నీరు వచ్చే అవకాశముంది. దానిని పరిశీలించాలని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఈ ప్రభుత్వం అద్భుతంగా చేసినా ఇంతటితో సంతృప్తి చెందవద్దండి. ఇంకా ఎక్కువగా చేసే విధంగా ఆలోచించాలని ప్రతి ఒక్కరినీ తమరిద్వారా నేను కోరుతున్నాను. హంద్రీనీవా ప్రాజెక్టును కనీసం కర్నూలు జిల్లావరకూ ఆధునీకరణ చేస్తే, వారి నీటి అవసరాలకోసం, మనం ఇదివరకే స్ట్రక్చర్లను నిర్మించాము, ఎక్కువ స్ట్రక్చర్లలో మార్పులు చేయలేము కాబట్టి కర్నూలు జిల్లా ప్రారంభంలో ఉన్న ఆ 30, 40 కిలోమీటర్లు widen చేసి ఆ జిల్లా అవసరాలకు నీటిని అందించగలిగితే క్రింద ప్రాంతానికి నీరు సులభంగా వచ్చే అవకాశముంటుందని ఈ సందర్భంగా మంత్రిగారిని పరిశీలించమని నేను కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ ప్రభుత్వానికి కొన్ని నిర్మాణాత్మకమైన సలహాలు చేయదలచుకున్నాను. ఈ ప్రభుత్వం నిజంగా పనిచేసేది ఎక్కువ, చెప్పుకునేది తక్కువ. నిజంగా వారు చెప్పుకోలేకపోతున్నారు. చంద్రబాబునాయుడు గారిని చూస్తే, ఆయన ఎక్కువ పనిచేస్తూ, తక్కువగా చెప్పుకుంటున్నారని నేను అపుడపుడు అనుకుంటూ ఉంటాను. గత 20 సంవత్సరాలుగా ఇక్కడా కాంగ్రెస్ ప్రభుత్వం, కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఢిల్లీలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రోజుల్లో కూడా ఇక్కడ రాజశేఖరరెడ్డి గారు ఉన్నప్పుడు కూడా కర్నాటక ప్రభుత్వాన్ని తుంగభద్ర హైలెవల్ కెనాల్ ఆధునికీకరణను సాధించే ప్రయత్నం చేయడం జరిగింది. అంటే, నేను 1994వ సంవత్సరంలో శాసనసభలో అడుగుపెట్టిన తరువాత నేటివరకూ గత 20 సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు చేసిన ప్రయత్నాలు నిజంగా సఫలం కాలేదు. నేను వారిమీద ఆరోపణలు చేయడం లేదు. కర్నాటక ప్రభుత్వం చాలా మొండిగా వ్యవహరించింది. కానీ, మన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారు సంవత్సరం క్రితం కర్నాటక ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత ఆయన ఆధునీకీకరణకు ఒప్పుకున్నారు. దానికి సంబంధించిన Detailed Project Reports కూడా తయారయ్యాయి. కొన్ని చిన్నచిన్న మార్పులతో కర్నాటక ప్రభుత్వం కూడా

అనుమతించడం జరిగింది. నేడు సి.డబ్ల్యు.సి.లో అది పెండింగ్‌లో ఉంది. దీనిపై మిత్రులతో మాట్లాడితే, అవునా, ఇంత అడ్వాన్సుగా వెళ్లామా అని ఇంతకుముందు డా.గేయానంద్ గారు కూడా అన్నారు. అంటే, ఈ ప్రభుత్వం చేసిన పనులు ఎక్కువగా ఉన్నా, చెప్పలేకపోతోందని నేను చెబుతున్నాను. నేడు ఆధునికీకరణ మీద, అటు కర్నాటకలో జరిగిన ఆధునికీకరణపై మంత్రిగారు దృష్టిపెట్టాలని కోరుతున్నాను. అనంతపురంలో జరుగుతున్న ఆధునికీకరణ విషయంలో ఏ ప్యాకేజిలో అయితే పనులు జరగడంలేదో నిర్దాక్షిణ్యంగా రద్దుచేయండి. కొత్తగా టెండర్లు పిలవండి, పరిగెత్తించి పనులు చేయించండి. మూడు సంవత్సరాలు కాకుండా, మనకు సంబంధించినంత వరకూ రెండు సంవత్సరాలే టార్గెట్‌గా పెట్టుకోండి. సంవత్సరం లేదా రెండు సంవత్సరాలలోనే అనంతపురం ప్రాజెక్టులను పూర్తిచేస్తారనే నమ్మకాన్ని ఈసభ ద్వారా కలిగించాలని చెప్పి నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఒక్క అనంతపురంలోనే జి.బి.సి. ఆధునికీకరణ పనులకోసం రూ. 400 కోట్లు ఇప్పటికే ఈ ప్రభుత్వం మంజూరుచేసింది. ఆ పనులను కూడా వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోమంటున్నాము. హంద్రీనీవా ప్రాజెక్టులో ప్యాకేజి నెం. 36 గత పాలకుల పెద్ద పాపం. 80 వేల ఎకరాలకు ఆయకట్టు ఇచ్చేటటువంటి ఈ ప్యాకేజి పూర్తిగా లీగల్ లిటిగేషన్‌లో ఆగిపోయింది. ఈమధ్యనే చర్యలు తీసుకుని మొన్ననే రద్దుచేశారు. దయచేసి ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్లయితే 80 వేల ఎకరాలకు ఆయకట్టు ఒక సింగిల్ ప్యాకేజితో వస్తుంది. ఆ పనులకోసం వెంటనే టెండర్లను పిలిచి అనంతపురంలో ఆయకట్టుకు నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరులో బాగా లీకేజిలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ రిజర్వాయర్‌కు grouting works జరగాలి. పెద్దఎత్తున పంచవర్ష ప్రణాళిక మాదిరిగా కాకుండా ప్రపంచంలో ఉన్న అద్భుతమైన modern technology తో చేయాలి. మాజిల్లాకు సంబంధించినంత వరకూ ప్రతి నీటిచుక్క కూడా ఎంతో విలువైనది కాబట్టి దానిని grouting చేసి కాపాడడానికి best technology ని ఉపయోగించి చేయాలని నేను ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

చివరగా, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్నటువంటి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఏదైతే ఉన్నదో దీనివల్ల రాయలసీమ ప్రాంతంలో ఏరకమైనటువంటి ప్రభావం పడుతుందనేది ఖచ్చితంగా ఈ ప్రభుత్వం ఒక కంట గమనిస్తూనే ఉండాలి, అధ్యయనాన్ని చేపట్టాలని కూడా నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అనుమతులు ఉన్నాయి, వాటిమీద పోరు చేయడమా లేదా వాటిని ఏమి చేయాలనేది అదొక అంశం, what is the impact అనేది కూడా మనం ఇప్పటినుంచి స్టడీ చేయకపోతే భవిష్యత్ తరాలు ఇబ్బంది పడతాయి. గతంలో దీనికోసం ఒక Inter State wing అనేది ఉండేది. ఇప్పుడు కూడా అది ఉందని నేను అనుకుంటున్నాను. పక్కరాష్ట్రాలు ఏమి చేస్తున్నాయని ఎప్పుడూ వాటిని గమనిస్తూ, రికార్డును మెయిన్‌టెయిన్ చేస్తూ Inter State Wing లో ఒక Chief Engineer గతంలో పనిచేసేవారు. అటువంటి నిఘా వ్యవస్థను, Inter State Wingను ప్రభుత్వం ఏర్పాటుచేసి, అటు కర్నాటక రాష్ట్రంతో, ఇటు తెలంగాణ రాష్ట్రంతో పొరుగు రాష్ట్రాల పట్ల ఒక కన్నువేసి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని నేను కోరుతున్నాను. ఈ

ప్రభుత్వాన్ని మరొకసారి అభినందిస్తూ, మరొకసారి నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్పించే విధంగా ఈ సభ ద్వారా స్పష్టమైన హామీ ఇవ్వాలని నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గుండుమల తిప్పేస్వామి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, అనంతపురం జిల్లాలో హంద్రీనీవా పథకం జీవనాధారం. దీనికోసం మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారు, సాగునీరు ఆయకట్టు అభివృద్ధి మరియు జల వనరుల నిర్వహణ శాఖ మంత్రి శ్రీ ఉమామహేశ్వర రావు గారు గతంలో ఏ ముఖ్యమంత్రి, ఏ మంత్రి కూడా చేయని విధంగా కేవలం 18 నెలలలోపుగానే డ్యామ్ సైట్‌లోనూ, కాలువల మీద ముఖ్యకార్యదర్శుల వద్ద నుంచి జూనియర్ ఇంజనీరు వరకూ పిలిపించి 5 సార్లు సమావేశాలను నిర్వహించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. నేను అనేక ప్రభుత్వాలను చూశాను కానీ, ఈ మాదిరిగా ఇంతవరకూ ఏ ప్రభుత్వం కూడా చేయలేదు. కాలువల వద్దనే సమావేశాలను నిర్వహించి, వారికి టార్గెట్లు పెట్టి ఈ నెలలోగా మీరు ఈ పనులను చేయాలని నిర్దేశించిన ఘనత మన ముఖ్యమంత్రి గారికే దక్కుతుంది. ఆ విధంగా హంద్రీనీవా పనులు దాదాపు మూడున్నర లక్షల ఎకరాలకు ఒక్క అనంతపురం జిల్లాలోనే నీరిచ్చేటటువంటి కార్యక్రమం, ఇది ఎత్తిపోతల పథకం. గతంలో విద్యుత్‌కోసం ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో wind and solar energy ద్వారా బ్రహ్మాండమైన విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ సందర్భంగా నేను మంత్రిగారిని తమరిద్వారా కోరేదేమంటే, హంద్రీనీవా రెండవ దశలో భాగమైన పెనుగొండ, హిందూపూర్, మడకశిర ప్రాంతాలకు మడకశిర బ్రాంచి కెనాల్‌ద్వారా నీరు వస్తుంది. ఈ మడకశిర బ్రాంచి కెనాల్ ద్వారా దాదాపు 300 నుంచి 400 చెరువులకు నీరిచ్చేటటువంటి కార్యక్రమం. డైరక్టుగా ఆయకట్టుకు ఇక్కడ నీరు లేదు. అందుచేతనే, మడకశిర ప్రాంతం జిల్లాలోనే సముద్రమట్టానికి ఎత్తుగా ఉండే ప్రదేశం. దాదాపు 700 మీటర్ల ఎత్తులో మడకశిర ప్రాంతముంది. అందువల్ల మడకశిర ప్రాంతంలో మంత్రిగారు దయచేసి ఒక స్టోరేజి రిజర్వాయరును నిర్మించాలి. దీనికి కావలసిన స్థలాన్ని కూడా మేము ఏర్పాటుచేస్తాము. దానితోపాటు మడకశిర బ్రాంచి కెనాల్‌లో ఇంకా కొన్ని అడ్డంకులు ఉన్నాయి. రైల్వే గేట్ క్రాసింగ్ పనులు, టన్నెల్స్ పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టి వెంటనే మడకశిర బ్రాంచి కెనాల్‌కు రాబోయే జూన్, జూలై నెలల్లోగా నీరివ్వాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అంతకంటే ముందు, మంత్రిగారు మన ముఖ్యమంత్రి గారిని కూడా తీసుకువచ్చి మడకశిర బ్రాంచి కెనాల్ వద్ద ఒక సమావేశాన్ని నిర్వహిస్తే, ఆ పనులు వేగవంతంగా పూర్తవడానికి అవకాశముంటుందని తమరిద్వారా మంత్రిగారిని కోరుతూ, మరొకసారి ముఖ్యమంత్రి గారికి, మంత్రిగారికి ధన్యవాదాలను తెలియజేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్: శ్రీనివాసులు గారూ, రాయలసీమ ప్రాజెక్టులపై సూచనలుంటే చేయండి. మంత్రిగారు స్టేట్‌మెంట్ ఇస్తారు.

మ.12.50

శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్) : అధ్యక్షా, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల మీద మాట్లాడేందుకు అవకాశం కల్పించునందుకు మీకు నేను హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను. ఈ విషయంలో చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు. ఒక పార్టీ వాళ్లైతే ఈ రాష్ట్రంలో చాలా కార్యక్రమాలు చేస్తున్నామని చెబుతూనే ఉంటారు. కానీ, ఎప్పుడూ సర్ ఆర్థర్‌కాటన్ గురించి

గానీ, పురాణాలలో భగీరథుడు గురించి గానీ మనం అనుకుంటుంటాము. కానీ, అపర భగీరథుడిలాగా శ్రీ నందమూరి తారక రామారావు గారు తెలుగుగంగ పథకాన్ని చిత్తూరు జిల్లాకు తీసుకువచ్చినటువంటి చరిత్ర ఉంది. దానివల్ల తిరుపతి నియోజక వర్గంలో, కాళహస్తి నియోజక వర్గంలో, అదేవిధంగా సత్యవేడు నియోజక వర్గంలో ఈ రోజు బ్రహ్మాండంగా తెలుగుగంగ ద్వారా అటు తమిళనాడుకు కూడా నీళ్లిస్తూ, ఆ మూడు నియోజకవర్గాలతో బాటు చంద్రగిరి నియోజక వర్గం కూడా అభివృద్ధి పథంలోకి నడిచింది.

రెండవ విషయానికి వస్తే, కర్ణాటక నుండి తమిళనాడుకు కుప్పం నియోజక వర్గం గుండా వెళ్లే పాలార్ రివర్ ఉంది. ఆ పాలార్ రివర్‌కు ఏన్నో ఏళ్ల క్రితం గిరివాసై ఒడ్డు అనే ఒక ఒడ్డు ఉన్న పరిస్థితుల్లో ఆ పాలార్ నదీ జలాల్ని సక్రమంగా వినియోగించుకోవాలనే సదుద్దేశంతో మా శాసనసభ్యులు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు పాలార్ రివర్ పైన కొంగాటం, ఎల్లాగరం, సిద్దావూరు, బోయినపల్లి, శాంతిపురం, రెడ్లపల్లె, కొలమడుగు, శివరామపురం, నల్లగుట్టవంక, కంగుంది వంటి ప్రాంతాలలో పదిచోట్ల చెక్‌డ్యాంలు నిర్మించారు. అటువంటి చరిత్ర శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిది. గతంలో మా పార్టీ అధికారం కోల్పోయి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు పాలార్ రివర్ మీద ప్రాజెక్టు కట్టలేదు. తెలుగుదేశం ప్రభుత్వం పాలార్ రివర్‌పైన ప్రాజెక్టు నిర్మించలేదు, మేము ఆ ప్రాజెక్టు నిర్మాణం చేసి, కుప్పం నియోజక వర్గ ప్రజలకు సాగునీరు, త్రాగునీరు అందిస్తామని వారు ఫౌండేషన్ పథకం కూడా తయారు చేశారు. కానీ, వారు ఆ కార్యక్రమాన్ని కొనసాగించలేదనే విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఇప్పుడే గౌరవసభ్యులు కాలువలు అక్కడ నుండి, ఇక్కడ నుండి తవ్వుకు వస్తున్నామని అన్నారు. పాలార్ ప్రాజెక్టు విషయంలో అసలు ప్రాజెక్టే కట్టకుండా మొత్తం కాలువలన్నీ తవ్వేసిన చరిత్ర ఎవరిదని మనం చూసినట్లయితే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కాలువలు తవ్వేశారు కానీ, ప్రాజెక్టులు కట్టలేదు. గౌరవ మంత్రివర్యులు కూడా ఉన్నారు కాబట్టి ఒక విషయం మీ దృష్టికి తీసుకువస్తున్నాను. గతంలో కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్ రెండు చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. తమిళనాడులో కూడా ఆ పార్టీకి సహకరించే డి.ఎం.కే ప్రభుత్వం ఉంది. డి.ఎం.కే ప్రభుత్వం పాలార్ ప్రాజెక్టు కట్టడానికి అడ్డు పడితే కనీసం వాళ్లని ఒప్పించలేని పరిస్థితులలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది కాదా అనే విషయం కూడా సవినయంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

గౌరవ ముఖ్యమంత్రిగారు, ఇరిగేషన్ మంత్రి గారు కుప్పం నుంచి తంబళ్లపల్లి నియోజక వర్గం వరకు ఐదారుసార్లు పర్యటించి, అధికారులతో రివ్యూ మీటింగు ఏర్పాటుచేసి, హెచ్.ఎన్.ఎస్.ఎస్ కుప్పం కెనాల్‌కి రూ. 469కోట్లు మంజూరు చేశారు. ఈ రోజు కుప్పం మరియు పలమనేరు నియోజవర్గ ప్రజలు భూసేకరణ విషయమై అధికారులను పిలిచి, భూములిస్తున్నామని, భూసేకరణకు సహకరిస్తున్నారు. అంటే ఈ ప్రభుత్వంపై మాకు ఒక నమ్మకం వచ్చింది. వర్షాలు రాకుండా పోయే పరిస్థితి లేదు, తప్పనిసరిగా వర్షాలు మళ్లీ కురుస్తాయి కాబట్టి కాలువలు తవ్వి పెట్టుకుంటే చెరువుల్లోకి నీళ్లు వస్తాయనే నమ్మకం మాప్రజలలో ఏర్పడింది. అదేవిధంగా చిత్తూరు జిల్లాకు సంబంధించి కళ్లివంక ఉంది. కర్ణాటక నుండి తమిళనాడుకు పోయే కళ్లివంకకు డైవర్షన్ కెనాల్ ఏర్పాటుగా చేసే కార్యక్రమం కూడా జరుగుతోంది. ఈ మధ్య చేపట్టిన నీరు-చెట్టు పథకం ద్వారా మా జిల్లాలో ఉన్న 863 చెరువులలో కూడా పూడిక తీసే కార్యక్రమం చేపట్టడం వల్ల చెరువులన్నింటిలోనూ నీళ్లు కళకళలాడుతున్న పరిస్థితి నేడు వచ్చింది. ఆ విధంగా కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి. ఇరిగేషన్ మంత్రిగారు, ముఖ్యమంత్రిగారు ఏవిధంగానైనా పెండింగ్

ప్రాజెక్టులు పూర్తిచేయాలనే చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. మేము చేశాం, చేశాం, చేశామని చాలామంది మాట్లాడుతున్నారు. అడవులు, టన్నెల్స్‌లో ఉండే వాటి గురించి పట్టించుకోలేదు. గట్టి పనులన్నీ వదిలేసి, మెత్తగా ఉండే చోట జేసీబీలు పెట్టి లోడేసి ఎత్తుకుని పోయే పరిస్థితి చేశారు తప్ప, పూర్తి చేయాలనే సంకల్పం వారికి లేకుండా పోయింది. ఈరోజు ఈ ప్రభుత్వానికి సంకల్పం వచ్చి, చిత్తశుద్ధితో పనిచేస్తోంది. హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రవంతి రెండు కార్యక్రమాలు పూర్తయితే చిత్తూరు జిల్లా కూడా బ్రహ్మాండంగా ముందుకు పోతుందనే నమ్మకంతో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రిగారు బ్రహ్మాండంగా కార్యక్రమాలు చేస్తున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రిగారు కానీ, మా మంత్రి శ్రీ గోపాలకృష్ణ గారు గానీ చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు కాబట్టి ఈ కార్యక్రమంలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు అధ్యక్షుల వారికి మరొకసారి నమస్కారాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, ఇంతవరకు రాయలసీమను గురించి, రాయలసీమ నీటి కష్టాల గురించి చాలా మంది సభ్యులు మాట్లాడారు. కడుపు చింపుకుంటే కాళ్ల మీద పడినట్లు చాలా మంది రాయలసీమ ఏదో ఇదిగా ఉంది, ఇప్పటి ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడం లేదనే రీతిలో మాట్లాడారు. కానీ అది ఎంతవరకు నిజమో, ఎంతవరకు అది మోసమో రాయలసీమ ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఈరోజు ఇచ్చిన హామీకి నిలబడి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రైతులకు నీటి వనరులు ఉంటేనే, వ్యవసాయం అభివృద్ధి చెందుతుంది కాబట్టి ముందు నీటి సమస్యను తీర్చమని, ముఖ్యంగా ఆయన రాయలసీమ వాసిగా, రాయలసీమ ముద్దు బిడ్డగా నీటివనరులను సఫలీకృతం చేసేవిధంగా నీటి పారుదల శాఖను జలవనరుల శాఖగా మార్చారు. దానికి మంచి మంత్రిగారిని నియమించారు. ఆ మంత్రిగారిని మా అనంతపురానికి దత్తపుత్రుడు అని చెప్పవచ్చు. కాలువల విషయంలో ఒకనెలలో రెండు, మూడు సార్లు వచ్చి అధికారులందరినీ దాని మీద కేంద్రీకరించేటట్లు చేసి, ఇప్పుడు ఎంత జరిగింది, తరువాత విజిట్‌లో ఎంత జరగాలి, అధికారులు ఎందుకు చేయడం లేదు, దానికి గల కారణాలేమి, డబ్బు విషయంలో ఏమైనా వెనకబడుతున్నారా అని ఆలోచన చేశారు.

మా అనంతపురం జిల్లాలో జలకళ ఏవిధంగా ఉందనేది 10 సంవత్సరాల క్రితం నుంచి నీరు లేక ఎండిపోయిన శ్రీ కృష్ణ దేవరాయల కాలం నాటి చెరువులన్నింటిలో నీరు-చెట్టు కార్యక్రమం క్రింద నీరు నిండిన తీరు చూస్తే తెలుస్తుంది. వాటన్నింటిని నీటితో నింపడం జరిగింది. ఈ విషయంలో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారంటే, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చింది రాయలసీమలో జలకళ వచ్చిందని చెప్పుకోవడం జరుగుతోంది. ఒక నమ్మకం అనేది ప్రజలలో ఈ ప్రభుత్వం కల్పించడం జరిగింది. గతంలో ఒక నాయకుడిని టి.విలో చూశాను, నేను తప్పని సరిగా ఈ రోజు దాని గురించి చెప్పవలసిన అవసరం ఉంది. ఆయన బీడు భూములలో ఒక అడుగు వేయగానే మోకాళ్ల ఎత్తు పంటలు జియ్ మని రావడం జరుగుతుంది. అది చూసి నేను ఆశ్చర్యపోయాను. సృష్టిలో ఎక్కడా కూడా బీడుభూమి మీద ఒక మనిషి అడుగు వేయగానే మోకాళ్ల ఎత్తు పంటలు జియ్, జియ్ మని లేస్తుంటే అదేంటి అధ్యక్షా. ఆ రకమైన అలవాటు మా నాయకులకు లేదు. వారు అటువంటి పబ్లిసిటీకి ఇష్టపడరు. ఇప్పుడే సభ్యులు శ్రీ గౌనివారి శ్రీనివాసులు చెప్పినట్లు మెత్తమెత్తగా ఉన్న చోట మట్టి లేపి, గట్టిగా ఉన్నచోట పెట్టి జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా చేశారు. ఇంతకు ముందే సభ్యులు శ్రీ చంగల్ రాయుడుగారు చెప్పినట్లు అది కనక

వర్షమే, జల వర్షం ఎందుకవుతుంది. ఆ రకంగా చేసి ఈ రోజు శ్రీ రంగనీతులు చెప్పడం మంచిది కాదు. అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు రెండవ దశను త్వరగా పూర్తి చేయాలని నేను ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ. 1.00

అవి త్వరగా పూర్తి చేసి, కాలవలన్నింటికి కూడా త్వరగా మరమ్మత్తులు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. పిఏబిఆర్‌లో అయినా, హెచ్ఎల్‌సిలోనైనా ఎక్కడెక్కడైతే లీకేజీలు ఉన్నాయో, వాటన్నింటికి తప్పనిసరిగా మరమ్మత్తులు చేసి, మా అనంతపురం జిల్లాను సశ్యశ్యామలంగా చేసి, కరవును పారద్రోలి, పేదరికంపై విజయాన్ని సాధించమని తమ ద్వారా నేను గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు : అధ్యక్షా, చాలా సంతోషం. ఈరోజు రాయలసీమకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి కావడానికి గౌరవ సభ్యులందరూ ప్రభుత్వానికి చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చారు. 1987వ సంవత్సరంలో మహానుభావుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు సినీ రంగంలో, అదే రకంగా రాజకీయ రంగంలో కూడా ధ్రువతారగా నిలిచారు. ఆయన అప్పట్లోనే, రాయలసీమ ప్రాంతాన్ని సశ్యశ్యామలంగా చేయాలని, రాయలసీమలో కరవును పారద్రోలాలని, 1988 నవంబరు19వ తారీఖున శనివారం గాలేరు-నగరి సుజల స్రవంతి అంతర్భాగమైన చిత్తూరు జిల్లా రేణిగుంట మండలంలో కరకంబాడి జలాశయము, కడప జిల్లా సిద్ధవటం మండలంలో ఉద్దిమడుగు జలాశయములకు ఆ మహానుభావుడు ఆ రోజుల్లోనే శంకుస్థాపన చేశారు. ఈ చరిత్ర అంతా భావితరాలకు అందివ్వాలని చెబుతున్నాను. ఒకసారి హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు ప్రారంభించి ఇప్పటికి 3 దశాబ్దాలు అవుతోంది. ఈ చరిత్ర అంతా భావితరాలకు అందించడానికి నెల రోజుల నుంచి ఈ పుస్తకాలు తీసి రికార్డులన్నీ చదివాను.

(పుస్తకాలను సభలో చూపించారు.)

ఎక్కడెక్కడ ఏ శంకుస్థాపనలు జరిగాయి, ఎక్కడెక్కడ పనులు ఏ విధంగా చేశారు అన్నీ పరిశీలించాము. అదేవిధంగా, ఆ రోజుల్లోనే శ్రీమతి ఇందిరాగాంధీ గారిని, ఎం.జి. రామచంద్రన్ గారిని తీసుకువచ్చి, తెలుగు గంగ ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేశారు. రాయలసీమ ప్రాంతానికి సంబంధించి చూసినట్లయితే, చిత్తూరు జిల్లా, శ్రీశైలం, శ్రీకాళహస్తి, తిరుమల, తిరుపతి, సోమశిల, కండలేరు, కడప మొదలైన ఎన్నో ప్రాంతాలలోని వారికి తెలుగుగంగ ఒక నమ్మకాన్ని కలిగించింది. అదేవిధంగా హంద్రీనీవా ద్వారా గత సంవత్సరం ఇచ్చిన 17 టిఎంసిలు, ఈ సంవత్సరం ఇచ్చిన 8 టిఎంసిలు ఆ ప్రాంత ప్రజలలో ఒక నమ్మకాన్ని, ఆత్మస్థైర్యాన్ని కలగజేశాయి. ఎందుకంటే, ఈ సంవత్సరం ఆల్మట్టి, తుంగభద్రల నుంచి ఒక్క చుక్క నీరు కూడా శ్రీశైలం ప్రాజెక్టుకు రాలేదు. 660 టిఎంసిలు వస్తాయనుకున్న నీరు 66 టిఎంసిలు క్యాచ్‌మెంట్ ఏరియాలో శ్రీశైలానికి వచ్చాయి. దాదాపు ఆ నీళ్ళను చాలా జాగ్రత్తగా పోతిరెడ్డిపాడుకు మంచినీటి కోసం 1 టిఎంసి నీటిని, అలాగే, పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు 8.8 టిఎంసిల నీటిని, పోలవరం రైట్ కెనాల్ ద్వారా కృష్ణాడెల్టా రైతాంగానికి ఇచ్చాము. ఆ ప్రాంతంలో రైతులు దాదాపు 8,60,000 ఎకరాల పంటలలో సుమారు 2,400 కోట్ల విలువ చేసే పంటలను కాపాడి, ఆ మేరకు ఆ నీటిని 8 టిఎంసిలు శ్రీశైలం దగ్గర నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు ఇవ్వడం వలన ఆ ప్రాంత ప్రజలలో ఒక నమ్మకం

ఏర్పడింది. ఇంత కష్టకాలంలో ఇటు 8 టిఎంసిలు, అటు 8 టిఎంసిలు ఇచ్చాము. అలాగే, 80 టిఎంసిల నీటిని గోదావరి జలాల ద్వారా కృష్ణా, గోదావరి జిల్లాలకు తీసుకువెళ్ళినట్లయితే ఆ మేరకు ఆ నీళ్ళు శ్రీశైలం దగ్గర నుంచి తీసుకోవడం ద్వారా తప్పనిసరిగా ఆ ప్రాంతాలు బాగుపడతాయి. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1, ఫేజ్-2, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1ను ఈ సంవత్సరం త్వరితగతిన పూర్తిచేయాలనే ఒక లక్ష్యం పెట్టుకున్నాము. వీటికి సంబంధించిన బడ్జెట్ ఏ విధంగా ఉంది, ఎలా ఖర్చు పెడతారని గౌరవసభ్యులు అడగడం జరిగింది. వాస్తవంగా ఈ సంవత్సరం ప్రభుత్వం దాదాపు రూ.4,678కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేసింది. ఇప్పుడు అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు దాదాపు రూ.7,997కోట్లు ఈ నిముషం వరకు వాటిపైన ఖర్చుపెట్టడం జరిగింది. మనం ఇంకా మార్చి 15వ తేదీలోనే ఉన్నాము. ఇంకా మనకు 15 రోజుల సమయం ఉంది. ఆ సమయం లోపల మార్చి నెలాఖరుకల్లా ఇంకా ఖర్చుపెట్టే అవకాశం ఉంది. ఈ రెండు సంవత్సరాలలో దాదాపు రూ.12,000కోట్లు ప్రాజెక్టులకు ఖర్చుపెట్టడం జరిగింది. ఎందుకంటే, మన రాష్ట్రం దాదాపు రూ.16,000కోట్లు ఆర్థిక ఇబ్బందుల్లో ప్రారంభమైంది. ఈ 21 నెలల్లో రూ.12,000కోట్లను ఇరిగేషన్ ప్రాజెక్టులపైన ఖర్చుపెట్టాము. తప్పనిసరిగా హెచ్ఎన్ఎస్, జిఎన్ఎస్ఎస్, తెలుగు గంగ ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా అటవీ శాఖ అనుమతులు రాకపోతే, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెంటనే మన ముఖ్యమంత్రిగారు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఆ ప్రాజెక్టులకు అన్ని క్లియరెన్సులను తీసుకోవడం వల్ల నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో తెలుగు గంగ క్రింద నందమూరి తారకరామారావుగారు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుకు శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి చేతుల మీదుగా పూర్తి అటవీ అనుమతులు లభించాయి. అంతేగాకుండా, ఆ ప్రాంతాలకు పూర్తిగా నీరు అందించే ప్రయత్నాలు చేస్తున్నాము. అలాగే, హంద్రీనీవా ఫేజ్-1 కు సంబంధించి గౌరవ సభ్యులు అడిగినట్లుగా, ఆ కాలువకు సంబంధించి లైనింగ్ పనులు ఏ విధంగా చేస్తారని అడిగారు. ఆ కాలువలకు పూర్తిస్థాయిలో నీరు వచ్చినప్పుడు 6 పంపులు, 8 పంపులు వేసినా కూడా ఏ విధంగా, ఏ మేరకు నీరు వెడతాయనే వాటిని కూడా ఎనలైజ్ చేస్తున్నాము. ఎందుకంటే, వాటికి పూర్తిస్థాయిలో నీరు అందించాలి. 25 యేళ్ళ క్రితం కె.ఈ. కృష్ణమూర్తి గారు ఆనాడు మంత్రిగా ఉన్న సమయంలో కృష్ణగిరి రిజర్వాయరు, ప్రత్తికొండ జలాశయాలకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఇప్పుడు ఆయన రెవెన్యూ మంత్రిగా, నేను ఇరిగేషన్ మంత్రిగా, ముఖ్యమంత్రిగారి చేతుల మీదుగా ఆ జలాశయాలకు నీటిని అందించాము. అక్కడ ఉల్లి పంట పండించుకుంటున్న ఉల్లి రైతులను ఇక్కడ ఏ మేరకు నీళ్ళు వస్తున్నాయని అడిగితే, ఈరోజున ఒక ఎకరానికి దాదాపు రూ.50,000 సంపాదించగలమనే నమ్మకం కలుగుతోందని చెప్పారు. ఆ రైతుల కళ్ళల్లో ధైర్యం, అతను వేసిన పంట మీద ఒక నమ్మకాన్ని మాకు చూపించారు. అలాగే మేము విడుదల చేసిన కొద్దిపాటి నీళ్ళతోనే, ఈ రోజున కొన్ని వేల బోర్లు ఛార్జి అయ్యి, రైతులకు నమ్మకం వచ్చింది. గౌరవ సభ్యులు చెప్పినట్లుగా దాదాపు 22 బోర్లు రీఛార్జ్ అవుతున్నాయి. అదేవిధంగా, రాయలసీమ ప్రాజెక్టుల మీద కూడా పూర్తిస్థాయిలో నిధులను కేటాయించేందుకు ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉంది. అలాగే, హెచ్ఎన్ఎస్ ఫేజ్-1, ఫేజ్-2, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, మదనపల్లి వరకు అలాగే, మడకశిర, హిందూపూర్ వరకు గాని, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని తంబళ్ళపల్లి, కుప్పం వరకు నీరు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నాము. ముఖ్యమంత్రిగారు ఈ సంవత్సరం బడ్జెట్ సమావేశాలు అయిన తరువాత, ఏప్రిల్, మే, జూన్ మాసాల తరువాత వర్షాలు వచ్చేంతవరకు నీరు-చెట్టు కార్యక్రమాలను ప్రోత్సహించడం, 100 ఎకరాల భూములు ఉన్న జన్మభూమి కార్యక్రమంలో సభ్యులందరూ మరియు గ్రామ సర్పంచులు, ఎం.పి.టి.సి.లు, వార్డు మెంబర్లు, నీటి సరఫరా అధ్యక్షులు మొదలైన

వారందరూ కూడా దాదాపు 36 వేలమంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవ్వాలని పిలుపు ఇచ్చారు. ఉపాధి హామీలో వచ్చిన డబ్బులను లేక రాష్ట్రప్రభుత్వం ఇచ్చే నిధులను ప్రక్కదోవ పట్టకుండా, అందరూ కలసికట్టుగా అన్ని కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ, చెఱువులను, కాలువలను పునరుద్ధరించుకునేందుకు వారందరూ కూడా ముందుకు రావడం జరిగింది. అలాగే, మద్రాసులో వచ్చిన భారీవర్షాల వలన, తుఫానుల వల్ల చాలా ప్రాంతాలలోని చెఱువులు నీటితో నిండిపోయాయి. నీరు-చెట్టు కార్యక్రమంలో మేము ఒక ప్రాంతంలో శంకుస్థాపన చేయడానికి వెళుతుంటే, మాకు అడ్డం పడిన పరిస్థితి ఉంది. తంబళ్ళపల్లిలో శ్రీకృష్ణదేవరాయలు గారి నాటి కాలంలో ఉన్న చెఱువులో ఈనాడు పూర్తిగా నీళ్ళు వచ్చాయి.

మ.1.10

మీరెందుకు నీళ్ల రాని చెరువుకు డబ్బులు ఖర్చుపెడుతున్నారని ఆ రోజున మాకు అడ్డం పడటానికి ప్రయత్నం చేశారు. దేవుడి దయవల్ల, దైవ సంకల్పం వల్ల, మా ప్రభుత్వ కృషి వల్ల ఆ తంబళ్లపల్లి ప్రాంతంలోని చెరువులు జలకళని సంతరించుకున్నాయి. చిత్తూరు జిల్లాలో బ్రహ్మాండంగా నీటి మట్టం 10 అడుగులు, 15 అడుగులు పైకివచ్చి రెండున్నర మీటర్ల మేర భూగర్భ జలాలను వాడుకున్నాము. సుమారు 225 టిఎంసిలు ఈ రెండు, మూడు నెలల్లోనే రాష్ట్రం మొత్తం మీద పెద్ద ఎత్తున భూగర్భ జలాలు పెరిగి ఈ కష్టకాలంలో, కరువు పరిస్థితుల్లో వాడుకోవడం జరిగింది. అదేవిధంగా భూగర్భ జలాలను ఎలా పెంపొందించాలి, రాయలసీమలో చాలా పెద్ద ఎత్తున పడ్డ వర్షాలను ఎక్కడికక్కడ గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు ఈ చెరువు నాది, ఈ కాలువ నాదని బాగుచేసుకుని, చెరువులు తెగ్గొట్టుకుని, చెరువులు నిలబెట్టుకుని అక్కడ నీళ్లు నిలబెట్టుకున్నారు. ఇంకా ఈ సంవత్సరం కూడా చాలా పెద్ద ఎత్తున ముందుకు వెళ్లమని కోరుతున్నాను.

తెలుగు గంగకు సంబంధించి బ్యాలెన్స్ 1,30,000 ఎకరాలకు నీళ్లివ్వాల్సి ఉంది. ఫారెస్టు క్లియరెన్స్‌లు అన్నీ పూర్తి చేస్తాము. జూన్ నుండి డిసెంబరు నాటికి టార్గెట్‌లు పూర్తి చేసుకుని హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2, మదనపల్లి- కుప్పం, హిందూపూర్, మడకశిర, తంబళ్లపల్లి ప్రాంతాల రైతులకు ఉపయోగపడేలా నీళ్లు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాము. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1 కూడా ఈ సంవత్సరం టార్గెట్ చేసుకుని 2016లో పూర్తి చేయాలి. గండికోట, మైలవరం, వామికొండసాగరు, సర్వరాయసాగరు, గోరకల్లు రిజర్వాయరు బెల్టంతా నీళ్లు పెట్టినట్లయితే కడప జిల్లాలో 50 నుండి 60 టిఎంసిల నీళ్లు నిలబెట్టవచ్చు. అందువల్ల దాని మీద దృష్టి పెట్టి జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1 పూర్తి చేయడానికి కూడా 2016లో అత్యంత ప్రాధాన్యతనిచ్చాము. సుమారు 15, 16 ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని నేను గౌరవ సభ్యులకు ఇచ్చాను. ఇవన్నీ కూడా పోలవరం ప్రాజెక్టుకి..

డా.ఎం.గేయానంద్ః మంత్రి గారూ.. అలొకేషన్ ఆఫ్ మనీ గురించి చెప్పండి. అక్కడి ప్రజల్లో ఉన్న అపోహలేమిటంటే హంద్రీనీవా ప్రాజెక్టు ఇంకా మూడేళ్లు గడిచినా పూర్తి స్థాయిలో అది పూర్తి కాదు. ఆయకట్టుకు నీరు రాదు. చాలా సాంకేతిక సమస్యలు, రాజకీయ అంశాలు ఉన్నా కూడా ఫైనల్‌గా ఎప్పుడు మీరు దాన్ని పూర్తి చేస్తారు, ఆ ఆయకట్టుకు ఎప్పుడు నీళ్లిస్తారు? దాని గురించి స్పష్టమైన మెసేజ్ ప్రజలకు వెళ్లాలి. దాని గురించి చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావుః అధ్యక్షా, ప్రభుత్వ లక్ష్యం ఏమంటే హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్–1, ఫేజ్–2 ద్వారా ఎట్టిపరిస్థితుల్లో మదనపల్లి, తంబళ్లపల్లి ఆ బెల్టంతా కూడా నీటిని తీసుకువెళ్లడానికి జూన్ నెలను ముఖ్యమంత్రి గారు టార్గెట్‌గా పెట్టారు. ఆ టార్గెట్‌కు అనుగుణంగా మేము పరిగెడుతున్నాము. స్వయంగా ముఖ్యమంత్రి గారే కాలువల మీదకు రాబోతున్నారు. నిధుల విషయంలో కూడా మీరు చెప్పారు. ఇప్పటికే నిరుడు పెట్టిన బడ్జెట్‌లో కూడా రూ.4300 కోట్ల నుండి రూ.7995 కోట్లకి ప్రాధాన్యతనిచ్చి ముందుకు తీసుకెళ్లాము. ఈ సంవత్సరం కూడా హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్–1, ఫేజ్–2, జిఎన్ఎస్ఎస్ ఫేజ్–1, పూర్తి స్థాయిలో తెలుగు గంగ పనులు చేయడానికి నిధుల విడుదల విషయంలో ఫైనాన్స్ డిపార్టుమెంటుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాబట్టి, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూడా నిధుల కొరతనేది లేకుండా ఈ సంవత్సరం రాయలసీమలో ఈ ప్రాజెక్టులు పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాము. దానికి అనుగుణంగా ముందుకు వెళతాము.

హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్–1లో సుమారు రూ.4300 కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉన్నా కూడా ముందు వాటర్ పుష్ చేయడానికి ఏవిధంగా చేయాలన్నది చూస్తున్నాము. ఇవాళ లైనింగ్ ఉంది. కొంతమంది దాన్ని వైడెనింగ్ చేయమని అడుగుతున్నారు. కాబట్టి, మనం ముందు 6 పంపుల్లో, 8 పంపుల్లో మనం తీసుకునేటట్లయితే ఇవాళ ఈ అమౌంట్లు చూసి గౌరవ సభ్యులకు ఆందోళన ఉంది. కానీ, మన టార్గెట్ ఏమిటంటే ముందు వాటర్ పుష్ చేసినట్లయితే మళ్లీ కాలువలను ఎక్కడన్నా వైడెనింగ్ చేసుకోవాలన్నా, స్ట్రక్చర్‌లో ఏమన్నా మార్పు చేసుకోవాలన్నా వెసులుబాటు ఉంటుంది. మనం టార్గెట్ ప్రకారం ముందు 2 పంపులు అనుకున్నవి కాస్తా, ఈ సంవత్సరం ఆరు పంపులు, ఏడు పంపుల దాకా వెళ్లాము. అక్కడి కాలువలు ఎక్కడ బ్రీచ్ అవుతున్నాయో టెస్ట్ చేసుకున్నాము. ఈ సంవత్సరం ఆరు పంపుల దాకా వెళ్లాం. ఎక్కడ ఇబ్బందులు వస్తాయి, ఎక్కడ ఎస్కేప్స్ కట్టాలనేది ఆలోచన చేసుకుని ఈ మూడు నాలుగు నెలల్లో జూన్‌లో ఫ్లడ్ వచ్చేలోపల ఆ ఎస్కేప్స్ పూర్తి చేయబోతున్నాము. మళ్లీ రేపు 8 పంపుల నుండి నీళ్లు వెళ్లిన తరువాత ఇంకా ఏం ఇబ్బందులు వస్తాయో చూసుకుని లైనింగ్ పనులు మొదలుపెడతాము. కాబట్టి, గౌరవ సభ్యులు ఈ వందల, వేల కోట్ల మీద అనుమానాలు లేకుండా ముందు వాటర్ పుష్ చేసి చెరువులన్నీ కూడా లింకప్ చేసినట్లయితే చెరువుల్లో ఉన్న నీళ్లు, ఆయకట్టు, గ్రౌండ్ వాటర్, ప్లస్ బోర్లన్నీ కూడా ఛార్జయ్యి ఎక్కడికక్కడ రైతులు ముందుకువెళ్లే అవకాశం ఉంది. అప్పుడు లైనింగ్ ఎక్కడ చేయాలి, ఎక్కడ అవసరమౌతుంది అన్న దానికి అనుగుణంగా ముందుకు వెళతాము.

శ్రీ దేవసాని చిన గోవింద రెడ్డి : సార్, తెలుగు గంగ కాలువ రిపేర్ల సంగతి చెప్పండి.

శ్రీ దేవినేని ఉమమహేశ్వరరావు: అధ్యక్షా, నేను కూడా గౌరవ సభ్యులు గోవింద రెడ్డి గారు చెప్పినట్లుగా కాలువ మొత్తం తిరిగాను. లైన్స్ అన్నింటికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. ఎస్టిమేట్స్ కూడా తయారయ్యాయి. మరి ఏప్రిల్‌లో మేము కాలువల మీదకు వస్తాము.

శ్రీ దేవసాని చిన గోవింద రెడ్డి : జూన్ లోపల చేయాలి సార్. రెండేళ్ల నుండి అలాగే ఉంది.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: గత రెండు సంవత్సరాల నుండి కూడా కృష్ణా బేసిన్‌లో ఇబ్బందులున్నాయి కాబట్టి, బద్వేలు ప్రాంతంలో ఇబ్బంది వచ్చింది. డెఫినెట్‌గా ఈ సంవత్సరం

మాన్‌సూన్ బాగుంటుంది. అంతా మంచి జరగాలని అందరం కోరుకుంటున్నాము. డెఫినెట్‌గా నీరు వచ్చినప్పుడు పోతిరెడ్డి పాడు దగ్గర నుండి బద్వేలు గానీ, బ్రహ్మసాగరు గానీ ఎక్కడైతే అబ్‌స్ట్రక్షన్స్ ఉన్నాయో, చేసిన లైనింగ్‌లు పడిపోయి ఉన్నాయో వాటిని సరిచేయిస్తాము. పనులు కూడా వేగవంతం చేయడానికి ముందుకు తీసుకువెళుతున్నాము.

అట్లాగే, తెలుగు గంగ పనులు ఈ ఆర్నెల్లలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాము. ఎందుకంటే, పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేసే అదృష్టం ఈ ప్రభుత్వానికి వచ్చింది కాబట్టి తెలుగు గంగకు సంబంధించి ఆర్నెల్లలో మొత్తం పెండింగ్ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యం కూడా పెట్టుకున్నాము. అట్లాగే, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-1, ఫేజ్-2 కూడా టార్గెట్ చేసుకున్నాము. జిఎన్ఎస్ఎస్, వామికొండసాగర్, సర్వరాయసాగర్, గండికోట, మైలవరం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ క్రింద లిఫ్టులు పెట్టడం గానీ..ఇలా కడప జిల్లాలో 50 నుండి 60 టిఎంసిల నీటిని వరదలొచ్చినప్పుడు నిలబెట్టాలన్న లక్ష్యంతో జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

శ్రీ దేవసాని చిన గోవింద రెడ్డి: ఈసారి రిజర్వాయరు లెవల్ కరెక్టుగా మీరు ఉంచుతారా సార్? మా పోతిరెడ్డిపాడుకు నీళ్లు వచ్చేలాగా తెలంగాణా ప్రభుత్వంతో మాట్లాడతారా? మాకు కొద్దిగా డౌట్స్ ఉన్నాయి సార్. ఏవిధంగా మీరు లెవల్స్ పెట్టగలుగుతారు?

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, రిజర్వాయర్లకు వచ్చిన నీరు తక్కువగా ఉండటం వల్ల ఈ ఆందోళన సభ్యులకుంది. డెఫినెట్‌గా రాయలసీమ ప్రాజెక్టులను కాపాడటానికి ప్రయత్నం చేస్తాము. ఎందుకంటే కృష్ణా బేసిన్‌లో జాగ్రత్తలు తీసుకుని కృష్ణా డెల్టాని మనం స్థిరీకరించుకుంటున్నాము. పైన క్యాచ్‌మెంట్ ఏరియాలో వచ్చిన నీళ్లన్నీ కూడా పులిచింతలలో అట్టిపెడతాము. గోదావరికి ఫ్లడ్ వచ్చినప్పుడు కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాలో కొంత భాగానికి 13 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు కృష్ణా డెల్టాని స్టెబిలైజ్ చేసుకుంటాము. ఆ మేరకు ఫ్లడ్ అటు వచ్చినప్పుడు రాయలసీమ ప్రాంతాన్ని కాపాడుకుంటాము. కరవు రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని, అత్యంత వెనుకబడ్డ ప్రాంతాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురము జిల్లాల్లోని ఆయకట్టుని కాపాడుకోవడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాము.

అలాగే, ప్రకాశం జిల్లా, కడప బెల్టంతా కూడా ఉపయోగపడే వెలుగొండ ప్రాజెక్టులో టన్నెల్స్ అంతా కూడా 2016, 2017 నాటికి పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాము. రెండో టన్నెల్ కూడా స్పీడుగా పరిగెడుతోంది. మొదటి టన్నెల్ విషయంలో కొద్దిగా రాక్ ఇబ్బందులు వస్తే, ఎక్స్‌పర్ట్స్ అందర్నీ కూడా పిలిపించి ఇంకా ఎలా వేగవంతం చేయాలి అన్నది ఆలోచించి పనులు చేపట్టాము. వెలుగొండ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ప్రకాశం జిల్లాను కాపాడుకోవచ్చు. అలాగే, ఈ సంవత్సరం నెల్లూరు జిల్లాలో పది లక్షల ఎకరాల ఆయకట్టును కాపాడుకున్నాము. కాబట్టి, నెల్లూరు జిల్లా సేఫ్‌లో ఉంది. ఇవాళ అదే పరిస్థితి రాయలసీమ నాలుగు జిల్లాల్లో తేవడానికి గోదావరి-కృష్ణా పవిత్ర సంగమం క్రింద రెండు నదుల్ని అనుసంధానం చేశాము.

అలాగే, చాలామంది పట్టిసీమ మీద ఆందోళన చెందారు. సంవత్సరం లోపు ఎలా పూర్తవుతుంది అన్నారు. 24 పంపులు కూడా మార్చి ఆఖరునాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తాము. ముఖ్యమంత్రి గారు కూడా అక్కడికి రాబోతున్నారు. అట్లాగే, 1941లో శ్రీరామపాదసాగర్ ప్రాజెక్టుగా ఉన్నటువంటి పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇవాళ 75 సంవత్సరాల తరువాత డయాఫ్రం వాల్ పనులు ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా అక్కడ

జరుగుతున్నాయి. సుమారు 1.5 మీటర్ల వెడల్పు, 110 మీటర్లు భూగర్భంలోకి డయాఫ్రం వాల్‌కి సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎర్త్-కం-రాక్‌ఫిల్ డ్యాం పనులు చేపట్టి 2018 కల్లా నీళ్లు నిలబెట్టాలనే ప్రయత్నంలో రూ.3660 కోట్లు ఇవాళ పోలవరం ప్రాజెక్టుకు కేటాయించి, 1,15,000 క్యూబిక్ మీటర్ల పనిని, 2,50,000 క్యూబిక్ మీటర్ల వరకు వెళ్లమని ఆదేశాలిచ్చాము. ఆ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ 1.75 కి.మీ. మేర ఈ దేశంలోనే అత్యంత పెద్ద ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే అదృష్టం తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కింది. ఇవాళ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి చేతుల మీదుగా పోలవరం ప్రాజెక్టులో నీళ్లు నిలబెట్టే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నాము. ఎందుకంటే, అక్కడ నీళ్లు నిలబెట్టినట్లయితే ఇవాళ పది హైదరాబాదులు కాదు.....

మ.1.20

మా ఆలోచన అంతా కూడా కృష్ణా డెల్టాలో నాగార్జునసాగర్ ఆయకట్టుని కాపాడుకుని గోదావరి కృష్ణా జలాలను మనం రాయలసీమకు తీసుకెళ్లాలి. సోమశిలకు, కండలేరుకు తీసుకెళ్లాలి. 135 టిఎంసిల నీటిని కండలేరు, సోమశిలలో పెట్టుకునే అవకాశం ఉంది. 1600 టిఎంసిల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్లాయి. మేము తీసుకువచ్చింది 8.8 టిఎంసిలు. పండిన పంట ఖరీదు రూ.2,400 కోట్లు. ఇంకా కొద్దిపాటి నీళ్లు తీసుకువచ్చి అటు సోమశిల, కండలేరులో పెడితే నెల్లూరు జిల్లా నుండి రాయలసీమ నాలుగు జిల్లాలు కూడా బంగారం పండిస్తారు. రాయలసీమ రతనాల సీమ అవుతుంది. రాయలసీమ హార్టీకల్చర్ హబ్ అవుతుంది. ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. పులివెందుల నియోజకవర్గంలో చీనీ చెట్లు ఎండిపోతున్నాయి. గత సంవత్సరం రైతులంతా వచ్చి ముఖ్యమంత్రిగారిని నీళ్లు పంపించమని కోరితే, ఏదో విధంగా నీళ్లు పంపమని ముఖ్యమంత్రిగారు ఆదేశాలిచ్చారు. అటు అనంతపురం జిల్లాకు వేరే ప్రాంతం నుండి నీళ్లిచ్చి, అక్కడ నుండి వచ్చే తుంగభద్ర నీటిని పులివెందులకు పంపిస్తే, అక్కడి చీనీ, బత్తాయి రైతులు ఎకరానికి రూ.4 లక్షల నుండి రూ. 9 లక్షలవరకూ సంపాదించుకున్నారు. ఆ విధంగా సుమారు వేలాది ఎకరాలలో పులివెందులలో బత్తాయి, చీనీ చెట్లు బాగా పండుతున్నాయి. ఆ ప్రాంతం వారికి ఒక నమ్మకం వచ్చింది. చంద్రబాబు నాయుడు గారు నీళ్లిస్తారు, పులివెందులకు నీళ్లు వస్తాయి, గండికోట పూర్తవుతుంది అనే నమ్మకం వచ్చింది. మా సతీష్ కుమార్ రెడ్డి గారు ఏదైతే పట్టుదలతో గడ్డం పెంచుకుని కాలువల మీద తిరుగుతున్నారో, ఆ నమ్మకాన్ని ఈ ప్రభుత్వం నిలబెడుతుంది. ముఖ్యమంత్రిగారు తప్పకుండా ఇటు కడప జిల్లాకు, పులివెందుల ప్రాంతానికి నీటిని అందచేస్తారు. రైతులు అంతా కూడా నీళ్లొస్తాయనే నమ్మకంతో ముందుకు వెళుతున్నారు. చీనీ చెట్ల ఆయకట్టుని కూడా కొత్తగా పెంచుకుంటున్నారు. వారికి ఆ నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఇవ్వగలిగాము. అదే నమ్మకంతో టార్గెట్ పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు చేసుకుని వాటర్ గ్రో చేయడానికి ఎంత అవసరం అవుతుందో ఆ విధంగా ముందుకు వెళుతున్నామని గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాము.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, 854 ఫీట్లు శ్రీశైలం రిజర్వాయర్‌లో ఉంటే ఇవన్నీ కుదురుతాయి. కానీ, ఆ 854 ఫీట్ల నీటికి గ్యారంటీ ఏమిటి? తెలంగాణా ప్రభుత్వం వాడుకునే నీళ్లు, పైనుండి కర్ణాటక ప్రభుత్వం నుండి మనకు ఉండే ఇబ్బందులు, పోతిరెడ్డిపాడు ద్వారా నీరు రావడం సాధ్యమేనా అనేదానిపైన క్లారిటీ అవసరం. రెండవది ప్రజలకు విశ్వాసం కల్పించడం అత్యవసరం. 854 ఫీట్లు నీరు వస్తుందనేదానిపై గ్యారంటీ గానీ, ఉంటుందనే గ్యారంటీ గానీ వర్షం మీదనో లేదా పైన ఉన్న తుంగభద్ర, లేదా కృష్ణానదిలో వరదలు వస్తేనో సంభవమవుతుంది. ఈ

లాటరీ విధానం కాకుండా కృష్ణా నది మిగులు జలాలు కాకుండా నికర జలాలు రాయలసీమకు ఇలా ఇవ్వబోతున్నామనేదానిని ఆచరణలో చూపించాల్సిన అవసరం ఉన్నది. అదే సమయంలో ఈ రకమైన ఒప్పందాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో గానీ, మరోచోట గానీ చేసి రాయలసీమకు నికర జలాలు ఇచ్చేవిధంగా చేయకుండా ఎన్ని చెప్పినా అవి తాత్కాలికమే గానీ, శాశ్వత పరిష్కారం కావు. మొన్న కడప, చిత్తూరు, మద్రాసులో బాగా వర్షాలు పడ్డాయి చెరువులు నిండాయి, కళకళలాడుతున్నాయి అందులో కొంత మీరు ఖ్యాతి తీసుకున్నా మాకు అభ్యంతరం లేదు. ప్రతి నాలుగైదు సంవత్సరాలల్లో మూడునాలుగేళ్లు వర్షాలు పడకుండా  వర్షాభావ పరిస్థితులు ఉండేచోట నీళ్లు ఉంటాయని గ్యారంటీ ఏమిటి? నాగార్జునసాగర్ ప్రాజెక్టు కట్టకముందు కృష్ణా, గుంటూరు జిల్లాలది అదే పరిస్థితి. అలాగే కాటన్‌దొర ధవళేశ్వరం దగ్గర బ్యారేజ్ కట్టకముందు గోదావరి ప్రాంతం అంతా వలసల ప్రాంతం. గోదావరి రెండు జిల్లాలు పనికిరాని ప్రాంతమని చెప్పి నిజాం నవాబు వేరేవాళ్లకు ఇచ్చారు. కాబట్టి ప్రాజెక్టు కట్టడం, నికరమైన నీళ్లు ఉండడం, నికరమైన వ్యవసాయం ఉండడం వల్ల ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందడమే కాదు, నాగరికత కూడా అభివృద్ధి చెందుతుంది. ఆ రకమైన గ్యారంటీ ఇవ్వకుండా, ఆ రకమైన ఒప్పందం ఇవ్వకుండా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌తోటి మా రాయలసీమ ప్రజలకు విశ్వాసం కల్పించడం కష్టం.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు : అధ్యక్షా, చరిత్రలో ఒక్కొక్కరికి ఒక్కో అవకాశం వస్తుంది. బచావత్ ట్రిబ్యునల్ విషయం పెద్దలందరికీ తెలుసు. ఆ రోజుల్లో మహానుభావుడు శ్రీ కె. ఎల్. రావుగారు, ఎంతోమంది ముఖ్యమంత్రులు ఉన్న సమయంలో బచావత్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చింది. దాని తరువాత 30 ఏళ్ల తరువాత మూడు రాష్ట్రాలు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రల మధ్య ఆల్‌మట్టి వివాదం వచ్చినప్పుడు కేంద్రప్రభుత్వాన్ని సంప్రదిస్తే, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ వచ్చింది. ఆ ట్రిబ్యునల్ వచ్చినప్పుడు 2004 వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం వచ్చింది. ఆ రోజున నేను శాసనసభ్యుడిగా ఉన్నాను, ప్రతిపక్ష నాయకుడుగా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఉన్నారు. అప్పుడు మేము చెప్పాము. ఇదొక అవకాశం వచ్చింది. రాయలసీమలో ప్రజలు, నాయకులు వారియొక్క ఆవేదన, గుండెచప్పుడు వినిపించి ఆ ప్రాంత హక్కులు కాపాడమని అడిగితే కనీసం మమ్మల్ని పట్టించుకోలేదు.  ప్రజాస్వామ్యంలో మనం చేయగలిగింది చేశాము. విజయవాడ ప్రకాశం బ్యారేజీ మీద మహాధర్నా చేశాము.  అప్పుడు  ఆ మండుటెండలో చంద్రబాబునాయుడు వచ్చి అప్పటి ముఖ్యమంత్రుల కళ్లు తెరిపించడానికి ప్రయత్నం చేశారు. చచ్చిపోయి ఎక్కడున్నారో మహానుభావుడు ఎర్రన్నాయుడు గారు కూడా కృష్ణానదిలో పెద్ద బహిరంగ సభ పెడితే ఆయన కూడా మాట్లాడారు. 10 సంవత్సరాలల్లో 3 ముఖ్యమంత్రులు  డా. వై.యస్. రాజశేఖర  రెడ్డి, శ్రీ కె. రోశయ్య, శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ఉన్న కాలంలో జడ్జిమెంట్స్ వచ్చాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మూడు రాష్ట్రాల వాదనలను విన్నది. ఏవైతే జడ్జిమెంట్స్ వచ్చాయో,  అవి మేము చేసిన ఆందోళనల మీద సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ రావడం జరిగింది.   ఆ ఎస్.ఎల్.పి. ల మీద  వాదనలు జరుగుతున్నాయి. ఆ రోజే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు సమర్థవంతమైన లాయర్లను పెట్టి గట్టిగా వాదనలను వినిపించినట్లయితే, ఈ రోజున తెలుగు గంగకు 29 టిఎంసిల నీళ్లు వచ్చినా, రాజోలిబండతోబాటు హంద్రీనీవాకు, గాలేరు నగరికి మిగులు జలాలు, నికర జలాలు కేటాయింపులు వచ్చాయి.  గతంలో ఎన్.టి. రామారావుగారి ఇంటికి వెళ్లి, సెక్రటేరియట్‌కు వెడుతుంటే ఆయన కారుకు అడ్డంపడి  తెలుగు గంగ కడుతున్నారు , మాకు నికర జలాలు ఇవ్వండి అని అడిగారు. హంద్రీనీవా, గాలేరు నగరి అంటున్నారు మాకు నికర జలాలు కావాలని అందరూ ఆ మహానుభావుడికి అడ్డంపడ్డారు.  ఆయన ఒకటే అన్నారు. Assured water, assured water అంటున్నారు కానీ, yes water is assured

అని అన్నారు. మరి శ్రీరామకృష్ణయ్య లాంటి ఇంజనీర్లను పెట్టుకుని పనిచేశారు. (గౌరవ మంత్రి శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డిని చూపిస్తూ) వీరంతా కూడా ఆ మహానుభావుడితో కలిసి పనిచేశారు. ఆ మహానుభావుడు ఏదైతే నీళ్లు నికరం అని అన్నారో, ఆ నీళ్లు నికరమై ఈనాడు తెలుగుగంగ రాయలసీమను కాపాడింది. హంద్రీనీవా కర్నూలు, అనంతపురాన్ని కాపాడింది. వచ్చే సంవత్సరం చిత్తూరును కాపాడబోతోంది. అదేవిధంగా గాలేరు నగరి కడపను కాపాడబోతోంది. ఆనాడు వారు చేసిన మహా సంకల్పం, వారి దూరదృష్టి , 30 సంవత్సరాల క్రితం వారు ఆలోచించిన స్కీమ్స్ అన్నీ కూడా ఇప్పుడు పూర్తి చేసే అదృష్టం ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి దక్కింది. తప్పకుండా ఈ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాము. రాయలసీమను సస్యశ్యామలం చేస్తాము. ఇవాళ నేను పెట్టమంటే కేంద్రప్రభుత్వం ట్రిబ్యునల్‌ను పెట్టదు. ఆ రోజున మూడు రాష్ట్రాలు అడిగాయి. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర. ఈ రోజున నాలుగు రాష్ట్రాలు అడుగుతాయి. కోర్టులలో కేసులు నడుస్తున్నాయి. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మీద మా ఆవేదనను ఉమాభారతి గారికి తెలియచేశాము. కేంద్ర ప్రభుత్వానికి, సెంట్రల్ వాటర్ కమీషన్‌కు తెలియచేశాము. APEX Committee సభ్యులు, రైతు సంఘ సభ్యులు సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అడిగింది. తెలంగాణా ప్రభుత్వాన్ని, కేంద్రాన్ని అడిగింది. 6 వారాల్లో మా వాదనలను కూడా వినిపించమని తెలిపింది. తప్పకుండా కృష్ణా జలాలపైన హక్కులు కాపాడడానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో నిలబడుతుంది. ఆయకట్టు చివరి రైతుగా ఆ కష్టాలు నాకు తెలుసు. సుమారు 20 ఏళ్లు శాసనసభ సభ్యుడిగా ఆ రైతుల కష్టాలు నాకు తెలుసు. నేను ఆ కష్టాలు బాధలు చూసినవాడినే. ఇవాళ రాయలసీమ కరువు ప్రాంతం ఎన్ని బాధలు పడుతున్నదో, కృష్ణా జిల్లాలో మెట్ట రైతులు ఎన్ని బాధలు పడుతున్నారో, చివరి భూములలో నా నియోజకవర్గంలో, నా రైతు పడే బాధ, రాయలసీమ రైతు బాధ నాకు తెలుసు. తప్పకుండా కృష్ణా జలాల హక్కులు కాపాడడానికి సుప్రీంకోర్టు ముందు మన వాదనలను వినిపించడానికి అనేక జాగ్రత్తలను తీసుకుంటున్నాము అధ్యక్షా. గౌరవ సభ్యులు చెప్పినవన్నీ గమనంలో పెట్టుకుని ఎక్కడికక్కడ రాయలసీమ ప్రాంత ప్రజల కష్టాలు తీర్చడానికి మేము చిత్తశుద్ధితో ఉన్నామని మనవిచేస్తున్నాను. మడకశిర రిజర్వాయర్ గురించి సభ్యులు ప్రస్తావించారు. గౌరవ సభ్యులు అడిగినవన్నీ కూడా నోట్ చేసుకున్నాను. సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చి రాయలసీమ రతనాలసీమ అవడానికి అన్ని చర్యలు తీసుకుంటాము.

మ.1.30

డా.ఎం.గేయానంద్: అధ్యక్షా, వారు కృషిచేస్తున్నారు, అభినందనలు. కానీ, రాయలసీమ ప్రజల్లో మాకు నికరజలాలు కావాలనే ఆకాంక్ష ఉంది. అంటే, “water is assured” అనేది ఇప్పటికి సరిపోతుంది. కానీ, నికరజలాల గురించి చరిత్రలో రాయలసీమకు చాలా అన్యాయం జరిగిందనే ఫీలింగ్ ప్రజల్లో చాలా ఉంది. మీరు నదుల అనుసంధానం వంటివి ఏదో ఒకటి చేస్తున్నారు. కనీసం ఇప్పటినుంచి అయినా ఆ ప్రాంతానికి నికరజలాలు ఇవ్వడానికి ఏదో ఒక పద్ధతిలో ప్రారంభించవచ్చు కదా?

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ జడ్జిమెంట్లన్నీ కూడా సుప్రీంకోర్టులో ఉన్నాయి. ఆ రెండు రాష్ట్రాలు కూడా ఎందుకు మీరు ఇంకా పెండింగ్ పెడుతున్నారని సుప్రీంకోర్టు మీద ఒత్తిడి తెస్తున్నాయి. ఒక పక్క మన రాష్ట్రం నుంచి, మరొక పక్క ఆ రెండు రాష్ట్రాల నుంచి, ఇంకొక పక్క తెలంగాణ రాష్ట్రం నుంచి వాదనలు జరుగుతున్నాయి. ఆ అంశం న్యాయపరిధిలో ఉంది. తప్పకుండా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి కృష్ణానది మీద

గానీ, గోదావరి నది మీద గానీ ఈ రాష్ట్రప్రభుత్వం న్యాయపోరాటం మరియు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటుంది. అంతేగాక, రాయలసీమ ప్రాంతం మరియు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కూడా పెండింగ్ ప్రాజెక్టులన్నీ కూడా పూర్తిచేయడానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో కష్టపడి కృషిచేసి పూర్తిచేస్తుందని తమరిద్వారా నేను సభకు తెలియజేస్తున్నాను.

MR.CHAIRMAN: The Finance Minister has come with a resolution.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, తమరి అనుమతితో, గౌరవ ముఖ్యమంత్రి గారి తరఫున నేను ఈ క్రింది తీర్మానాన్ని సభ ఆమోదం కొరకు ప్రవేశపెడుతున్నాను.

## తీర్మానం

రాష్ట్ర పునర్విభజనకు సంబంధించి ఉత్పన్నమైన సమస్యల పరిష్కారంలో కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ సభ ఏకగ్రీవంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014 లో పేర్కొన్న అన్ని హామీలను, అప్పటి ప్రధానమంత్రి 20.02.2014 న రాజ్యసభలో ప్రకటించిన హామీలను త్వరితగతిన అమలుచేయాలని కోరుతోంది.

1. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం
2. ఆర్థిక వనరుల కొరతను అధిగమించేందుకు నిధులను విడుదల చేయడం
3. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2018 లోపు పూర్తిచేయడం
4. పారిశ్రామికీకరణను ప్రోత్సహించి ఆర్థికాభివృద్ధిని పెంపొందించేందుకు పన్ను రాయితీలు తదితర ప్రోత్సాహకాలు చేపట్టడం
5. నూతన రాజధాని నిర్మాణానికి ప్రత్యేక ఆర్థిక సహకారం అందించడం
6. రాయలసీమ మరియు మూడు ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి ఇవ్వడం
7. షెడ్యూల్ – 13 లో ప్రతిపాదించిన అన్ని విద్యాసంస్థల ఏర్పాటు, మౌలికవసతుల కల్పన సకాలంలో పూర్తిచేయడం
8. విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటు
9. శాసనసభలో సీట్ల సంఖ్యను 175 నుంచి 225కు పెంచడం
10. విద్య మరియు ఉపాధికి సంబంధించి స్థానికత అంశంపై రాష్ట్రపతి ఉత్తర్వుకు సవరణ
11. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు, దుగ్గిరాజుపట్నంలో ఓడరేవు నిర్మాణం, గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ మరియు పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు
12. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు మరియు గ్రేహౌండ్స్‌కు నూతన క్రియాశీల విభాగాల ఏర్పాటు మరియు అదనపు పోలీసు బలగాల పెంపునకు పోలీసు శాఖకు సహకారం
13. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014లో పేర్కొన్న సెక్షన్ – 8 అమలు
14. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014లో పొందుపరచిన షెడ్యూల్ 9, 10లో పేర్కొన్న సంస్థలకు చెందిన ఆస్తులు, అప్పులు, ఉద్యోగులను సక్రమంగా, సహేతుకంగా పంపిణీ చేసేందుకు చర్యలను చేపట్టడం
15. రాష్ట్రానికి వెలుపల ఉన్న ఆస్తుల పంపిణీ

16. రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ ఉద్యోగుల పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయడం
17. పన్ను రాబడులలో వ్యత్యాసాలను చక్కదిద్దుతూ పునర్విభజన చట్టానికి సవరణలు చేయడం

విభజన చట్టంలోని అన్ని అంశాలను మరియు పార్లమెంట్‌లో ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలుచేసి, పొరుగు రాష్ట్రాలతో సమానస్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకునేంత వరకు చేయూత ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఈ సభ తీర్మానిస్తోంది.

(సభలో హర్షధ్వానాలు)

మిస్టర్ ఛైర్మన్: శాసనసభలో సభ్యుల సంఖ్య పెరిగినపుడు శాసనపరిషత్తులో సభ్యుల సంఖ్య కూడా దానితో పాటు పెరుగుతుంది కదా? దానికి ఏదైనా సవరణ కావాలా? మంత్రిగారూ చెప్పండి.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, రాజ్యాంగం ప్రకారం ఆటోమేటిక్‌గా మన సభలో సభ్యుల సంఖ్య కూడా పెరుగుతుంది. అపుడు మరికొంతమంది సభ్యులను సభలో చూడవచ్చు. దానికి సవరణ అవసరం లేదు.

శ్రీ బి.చంగల్‌రాయుడు: అధ్యక్షా, proportionate గా వస్తుందని మంత్రిగారు చెబుతున్నారు. అడగనిదే అమ్మ అయినా పెట్టదు. శాసనసభల సభ్యుల సంఖ్యను 225 కు పెంచుతూ, proportionate గా శాసనపరిషత్తులో కూడా సభ్యుల సంఖ్యను కూడా పెంచవలసిందిగా కోరుతూ తీర్మానం చేద్దాము.

మరొక విషయం, ఏడవ పాయింట్‌లో "షెడ్యూల్ – 13 లో ప్రతిపాదించిన అన్ని విద్యాసంస్థల ఏర్పాటు" వీటితో పాటు మిగిలిన విద్యాసంస్థలు, అదేవిధంగా, తునిలో ఒక విద్యాసంస్థ మరియు కాకినాడలో IIIT లేదా National Institute for Teaching గానీ అమలుచేసే విధంగా పెట్టండి సార్.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, శాసనసభలో సభ్యుల సంఖ్య పెరిగినపుడు proportionate గా శాసనపరిషత్తులో కూడా సభ్యుల సంఖ్యను పెంచడం కోసం constitutional provision ఉన్నది. దానికి ప్రత్యేకంగా మనం రికమెండ్ చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే, రాజ్యాంగంలోనే ప్రొవిజన్ ఉన్నది.

సభ్యులు మాట్లాడుతూ, ఏడవ పాయింటులో ఉన్న షెడ్యూలు -13 లో ప్రతిపాదించిన విద్యాసంస్థల గురించి చెప్పారు. తునిలో ఇచ్చిన IIIT వంటి సంస్థలన్నీ కూడా ఆ ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఇచ్చుకోవడం జరిగింది. ఇక్కడ మనం తీర్మానించి చేసుకునేది ఏమిటంటే, పునర్విభజన చట్టానికి సంబంధించినంత వరకూ అదేవిధంగా, పార్లమెంటులో రాజ్యసభలో గానీ, లోక్‌సభలో గానీ చర్చించిన అంశాల్లో spontaneous గా హామీలు ఇచ్చినవి ఈ రెండింటికి సంబంధించిన తీర్మానం.

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి(నామినేటెడ్): అధ్యక్షా, ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు కూడా ప్రకటించండి.

MR. CHAIRMAN: Since there is unanimity among all Members, the Resolution moved by the Hon'ble Finance Minister is hereby adopted unanimously.

Now discussion on Budget will continue. Sri T.D. Janardhan Reddy garu, initiate the discussion.

## 4.బడ్జెట్‌పై సాధారణ చర్చ :

మ.1.40

శ్రీ టి.డి. జనార్ధన్ (నామినేటెడ్): అధ్యక్షా, బడ్జెటుపై మాట్లాడడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదములు. గత సంవత్సరం కంటే 20 శాతం అధికంగా ఈ సంవత్సరం బడ్జెటును ప్రవేశపెట్టినందుకు ఆర్థికమంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారిని, ప్రభుత్వాన్ని కూడా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాము. అంతేగాక, ప్రణాళిక పద్దుల మీద ఖర్చులు పెరగడం, ప్రణాళికేతర పద్దుల మీద ఖర్చులు తగ్గడం అనేది రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆర్థిక క్రమశిక్షణకు, ముందుచూపుకు నిదర్శనం. అయితే, ఏ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ బడ్జెటు ప్రవేశపెట్టిందనేది అందరూ ఆలోచించాలి. ఒక ప్రత్యేకమైన పరిస్థితులలో రాష్ట్ర విభజన జరిగింది. విభజన జరిగిన తీరు మనందరికి కూడా తెలుసు. ప్రపంచంలో ఎక్కడా జరుగని విధంగా రాష్ట్ర విభజన జరగడం వల్ల, తెలుగుజాతికి అన్యాయం జరిగింది. చాలా పెద్ద ఎత్తున మన రాష్ట్రానికి లోటు రావడం జరిగింది. ప్రస్తుతం ఒక రాజధాని కూడా లేనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రానికి ఉంది. చాలా ఉద్యోగ సమస్యలు మనకు తలెత్తుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రస్తుతం రాష్ట్రం ఉంది. గత 10 సంవత్సరాల పాలన కూడా దీనికి తోడయింది. గత10 సంవత్సరాల పాలనలో పేద ప్రజానీకానికి అందవలసిన సంపదంతా కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమై వారి బంధువులు, మిత్రులు, వారి అనుంగు అనుచర వర్గం చేతులలోకి వెళ్లి దోపిడీకి గురైన పరిస్థితి మనం చూశాము.

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు 1995వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చినపుడు రాష్ట్రంలో వనరులు లేని పరిస్థితి. వారు అధికారంలోకి రాక ముందుకూడా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన జరిగింది. ఆయన బాధ్యత తీసుకున్న వెంటనే ప్రభుత్వం ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రం వారి చేతుల్లోకి వచ్చిందో శ్వేత పత్రాలు ప్రకటించి తెలియజేశారు. దాదాపు తొమ్మిదిన్నర సంవత్సరాల తెలుగుదేశ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాలను ఒక్కొక్కటిగా సంస్కరించారు. వరుసగా 4 సంవత్సరాలు కరవు ఉన్నప్పటికీ, దానిని ఎదుర్కొంటూ, రాష్ట్రాన్ని ఒక దారిలో పెట్టి ప్రపంచంలోనే ఒక గుర్తింపు తీసుకువచ్చి, పెట్టుబడులను ఆకర్షించి ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీని ఏర్పాటు చేసిన విధానం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని తీసుకువచ్చిన విధానం మనందరం చూశాము. ఐటీ ద్వారానే పేదకుటుంబాలు, రైతు కుటుంబాల పిల్లలకు ఉపాధి కలుగుతుందని, పేదరిక నిర్మూలనకు ఇది పెద్ద ఆయుధమని ఆయన 20 సంవత్సరాల ముందు చూపుతో ఆలోచించారు. ఆ విధంగా తొమ్మిది సంవత్సరాలు రాష్ట్రాన్ని ఒక దారిలో పెట్టి, నారు పోసి, నీరు పెట్టి, యూరియా వేసి, క్రిమి సంహారక మందులు వేసి, బాగా చెట్లు పెరిగేలా చేశారు. తీరా పంట దిగుబడి వచ్చే సమయంలో ప్రభుత్వాన్ని చేపట్టిన పాలకులు తోటలో ఉన్న పండ్లన్నింటినీ పేద ప్రజలకు అందకుండా దోపిడీ

చేయడం జరిగింది. కొంతమంది వ్యక్తుల చేతుల్లోనే సంపదంతా కేంద్రీకృతమైంది. అలాంటి క్లిష్టపరిస్థితికి రాష్ట్ర విభజన తోడయింది. మరల ఇలాంటి పరిస్థితుల్లో ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవలసిన బాధ్యత వారికి వచ్చింది. అదేంటో గానీ, శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఎప్పుడు పరిపాలనలోకి వచ్చినా, ఇటువంటి క్లిష్టపరిస్థితులను చక్కబెట్టే పరిస్థితి వస్తుంది. పది సంవత్సరాలలో రాష్ట్రం ఎంత చిన్నాభిన్నమైందనే విషయాలు అన్ని వర్గాల ప్రజలు ఆయనకు చెబుతుంటే జరుగుతున్న అరాచకాలు, పాలనను చూసి తట్టుకోలేక, 67సంవత్సరాల వయసులో కూడా వారు పాదయాత్ర చేపట్టారు. 16 జిల్లాలలో 2,817 కి.మీలు రాత్రి–పగలు, ఎండ–వాన , చలి వేటిని కూడా లెక్క చేయకుండా సుదీర్ఘంగా వారు పాదయాత్ర చేసి, ఊరు ఊరు, సందుసందు, గుడిసెలన్నీ తిరిగి, అందరి యొక్క సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఆ సమస్యలన్నింటినీ వారు ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచారు. అందులో భాగంగానే ప్రజలు చాలా ఇబ్బందులో ఉన్నారని, ఇచ్చే పెన్షన్లు చాలడం లేదని, పెరిగిన ధరలకు సరిపోయిన జీతాలు లేవని పిల్లలు చూసీ చూడక ముసలి వాళ్లంతా ఇబ్బందుల్లో ఉన్నారని వారు గుర్తించారు. పింఛన్లను 5 రెట్లు పెంచి చరిత్రలో, దేశంలో కూడా ఎక్కడాలేని విధంగా రాష్ట్రం ఎంత క్లిష్టపరిస్థితుల్లో ఉన్నా మానవ సంక్షేమం కోసం వాళ్లందరి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని వృద్ధాప్య పింఛన్‌ని రూ.1000కి, వికలాంగుల పింఛన్‌ని రూ.1500కు పెంచడం జరిగింది. ఇది ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం. "ఎన్.టి.ఆర్. భరోసా" పేరుతో వారికి భద్రత కల్పించడం జరిగింది.

ఆహారభద్రతా విషయంలో ఎంత ముందు చూపంటే, ఆనాడు ఎన్.టి. రామారావు గారు, ఈనాడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పాలన ఈ రాష్ట్రంలో వచ్చిన తరువాత మాత్రమే ఈ విషయంలో ఒక విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. ఈ ప్రభుత్వం గ్రామసీమల అభివృద్ధిని, రైతాంగం అభివృద్ధిని, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తుంది. ఒక సంక్షేమ అభివృద్ధి పాలనకు వారు బీజాలు వేశారు. ఆయన అప్పట్లో కిలో రూ.2ల బియ్యం అంటే అందరూ ఆశ్చర్యపోయారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, ప్రపంచ దేశాలు కూడా ఆహార భద్రత అని మొత్తుకుంటున్నారు. అంత ముందు చూపుతో తెలుగుదేశం పాలకులు పాలన చేస్తున్నారనేటువంటి దానికి ఇదొక మచ్చు తునక.

అలానే సబ్‌ప్లాన్స్ పెట్టి బడుగు, బలహీన వర్గాలన్నింటినీ ఆదుకోవడానికి, ప్రాధాన్యత ఇవ్వడం కోసం, ఎస్సీ, ఎస్టీ,బీసీ సబ్‌ప్లాన్‌లను పెట్టడం జరిగింది. అంతేకాకుండా బీసీ సబ్‌ప్లాన్ పెట్టి, మైనారిటీలే కాకుండా బ్రాహ్మణ, కాపు సోదరులు చేనేత ఇలా అన్ని వర్గాలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇచ్చి ఈ బడ్జెటులో కేటాయింపులు చేయడం జరిగింది. ముఖ్యంగా గత బడ్జెటు కంటే ఎస్సీలకు 59 శాతం, మైనారిటీలకు 87 శాతం అదనంగా కేటాయించారు. బ్రాహ్మణులకు సుమారు రూ.67కోట్లు ఈ బడ్జెటులో కేటాయించడం జరిగింది. అంతేగాక బీసీలకు ముప్పైఒకటిన్నర శాతం అదనంగా ఇవ్వడం జరిగింది. కాపులు, బ్రాహ్మణులు, పేద ప్రజలు సమాజంలో ఉండి ఇబ్బంది పడుతున్నారు కాబట్టి వారిన ఆదుకోవడం కోసం కాపులకు సుమారు రూ.1000కోట్లు, బ్రాహ్మణులకు సుమారు రూ.67కోట్లు బడ్జెటులో పెట్టడం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం.

చేనేతరంగ విషయానికి వస్తే, వ్యవసాయం తరువాత అత్యధిక ప్రజానీకం ఆధారపడిన, జీవనోపాధిని కలిగించే రంగం అని గుర్తించి 172 శాతం అదనంగా నిధులు ఈ రంగానికి కేటాయించడం జరిగింది. అదే సమయంలో పారిశ్రామిక రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా 43 శాతం నిధులు కేటాయించడం జరిగింది. కడపలో హజ్ హౌస్‌ని, గుంటూరులో క్రిస్టియన్ భవన్‌ని

నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. కార్మికుల విషయానికి వస్తే, ఈ దేశంలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే కార్మికుల క్షేమాన్ని కూడా మనం చూడాలి. గతంలో ప్రమాదాలు జరిగి, జీవితాలు కోల్పోయిన వారికి రూ.30వేలు ఇచ్చేవారు. మా ప్రభుత్వం వెంటనే దానిని రెండున్నర లక్షల రూపాయలు చేసింది. జీవితాంతం వరకు నెలవారీ పింఛనును రూ.1000లు చేశారు. అంతేకాదు దేశంలో మొట్టమొదటిసారిగా నాలుగున్నర లక్షలమంది డ్రైవర్లు ఉన్నారు. నిత్యం రోడ్ల మీద వాహనాలు నడుపుతూ ఉండే డ్రైవర్లకి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ కనుక, ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకుని దాదాపు రూ.5 లక్షల బీమా దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఇస్తోంది. అంతేకాదు అసంఘటిత కార్మికుల సమస్యలు కూడా ఈ ప్రభుత్వం పట్టించుకుని వారికి కూడా రూ.5లక్షల బీమా ఇస్తుంది. అలాగే అభివృద్ధి జరగాలంటే ముఖ్యమైన వారు భవన కార్మికులు. ఆ రోజు తాజ్‌మహల్‌కి రాళ్లెత్తిన కూలీలెవరని అన్నారు. ఈ రోజు మన అభివృద్ధి భవనాలకు రాళ్లెత్తే కూలీలకు బీమా పథకం కింద రూ.2 లక్షలు వర్తింపచేశాము. గత ప్రభుత్వం డిఎస్సీ తీసుకువస్తామని మాటలు చెప్పి, ఒక సంవత్సరం తీసుకురావడమే గొప్పగా జరిగిపోయింది. ప్రతి సంవత్సరం తీసుకువస్తామని చెప్పి, ఆడిన మాట తప్పారు. కానీ మన ప్రభుత్వం డిఎస్సీ నోటిఫికేషన్ తీసుకువచ్చి, నిరుద్యోగులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నది.

మ. 1.50

అంతేకాదు, స్కిల్ డెవలప్‌మెంట్ సెక్టార్స్‌ను అన్ని జిల్లాలలో పెట్టి, స్థానికంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండేవారి యొక్క అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని, కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి సంబంధించి కూడా సరైన ఆలోచనలు చేసి, పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడానికి, వారి ఆదాయవనరులు పెంచడం కోసం కూడా ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. అంతేకాదు, మరికొంత ముందుకు వెళ్ళి, నియోజక వర్గాలలో కూడా ఒక్కొక్క స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టి, ఆయా ప్రాంతాలలోను, గ్రామ సీమలలో ఉన్న చేతివృత్తులు, కులవృత్తుల వారి యొక్క నైపుణ్యాన్ని పెంపొందించి, వారికి ఉత్పాదక శక్తి పెంపొందించడం కోసం అధునాతన పనిముట్లు అందించవలసిందిగా ప్రభుత్వానికి నేను తమ ద్వారా సూచన కూడా చేస్తున్నాను. అంతేకాకుండా, ఇప్పుడే మంత్రిగారు ఒక తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. విద్యాసంస్థలను కూడా చూశాము. కేంద్రం ఏదైతే హామీలు ఇచ్చిందో, వాటిని సాధ్యమైనంతవరకు నెరవేర్చుకున్నాము. ఇంకా ఏవైతే హామీలు ఉన్నాయో, అందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావడం కోసం ఈ ప్రభుత్వం అనుక్షణం పనిచేస్తోంది.

అధ్యక్షా, మనకు సంక్షేమంతోపాటు వ్యవసాయం కూడా ప్రధానమైన రంగమే. వ్యవసాయానికి ఈ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడే ఇరిగేషన్ శాఖామాత్యులు చెప్పారు. రాయలసీమలో ఉన్నటువంటి అన్ని పథకాలకు దాదాపు 68 సంవత్సరాల కాలంలో ఎవరు ఇవ్వనటువంటి ప్రాధాన్యతను మనం ఈరోజు ఇస్తూ, వాటిని కూడా ముందుకు తీసుకువెడుతున్నాము.

గాలేరు-నగరి, హంద్రీనీవా మొదలైన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కంకణం కట్టుకున్నాము. బహుళార్థసాధకమైనటువంటి పోలవరం ప్రాజెక్టును కూడా 2018వ సంవత్సరానికల్లా పూర్తిచేయడానికి తగిన సన్నాహాలను ఈ ప్రభుత్వం చేసే పరిస్థితి ఉంది. అంతేకాదు, నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా 39,000 చెఱువులలో పూడికలు తీసి, దాదాపు 5

టిఎంసిల నీటిని అదనంగా నిల్వచేయగలిగారు. ఈరోజున గ్రామసీమలలో చెఱువులు అన్నీ నిండి కళకళలాడుతున్నాయి. ఈ మధ్యకాలంలో వర్షాలు రావడం వలన నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో వంద యేళ్ళ నుంచి నిండని చెఱువులు నిండితే, ఆ ప్రాంతాలలోని ప్రజల ఆనందం అంతా ఇంతా కాదు. భూగర్భ జలాల యొక్క నీటిమట్ట స్థాయి కూడా పెరిగింది. తద్వారా మంచినీటి సామర్థ్యం కూడా పెరిగింది. అందుకే దానిని గమనించిన ముఖ్యమంత్రిగారు దాదాపు 5 ఎకరాలు ఉన్న ప్రతి రైతు పొలంలో ఒక పంట సంజీవని అనేటటువంటి ఒక చిన్న కుంటను తయారు చేసి, తద్వారా రాష్ట్రంలో దాదాపు 3.30 లక్షలకు తగ్గకుండా ఈ పంటసంజీవని కుంటలను ఏర్పాటు చేయాలని, వాటిల్లో నీటిని నిల్వ చేయాలని తద్వారా భూగర్భజలాలను పెంపొందిస్తూ, మంచినీరుకు, సాగు నీరుకు, చేలల్లో వేసే బోర్లు మొదలైన వాటికి సంబంధించి వాటర్ టేబుల్ పెంచే విధంగా ఒక పద్ధతి ప్రకారం ఈ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. అంతేకాదు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బోర్లు వేసుకునేందుకు వారికి ఆదాయం తక్కువగా ఉంటుంది కనుక, ఎన్.టి.ఆర్. జలసిరి పేరుతో మొదటి దశలో దాదాపు 50,000 బోర్లను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వం సంకల్పించింది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ మంత్రిగారు కూడా బడ్జెట్‌లో పెట్టారు. అందుకు వారిని అభినందిస్తున్నాను. కానీ, మాకు ఇక్కడ తెలిసిన సమాచారం ప్రకారం subject to correction అక్కడ నీరు పడితేనే డబ్బులు ఇస్తారు, నీరు పడకపోతే డబ్బులు ఇవ్వరు అనే సమాచారం మాకు గ్రామాల నుంచి వచ్చింది. ఒకవేళ, ఇది నిజమయితే, ఈ నిబంధనను తొలగించాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ఎందుకంటే, ఆయా ప్రాంతాలలో నీరు పడేది, పడనిది రైతులకు తెలియదు. నీరు పడితే 10 రూపాయల వరకు పెట్టుకోమంటే అర్థం ఉంది కానీ, నీరు పడకపోతే, వంద రూపాయలు పెట్టుకోమంటే, మూలిగే నక్క మీద తాటికాయపడినంత బాధగా ఉంటుంది.

మిస్టర్ ఛైర్మన్ : జియాలజిస్టులు పరిశీలిస్తారు.

శ్రీ టి.డి. జనార్ధన్ : అధ్యక్షా, జియాలజిస్టులు చూస్తారు. అక్కడ నీరు పడినా, పడకపోయినా రైతుకు సంబంధం లేకుండా వారికి సహాయం చేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

అంతేకాదు, రహదారుల విషయంలో కూడా ఈ ప్రభుత్వం చాలా పకడ్బందీగా ప్రణాళికలను తయారు చేసింది. అందుకు ఈ ప్రభుత్వాన్ని అభినందించక తప్పదు. ఎందుకంటే, గ్రామసీమలలో గతంలో ఎప్పుడూ లేని విధంగా, ఇంతవరకూ స్వతంత్ర భారతంలో ఏ ప్రభుత్వం, ఏ రాష్ట్రంలో చేయని విధంగా, వాడ వాడకి, ఇంటి ఇంటికి సిమెంటు రోడ్డు వేసేటటువంటి బ్రహ్మాండమైన నిర్ణయాన్ని ఈ ప్రభుత్వం తీసుకుంది. చంద్రన్న బాట అని ప్రజలు ఎంతో ఆనందంగా పేరు పెట్టుకున్నారు. అయితే, ఈ రోజు వేల కిలోమీటర్లు అంటే, సంవత్సరానికి దాదాపు 3,000 కి.మీ. తక్కువ కాకుండా వేయాలనే ఒక విప్లవాత్మకమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. మనం గ్రామాలలో పర్యటించేటప్పుడు ఆ ప్రాంతాలలోని పేదవర్గాల వారి బజార్లు అన్ని వర్షాలు పడినా, తుఫానులు వచ్చినా గిలకల్లోతు నీళ్ళుండి, నానా ఇబ్బందిగా ఉండే పరిస్థితి ఉంది. తద్వారా అక్కడ రొచ్చు రొచ్చు అయి, దోమలు వచ్చి, ఆ ఇంటినిండా బాధలు మొదలైనవి లేకుండా చాలా పరిశుభ్రంగా అక్కడ సిమెంటు రోడ్లు వేసి, డ్రెయిన్స్ వేసి, పల్లెలన్నీ కూడా ఒక ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడానికి ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వచ్చే మూడు సంవత్సరాలలో దాదాపు 10 వేల కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లను వేయబోతున్నారు. అంతేకాదు, గ్రామాల

నుంచి మండలాలను కలిపే రహదారులను వేస్తున్నారు. మండలాల నుంచి జిల్లాలకు రెండు వరుసల రహదారులను వేయాలని, జిల్లాల నుంచి జిల్లాలకు నాలుగు వరుసల రహదారులు వేయాలని, జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు లేక ఆరు వరుసల రహదారులు వేయాలని ఇంకా ముఖ్యమైనది ఏమిటంటే, అనంతపురం-కర్నూలు జిల్లాల నుంచి వచ్చే రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కూడా ఈ ప్రభుత్వం సంకల్పించింది. ఈ విధంగా గ్రామ సీమల నుంచి రాజధాని వరకు రహదారులకు ఒక పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నాము. అంతేగాకుండా, ఇంకా అనేక మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకు పోతున్నాము.

ఇక రాజధానికి సంబంధించి చూసినట్లయితే, ప్రపంచ చరిత్రలో భూమి పుట్టాక ఇంతవరకూ ఎవరూ ఇంత గొప్పగా భూసేకరణ చేయలేదు. నేను ఎందుకంత ధైర్యంగా చెపుతున్నానంటే, ఎక్కడ భూసేకరణ చేసినా భూములిచ్చిన రైతులందరూ పేదలయ్యారు, కూలీలు అయ్యారు, వలసలు పోయారు. మీరు ఏ ప్రాజెక్టునైనా చూసుకోండి. ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా కానీ, ఏ పరిశ్రమ కానీ, ప్రాజెక్టు కానీ చూసినా అందరూ పేదవారు అయ్యారు. ఆ విషయాలన్నీ మన ముఖ్యమంత్రిగారు ఆలోచించి, రాజధానికి ఎవరైతే భూములు ఇస్తారో, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే పెద్ద మనసుతో ఆలోచించారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమం చేస్తే, ఫలితం మనతోబాటు భూములు ఇచ్చిన రైతులకు కూడా అందాలి. దానికి రైతులు మెచ్చారు. అందువల్ల వారు ఒక్క పిలుపుతో నాయకుడి మీద నమ్మకంతో దాదాపు 33వేల ఎకరాల భూమిని ఇచ్చారు. ఇది సామాన్యమైన విషయం కాదు. పశ్చిమ బెంగాల్‌లో టాటా ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు 100 ఎకరాల భూమి సేకరించాలంటే, అప్పటి ప్రభుత్వం పల్టీ కొట్టినటువంటి పరిస్థితిని మనం చూశాము. భూసేకరణ ఎంత క్లిష్టమైన సమస్యో మనకు తెలుసు. అట్లాంటిది మనం సులభంగా రైతుల మనసును చూరగొని, వారి అనుమతితో ఈ భూసేకరణ చేశాము. ఈ ప్రభుత్వం ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా, అందరికీ ఆమోదయోగ్యంగా అందరూ మెచ్చే విధంగా, అభివృద్ధి కార్యక్రమాలలో వారిని కూడా భాగస్వాములను చేస్తూ, అభివృద్ధి ప్రతిఫలం వారికి కూడా అందే విధంగా కార్యక్రమం చేయడం చాలా అభినందదాయకం. అలాగే, ప్రపంచంలో అందరూ మెచ్చే విధంగా ఏ దేశంలోను లేనటువంటి అధునాతనమైనటువంటి సౌకర్యాలతో మనకు తెలుగు జాతికి ఒక కిరీటంలో కలికితురాయి లాగా మనకు అమరావతి రాజధానిని ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకంగా ఒకటి, రెండు కాదు, గత 10 సంవత్సరాలలో పాలకులు పెట్టిన ఇబ్బందులు, విభజన వల్ల వచ్చినటువంటి కష్టాలు, వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వాన్ని నడుపుతూ, ప్రజలను మెప్పించే విధంగా ముందుకు పోవడానికి దాదాపు 67 సంవత్సరాల వయస్సులో అలుపెరగకుండా పని చేస్తున్నారు. నేను శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడిగారిని చూశాను. గత 10 సంవత్సరాలుగా అతి దగ్గరగా చూశాను. ప్రతిపక్షంలో ఉండగా కేవలం అరగంట సేపు మాత్రమే రెస్టు తీసుకునే వారు. ఇప్పుడు రెస్టు తీసుకున్న రోజే లేదు. నేను ఒక రోజు అడిగాను, వయసు మీద పడుతోందిగా రెస్టు తీసుకోకపోతే ఎలా అన్నాను. ఇన్ని సమస్యలు ఉంటే, నిద్ర ఎలా వస్తుందయ్యా అన్నారు. పైపెచ్చు ఆయన దగ్గర ఒక గొప్ప గుణం ఉంది. ఏ పని చేస్తే, దానిని ఆనందిస్తారు. ఇది ఎలా సాధ్యం అని ఆయన్ని అడిగాను. పనిని ఆనందించడమే మార్గం. అందువల్ల మనం ఆనందంగా చేయగలుగుతాము. అలా పనిచేస్తూ ఉంటే, దానికి ఏదైనా నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలను ఈ కష్టకాలంలో చెప్పాలి గానీ, ఉదయం లేస్తే సాయంత్రం వరకు కదిలినా, మెదిలినా ఏం చేసినా విమర్శలే విమర్శలు చేస్తుంటే

ఎలా? వారిని తమ ద్వారా కోరేది ఏమిటంటే, అభివృద్ధికి అడ్డు తగలద్దని, చేతులెత్తి అన్ని పక్షాల వారిని కోరుతున్నాను.

అధ్యక్షా, ఎందుకంటే, జపాన్‌లో హిరోషిమా నాగసాకి మీద అణుబాంబులు వేస్తే, ఆ దేశం అంతా జాతి యావత్తు ఏకమై, కసిగా, ప్రపంచంలోనే ఇతర దేశాలతో పోటీపడి అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఆ ప్రజలు పనిచేశారు. ఫలితాలు సాధించారు. అవి మన కళ్ళ ముందు కనపడుతున్నాయి. నేను గతంలో ఆప్కాబ్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు మొదటగా నాకు జపాన్ వెళ్ళే అవకాశం వచ్చింది. ఇకపోతే, అక్కడ ఒక సూపరింటెండెంట్ లెవెల్ ఆఫీసర్ ఉన్నాడు. ఇష్టాగోష్టిగా మాట్లాడుతున్నప్పుడు అడిగాను, అయ్యా ! మీ దగ్గర ఎన్ని కులాలు, ఎన్ని మతాల వారు, భాషల వారు ఉన్నారని మనకు ఇక్కడ అలవాటైన పద్ధతిలో ఆయన్ని అడిగితే, అతను ముక్కు మీద వేలు పెట్టుకుని, ' Ish! no caste, no creed, only Japanese......"

మిస్టర్ ఛైర్మన్: హ్యాండ్లూమ్‌లో ఉన్నప్పుడు వెళ్లారు. ఈ సారికూడా ఒక డెలిగేషన్ వేయండి, ఫైనాన్స్ మినిష్టరుగారు ఎంతమందిని తీసుకెళతారో!

శ్రీ టి.డి. జనార్ధన్ : దానికి ఆర్థిక మంత్రిగారు అనుమతించాలి. No caste, no creed, only Japanese, only on nation. అని ఆయన ఏమన్నాడో తెలుసా సార్, "ఇండియా నేను వచ్చి చాలా ప్రాంతాలను చూశాను. పై నుంచి క్రిందకు చూశాను. You have created enough barriers among yourself by way of caste, creed, religions and what not." అని చెప్పి, మీలో మీరే సతమతమైపోతారు తప్ప, మీరు ఆ దేశం విడిచి బయటకు వచ్చే పరిస్థితి మీ దేశంలో లేదని అన్నారు.

మ.2.00

ఈ రోజు అది నిజమని రుజువు అవుతున్న పరిస్థితి ఉంది. చూశారా అధ్యక్షా. ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడొచ్చినా అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తుంది. గత కాంగ్రెస్ పాలన కూడా మీరు చూశారు. ఆనాడు కులాల మధ్య చిచ్చుపెట్టారు. ఈనాడు కూడా అదే ప్రయత్నం జరగబోతోంది. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీతో పోటీపడలేని పక్షాలన్నీ కూడా ఏకమయ్యి తెరమీద, తెరవెనుక కులాల, మతాల పేరుతో సామరస్యంతో, స్నేహభావంతో అన్నదమ్ముల్లా పనిచేసుకుంటున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టడానికి కూడా వెనుకాడటం లేదు. ఈ విషయాన్ని ప్రజలు మొన్న జరిగిన తొలి సంఘటనతోనే గుర్తించారు. అందుకే దానికి స్పందించలేదు. ఐకమత్యంతో వ్యవహరించారు.

నేను ఒక్కటే విన్నపం చేస్తున్నాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమయ్యింది. ఎందుకంటే, మనమందరం కూడా ప్రభుత్వానికి 5 సంవత్సరాల పాటు పనిచేసే అవకాశం కల్పించాము. మంచి చేస్తేనే ప్రజలు మళ్లా మనల్ని ఎన్నుకుంటారు. చేయలేకపోతే ఇంటికి పంపిస్తారు. మనకి చింత ఎందుకండీ? రోజూ ఈ గొడవలన్నీ మానేసేద్దాం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రజలు యావత్తూ కూడా వెన్నుదన్నుగా నిలవడానికి సన్నద్ధం అయ్యారు. కనుక అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలన్నీ ఆలోచించి నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలిచ్చి

వారు తోచిన సహాయం వారు చేస్తూ తెలుగుజాతి అభివృద్ధి కోసం, ఆంధ్రప్రదేశ్‌ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలపడానికి ముఖ్యమంత్రి గారు చేస్తున్న ప్రయత్నాలకు అందరూ కూడా సహకరించాలని చేతులెత్తి కోరుతున్నాను.

పైపెచ్చు ఆయన ఖర్చు గురించి కూడా కొన్ని కామెంట్స్ వస్తున్నాయి. స్పెషల్ ఫ్లైట్‌లో పోయారు, దీన్లో పోయారు, దాన్లో పోయారంటున్నారు. ఒకప్పుడు ఏసీ అంటే అదేదో లగ్జరీ అన్నారు. అదిప్పుడు కామన్ నీడ్ అయ్యింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వేగాన్ని తట్టుకుని మనం ప్రయాణం చేయాలంటే ఖర్చు తప్పనిసరి అవుతుంది. ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు చేసే ఖర్చును ఎక్కడైనా ఖర్చుగా చూడటం కాదు సుమా, దాన్ని ఒక పెట్టుబడిగా ఆలోచించండి. ఆయనంత జాగ్రత్తగా ఖర్చు చేసే నాయకుడిని నేను ఎక్కడా చూడలేదు. ఎందుకంటే, ఆ కాలంలో ప్రభుత్వ ఆస్తులన్నింటికీ ఒక చిట్టా పెట్టారు. ఎమ్మార్వో ఆఫీసు మొదలుకుని, కమీషనర్ ఆఫీస్ దాకా ఒక చిట్టా ఉండేది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వారంతా ఆ ఆస్తులన్నీ ఏం చేశారు అధ్యక్షా. అమ్ముకోలేదా? ఆయన 9 సంవత్సరాలు ప్రభుత్వ ఆస్తులకు కాపలాకాస్తే ప్రజలు  ఇప్పుడు చెప్పుకుంటున్నారు. ఆ మాట నేను చెప్పడం లేదు. అందుకని ఈ రోజున ఆయన చేస్తున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వవలసిందిగా కోరుతూ, మనస్పూర్తిగా చేతులెత్తి నమస్కారం చేస్తూ ఈ అవకాశమిచ్చినందుకు మీకందరికీ, ముఖ్యంగా అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్: చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా..

శ్రీ టి.డి.జనార్ధన్: అవును సార్. చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా..

మిస్టర్ ఛైర్మన్: ఫైనాన్స్ మినిస్టర్ గారూ.. సమయం గం. 02.05 ని.లు. అవుతోంది. We will extend the discussion for tomorrow.

SRI.YANAMALA RAMAKRISHNUDU: It is left to the Chair Sir.

MR.CHAIRMAN: I will go by consensus. I don’t take any independent decisions.

శ్రీ యనమల రామకృష్ణుడు: పెద్దల సభ కాబట్టి పెందలాడే వాయిదా వేస్తే సభ్యులు వెళతారు. అందరూ షుగర్లు, బీపీ ఉన్నవాళ్లు ఉన్నారు.

మిస్టర్ ఛైర్మన్: బాలసుబ్రహ్మణ్యం గారూ.. చంద్రశేఖర రావు గారూ.. We will meet again tomorrow.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: ఓకె సార్.

MR.CHAIRMAN: House unanimously agreed to meet again tomorrow. రేపు మీ రిప్లై కూడా ఉంది సార్.

శ్రీ యనమల రామకృష్ణుడు: రేపు అసెంబ్లీలో కూడా రిప్లై ఇవ్వాలి సార్. అక్కడ లేటవుతుంది.

MR.CHAIRMAN: Okay. Now, the House is adjourned to meet again tomorrow Thursday, the 17th March, 2016 at 10.00 a.m.

(Then, the House adjourned at 2-05 p.m.)

* * *